www.manatelangana.news
Mana Telangana

మన తెలంగాణ

హైదరాబాద్ | సంపుటి 6 | సంచిక: 45 | శుక్రవారం | 4 ఆగస్టు, 2017

...అక్షరం సాక్షిగా ఇది ప్రజల పక్షం

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

పేజీలు: 12 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00

కన్నడ కృష్ణలీల

కృష్ణా నదిలో శ్రుతిమించిన కర్ణాటక జలచౌర్యం, సాగర్ ఎడమ కాల్వకు శాపం



మన తెలంగాణ/ హైదరాబాద్: కర్ణాటక అడ్డగోలు నీటి దోపిడీ నాగార్జున సాగర్ ఎడమ కాలువ రైతులకు ఏడుపే మిగల్చనుందా..? అంటే అవుననే సమాధానాలే వినిపిస్తున్నాయి. వర్షకాలం సగం అయిపోయినా, కృష్ణా నది పై ఉన్న శ్రీశైలం, నాగార్జునసాగర్‌లోకి నీరు చేరకపోవడం, వచ్చిన నీరంతా కర్ణాటకలో బందీ కావడమే దీనికంతటికీ కారణం. గత సంవత్సరం కూడా సెప్టెంబరులో శ్రీశైలానికి ఎగువ నుంచి నీరు వచ్చినా, నాగార్జునసాగర్‌కు వదలలేదు. ఫలితంగా ఈ సీజన్లో తాగునీటికి కటకట ఏర్పడే ప్రమాదం పొంచివుంది. ఇదిలా ఉండగా కర్ణాటకలో వచ్చిన నీటిని వచ్చినట్లే మళ్లిస్తున్నట్లు తప్పుడు లెక్కలు చూపుతున్నారు. ఈ సీజన్లో ఆల్మట్టి రిజర్వాయర్లలో 145.04 టిఎంసిల నీరు వచ్చింది. దీనికి అదనంగా వాటర్ ఇయర్ ప్రారంభమయ్యే నాటికి 10.53 టిఎంసిల నీరు తరువాయి 6లో



ఎన్‌హెచ్‌గా రాజీవ్ రహదారి

మన తెలంగాణ / హైదరాబాద్ : సికింద్రాబాద్ – కరీంనగర్ మధ్యన 150 కి.మీ పొడవు ఉన్న రాజీవ్ రహదారిని జాతీయ రహదారిగా గుర్తించేందుకు కేంద్ర ప్రభుత్వం సమ్మతి తెలిపింది. ఈ మేరకు జాతీయ రహదారులు మంత్రిత్వశాఖ మంత్రి నితిన్ గడ్కరీ సూత్రప్రాయంగా అంగీకరిస్తూ తన ఆమోదాన్ని తెలిపారు. ఈ రహదారిని జాతీయ తరువాయి 6లో

విఒఎలకు రూ.3 వేల గౌరవ వేతనం

3లో

- ప్రభుత్వం ఉత్తర్వులు


తెలుగు రాష్ట్రాలపై గోదావరి బోర్డు ఫిర్యాదు

- ప్రాజెక్టుల డిపిఆర్‌లు ఇవ్వడం లేదని కేంద్రానికి లేఖ

మన తెలంగాణ/ హైదరాబాద్: ఎంత అడిగినా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు సాగునీటి ప్రాజెక్టుల డిపిఆర్‌లు తమకు ఇవ్వడం లేదని గోదావరి నదీ యాజమాన్య బోర్డు కేంద్రానికి ఫిర్యాదు చేసింది. తాము కోరిన విధంగా డిపిఆర్‌లు ఇచ్చేలా రెండు రాష్ట్రాలను ఆదేశించాలని గోదావరి బోర్డు చైర్మన్ హెచ్‌కె సాహు కేంద్ర జలవనరుల శాఖకు బుధవారం లేఖ రాశారు. విభజన తరువాయి 6లో

మోడీటీంలో మురళీధర్?

- ఆంధ్ర నుంచి రామ్ మాధవ్‌కూ కేంద్ర కేబినెట్‌లో చోటు దక్కే అవకాశం
- ఆపరేషన్ దక్షిణాదిలో భాగంగా తెలుగు రాష్ట్రాల్లో బిజెపి బలోపేతానికి వ్యూహం



మన తెలంగాణ/ హైదరాబాద్ : తెలుగు రాష్ట్రాలకు రెండు కేంద్ర మంత్రి పదవులు కట్టబెట్టేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నిర్ణయించినట్లు సమాచారం. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శులు పి. మురళీధర్‌రావు, రామ్ మాధవ్‌లను కేంద్ర మంత్రివర్గంలోకి తీసుకొని రెండు రాష్ట్రాల్లో పార్టీ బలోపేతం చేసే బాధ్యతలను కట్టబెడ్తారన్న ప్రచారం జోరందుకుంది. ఉత్తరాదిన వరుస విజయాలతో మంచి జోరుమీదున్న కమలనాథులు దక్షిణాదిపై కన్నేసి వచ్చే ఎన్నికల్లో సీట్లను పెంచుకునేందుకు వ్యూహాలను రచిస్తున్నారు. అందులో భాగంగానే బిజెపి జాతీయ అధ్యక్షుడు అమిత్ షా ఇప్పటికే తెలంగాణలో నాలుగు సార్లు పర్యటించారు. అయితే అమిత్ షా ఆకాంక్షలకు తరువాయి 6లో

పైశాచిక ప్రభుత్వం

- అధికార పైత్యంతో వ్యవహరిస్తోంది
- హామీలపై ప్రజలు నిలదీయడంతో కెసిఆర్ కాంగ్రెస్‌పై బట్ట కాల్చి వేస్తున్నారు
- ప్రజలు తిరస్కరించే రోజు వస్తోంది
- సిఎం కెసిఆర్‌పై జానారెడ్డి నిప్పులు



మన తెలంగాణ/ హైదరాబాద్ : హామీలపై ప్రజలు నిలదీసేందుకు సిద్ధమవుతుండడంతో ముఖ్యమంత్రి కెసిఆర్ కాంగ్రెస్ పార్టీపై బట్ట కాల్చి మీదేసి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని కాంగ్రెస్ శాసనసభా పక్ష నాయకులు కుందూరు జానారెడ్డి విమర్శించారు. ప్రభుత్వం అధికార పైత్యంతో పైశాచికంగా వ్యవహరిస్తోందని మండి పడ్డారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని, వారిని తిరస్కరించే రోజు త్వరలో వస్తుందని హెచ్చరించారు. శాసనసభ మీడియా హాల్‌లో కాంగ్రెస్ శాసనమండలి పక్ష నాయకులు మహ్మద్ అలీ షబ్బీర్, ఉప నాయకులు పొంగులేటి సుధాకర్‌రెడ్డిలతో కలిసి గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీని పిశాచి అని సిఎం చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. ముఖ్యమంత్రి కంటే మూడు రెట్లు తీవ్ర పద జాలంతో తెలంగాణ యాస, ప్రాసలతో తాము తిప్పిగొట్టగలమని, సిఎం పీఠాన్ని ఉద్దేశించి ఏహ్యంగా మాట్లాడేందుకు తనకు సంస్కారం, హుందాతనం అడ్డొచ్చిందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌ను తిట్టి ప్రతిపక్షాలు లేకుండా చేసి, ఏ ఒక్కరూ మాట్లాడకుండా ఇష్టానుసారంగా రాజ్యం చేయాలనుకోవాలని సిఎం చూస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం చేసే అభివృద్ధి పనులకు కాంగ్రెస్ ఎన్నడూ అడ్డుపడలేదని, పైగా ప్రతిపక్షంగా వాటికి సహకరించామన్నారు.

కడుపు మండినోళ్ళే కేసులేశారు: ఈ ప్రభుత్వం అవగాహన రాహిత్యంతో అడ్డగోలుగా, అనాలోచితంగా వ్యవహరిస్తుండడంతోనే సంక్షోభాలు వస్తున్నాయని, అడుగడుగునా కోర్టులో వ్యతిరేకంగా ఆదేశాలు వస్తున్నాయని జానారెడ్డి అన్నారు. దీనిని కాంగ్రెస్‌కు అంటగట్టి, మావల్లే ఇలా జరిగిందని తరువాయి 6లో



మొదటి సిఎం ఇలా ఉంటారనుకోలేదు

- కెసిఆర్‌కు అధికార అహంకారం తలకెక్కింది : ఉత్తమ్ కుమార్‌రెడ్డి

3



మాకు సీట్లు మాత్రమే రాలేదు.. టిఆర్ఎస్ ఓడితే టికాణా ఉండదు : చాడ

3



కేశవరం, లక్ష్మాపూర్‌లకు చెరి రూ.5 కోట్లు

- ఫాంహౌస్‌కు వెళ్తూ పల్లెలను పలకరించిన సిఎం

మన తెలంగాణ/ శామీర్‌పేట: గ్రామాల్లో మిషన్ భగీరథ నీరు, డ్రైనేజీ వ్యవస్థ, పింఛన్ల గురించి ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు ఆరా తీశారు. గురువారం సిఎం సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలో ఉన్న తన ఫామ్ హౌస్‌కు వెళ్తూ మార్గమధ్యలో కేశవరం, లక్ష్మాపూర్ గ్రామాల్లో ఆగి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మండలంలోని కేశవరం గ్రామం అభివృద్ధిలో వెనుక బడిందని, డ్రైనేజీ వ్యవస్థ లేదని మహిళలు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. గ్రామానికి చెందిన గవ్వల శ్రీనివాస్ తమ గ్రామాన్ని దత్తత తరువాయి 6లో



నోటాపై స్టేకు నో

10

- రాజ్యసభ ఎన్నికల్లో నోటా ప్రవేశపెట్టిన ఇసి ఉత్తర్వులపై స్టేకి సుప్రీంకోర్టు నిరాకరణ



భాషల దౌర్భాగ్యం

10

- 50 ఏళ్లలో భారత్‌లో సగం గల్లంతు!
- అంతరించనున్న వాటిలో గిరిజన భాషలు, యాసలే అధికం

నలుగురిపై దాడి చేసిన గోగూండాలు

10

- మధ్యప్రదేశ్ మారుమూల గ్రామంలో ఘటన



నేనా.. మళ్లీ కాంగ్రెస్‌లోకా!

3

- సోషల్ మీడియాలో ప్రచారాన్ని ఖండించిన డిఎస్



కశ్మీర్‌లో రెండు ఎన్‌కౌంటర్లు

10

- ఒక మేజర్, సైనికుడు మృతి
- ఇద్దరు తీవ్రవాదుల హతం

కుంచెపోటు



మీరు మాటలు విసిరినప్పుడు, ఎవరైనా టమాటాలు విసిరితే ఇంటికి తెండి, ధరలు మండుతున్నాయి!



ఐఎఎస్‌ల భగీరథ యాత్ర

- అద్భుత పథకమని ప్రశంస

మన తెలంగాణ/ గజ్వేల్ : ఎంతో ప్రతిష్టాత్మకమైన మిషన్ భగీరథ ప్రాజెక్టును తక్కువ సమయంలో పూర్తి చేయటం అద్భుతమైన విషయమని రాష్ట్ర ప్రభుత్వ ఐఎఎస్ అధికారుల బృందం ప్రశంసించింది. సిద్దిపేట జిల్లా గజ్వేల్ సమీపంలోని కోమటిబండపై నిర్మించిన మిషన్ భగీరథ ప్లాంటు, పంప్ హౌస్ తదితర నిర్మాణాలను 8 మంది ఐఎఎస్ అధికారుల బృందం గురువారం పరిశీలించింది. సిఎం ఆదేశాలతో కరీంనగర్ జిల్లాలో ప్రతిపాదిత కాళేశ్వరం తరువాయి 6లో

దౌత్య మార్గాల ద్వారా చైనాతో పరిష్కారం

సైనికశక్తి లేక కాదు, అన్నింటికీ యుద్ధమే శరణ్యం కారాదు

రాజ్యసభలో సుష్మా స్వరాజ్

విదేశాంగ విధాన లోపాలను ఎత్తి చూపిన ప్రతిపక్షాలు



న్యూఢిల్లీ : డోక్లామ్ ఉద్రిక్తత కొనసాగుతూ ఉండగా కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ కనబర్చిన తీరు సరిగ్గా లేదని విదేశాంగ మంత్రి సుష్మా స్వరాజ్ విమర్శించారు. ప్రస్తుత తరుణంలో రాహుల్ గాంధీ వెళ్లి చైనా రాయబారి లూవో జావోహ్యూయిని కలుసుకోవడం ఏమిటని ప్రశ్నించారు. రాజ్యసభలో గురువారం విదేశాంగ మంత్రి చైనాతో వివాదం గురించి ప్రస్తావించారు. డోక్లామ్ ప్రాంతంలో చైనా, భారత్ సైన్యాల మధ్య ప్రతిష్టంభన నెలకొని ఉందని తెలిపారు. ఈ దశలో ప్రభుత్వంతో మాట తరువాయి 6లో

చంచల్‌గూడకు విక్రమ్

14 రోజుల జ్యుడిషియల్ కస్టడీ విధింపు



మన తెలంగాణ/ హైదరాబాద్ సిటీ బ్యూరో: కాల్పుల కేసులో మాజీ మంత్రి ముఖేష్‌గౌడ్ తనయుడు విక్రమ్‌గౌడ్ జైలు పాలయ్యాడు. గత నెల 28న తెల్లవారుజామున ఫిల్మ్‌నగర్‌లోని తన ఇంట్లో కిరాయి ముఠాతో కాల్పులు జరిపించుకున్న విక్రమ్ గౌడ్ జూబ్లీహిల్స్ అపోలో ఆసుపత్రిలో చికిత్సపొందుతూ గురువారం డిశ్చార్జి అయ్యాడు. ఆ మరుక్షణమే బంజారాహిల్స్ పోలీసులు అతన్ని అరెస్టు చేసి నాంపల్లి కోర్టులో హాజరుపర్చారు. మెజిస్ట్రేట్ విక్రమ్‌గౌడ్‌కు 14 రోజుల జ్యుడిషియల్ కస్టడీ విధించడంతో అతన్ని చంచల్‌గూడ జైలుకు తరలించారు. అయితే తనకు బెయిల్ ఇవ్వాలంటూ అతని తరపున న్యాయవాది దాఖలు చేసిన పిటిషన్‌ను మెజిస్ట్రేట్ తోసిపుచ్చారు. కేసు తీవ్రత తరువాయి 6లో

ప్రభుత్వ ఉద్యోగులకు రాజీవ్ స్వగృహ ఇళ్లు

2

- ఆన్‌లైన్‌ద్వారా దరఖాస్తులకు అవకాశం

'స్టేట్ బ్యాంక్ ఆఫ్ టొమాటో' రుణాలు

లక్నో: దేశంలో మండిపోతున్న టొమాటో ధరలకు నిరసనగా ఉత్తరప్రదేశ్ రాష్ట్ర యువ కాంగ్రెస్ నేతలు వినూత్న కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా 'స్టేట్ బ్యాంకు ఆఫ్ టొమాటో' పేరిట ఓ బ్యాంకును ప్రారంభించారు. సాధారణ బ్యాంకుల మాదిరిగానే ఈ బ్యాంకులోనూ లాకర్ సౌకర్యంతో పాటు సులభమైన రుణాలతో టొమాటోలను కొనుగోలు చేసేందుకు వీలుగా ఆకర్షణీయమైన వడ్డీరేట్లను అందిస్తు న్నారు. ఈ బ్యాంకు ఉత్తరప్రదేశ్ రాష్ట్ర రాజధాని లక్నోలోని మాల్ ఎవెన్యూ యూత్ కాంగ్రెస్ కార్యాలయం నుంచి ఆపరేట్ చేస్తున్నారు. గురువారం రెండో రోజు నిరసనలో భాగంగా బ్యాంకులో టొమాటోలు కొనేందుకు 18 మంది కొనుగోలుదారులు ముందుకు రాగా, మరికొంతమందిలో ఉత్సాహన్ని కలిగించే దిశగా అడుగులు వేయనున్నారు. ఈ బ్యాంకుకు చీఫ్ మేనేజర్‌గా వ్యవహరిస్తున్న పార్టీ మాజీ అధికార ప్రతినిధి అన్షు అవస్థి మాట్లాడుతూ.. బ్యాంకులో డిపాజిట్ చేసిన టొమాటోలు రెట్టింపు చేసేలా కొన్ని ఆకర్షణీయమైన పథకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. టొమాటోలు కొనుగోలు కోసం 80 శాతం రుణాలను ప్రత్యేకించి పేదవారికే ఇవ్వనున్నట్టు తెలిపారు. ప్రజల నుంచి విశేష స్పందన రావడంతో అలిగంజ్‌లో మరో బ్రాంచ్‌ను ప్రారంభించినట్టు అన్షు చెప్పారు.



సీనియర్ జర్నలిస్టుకు కీర్తి పురస్కారం



మనతెలంగాణ/హైదరాబాద్ : సీనియర్ జర్నలిస్టు మందాడి వెంకటేశ్వరరావు కీర్తి పురస్కారం ఎంపికయ్యారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రతి ఏటా వివిధ రంగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి కీర్తి పురస్కారాలను అందజేస్తుం ది. అందులో భాగంగా జర్నలిజం విభాగంలో 2016 సంవత్సరాని కి కీర్తి పురస్కారానికి ఎంపిక చేశారు. ఈ మేరకు వైస్ ఛాన్సలర్ ఎస్.వి.సత్యనారాయణ నేతృత్వంలోని కమిటీ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఆగస్టు చివరివారంలో ఈ పురస్కారాన్ని అందజేయనున్నారు. వనపర్తి జిల్లా కొత్తకోట మండలం కనిమెట్ల గ్రామానికి చెందిన వెంకటేశ్వర్ రావు గత ల37 ఏళ్లుగా వివిధ పత్రికల్లో జర్నలిస్టుగా విధులు నిర్వహించారు. అనేక రంగాలలో ప్రతిభను కనబరిచిన ఎంవిఆర్ అనేక అవార్డులు అందుకున్నారు. విద్య, కళారంగంపై ఎంతో ఆసక్తి ఉన్న పాటలు కూడా రచిస్తారు.

హెచ్‌సియులో అక్రమాలపై సిబిఐ విచారణ : రైట్ సొసైటీ

మనతెలంగాణ/హైదరాబాద్ : యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో జరుగుతున్న అక్రమాలపై ఎసిబి, సిబిఐ దర్యాప్తు సంస్థలతో విచారణ జరిపించాలని రైట్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు ఎ.వెంటేశ్వరరెడ్డి, వర్సిటీ మాజీ అసిస్టెంట్ రిజిస్ట్రార్ సాదిక్ హుస్సేన్‌లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. హైదరాబాద్ వర్సిటీలో తెలంగాణకు చెందిన ఉద్యోగులు, విద్యార్థులు తీవ్ర వివక్షకు గురవుతున్నారని ఆరో పించారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా తెలంగాణ వారి పట్ల వివక్ష, అవమానాలు పెరిగాయని కానీ తగ్గలేదని అన్నారు. ఈ ప్రాంత అధికా రులను ఇబ్బందులకు గురిచేస్తూ, అన్యాయంగా ఉద్యోగాల నుంచి తొల గిస్తున్నారని చెప్పారు. హెచ్‌సియు అధికారులు ఇష్టారీతిన వ్యవహరిస్తూ రూ.కోట్లాది నిధులను దుర్వినియోగం చేస్తున్నారని, సరైన అర్హతలు లేనివారిని కూడా అధ్యాపకులుగా నియమించుకున్నార ని ఆరోపిం చారు. హెచ్‌సియులో టెర్రరిస్టుల కంటే ప్రమాదకరమైన ప్రొఫెసర్లు ఉన్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

సాంకేతికత అందిపుచ్చుకుంటే
పసుపు రైతుకు పసిడి పంట




మన తెలంగాణ/హైదరాబాద్ : పసుపు పంట సాగు చేయడం ఒక ఎత్తైతే... పండించిన పసుపు కొమ్ములను తీసి ఉడికించడం, ఆరబెట్టడం మరొక ఎత్తు.. ఇందుకోసం రైతు చాలా మొత్తంలోనే ఖర్చు చేయాల్సి వస్తోంది. ఇంత చేసిన ఎక్కడో నాణ్యత లోపించడం, గిట్టుబాటు కాకపోవడం జరుగుతుంది. అయితే పసుపు ఉడకబెట్టడం, ఆరబెట్టడం లేకుండా నేరుగా పచ్చిపసుపుతోనే పొడి పసుపును తయారు చేయవచ్చు. తద్వారా సాగు ఖర్చులు తగ్గడంతో పాటు నాణ్యమైన పసుపు రావడం, రైతుకూ గిట్టుబాటు కూడా కానుంది. ఈ సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. ఇందుకు జాతీయ ఆహార సాంకేతిక పరిశోధన సంస్థ (సిఎఫ్‌టిఆర్‌ఐ), మైసూరు వారి సహకారం తీసుకోనుంది. పచ్చి పసుపు ప్రాసెసింగ్‌కు సంబంధించిన సమగ్ర పథక నివేదిక (డిపిఆర్)ను రాష్ట్ర ఉద్యాన అభివృద్ధి సంస్థ , సిఎఫ్‌టిఆర్‌ఐను కోరింది. డిపిఆర్ అందిన వెంటనే ప్రాసెసింగ్ యూనిట్‌ను స్వయంగా ప్రభుత్వమే కుత్బుల్లాపూర్‌లోని దూలపల్లిలో ఏర్పాటు చేయాలనుకుంటోంది. దేశంలోనే ఈ పరిజ్ఞానం కర్నాటక రాష్ట్రంలో ఉండగా అక్కడ విజయవంతమైంది.

నాణ్యత ఎక్కువ..సమయం తక్కువ : ప్రస్తుతం పసుపు కొమ్ములు నేల నుంచి తీసిన తరువాత వాటిని ఒకటి, రెండు సార్లు ఉడకబెట్టడం తదుపరి ఆరబెట్టడం వంటివి చేస్తున్నా రు. ఇందుకు కూలీల ఖర్చులు కూడా అధికమవుతున్నాయి. టన్ను పసుపునకు దాదాపు రూ. 30 వేల నుంచి రూ. 45 వేల వరకు ఖర్చవుతోంది. అంటే ఒక కిలోకు రూ. 45 వరకు అవుతోంది. దాదాపు ఒక నెల వరకు సమయం కూడా వృథా అవుతుంది. ఈ క్రమంలో పసుపులో ఉండే పోషక గుణాలు(కుర్కుమిన్) తగ్గిపోతూ రంగు కూడా మారుతోంది. అదే సిఎఫ్‌ఆర్‌టిఐ రూపొందించిన ప్రాసెసింగ్ టెక్నాలజీలో రెండు రోజుల్లో పచ్చి పసుపును పొడి పసుపుగా మార్చడంతో పాటు నాణ్యత తగ్గకుండా ఉంటుంది. ఇందుకు కిలోకు రూ. 25 మాత్రమే ఖర్చు అవుతోందని సిఎఫ్‌టిఆర్‌ఐ వర్గాలు తెలిపాయి.

కాకతీయ బ్రాండ్ పేరుతో విక్రయాలు : విజయ పాలు, నెయ్యి ఎలాగో కాకతీయ బ్రాండ్ పేరుతో పసుపు, కారం వంటి వాటిని విక్రయించాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. సిఎఫ్‌టిఆర్‌ఐ, మైసూరు ప్రాసెసింగ్ టెక్నాలజీతో ప్రభుత్వం ఏర్పాటు చేయను న్న యూనిట్ ద్వారా వచ్చే ఉత్పత్తులను ప్రభుత్వం కాకాతీయ బ్రాండ్ పేరుతో పసుపు, కారం వంటి వాటిని విక్రయించనుంది. ఇందుకు నేరుగా రైతుల దగ్గర నుంచే పంట ముడి సరుకును కొనుగోలు చేయనుంది. తద్వారా రైతులకు మంచి ధరలు రావడంతో పాటు నాణ్యమైన నిత్యావసర ఉత్పత్తులు ప్రజలకు అందుతాయని ప్రభుత్వం భావిస్తోంది. మరో వైపు సిఎఫ్‌టిఆర్‌ఐ, మైసూరు సంస్థ సుగంధ ద్రవ్యాల ప్రాసెసింగ్ యూనిట్‌కు సంబం ధించిన సాంకేతిక సమాచారం (డిపిఆర్) 60 రోజుల్లో సమర్పిస్తారని వ్యవసాయ, ఉద్యాన కార్యదర్శి సి. పార్థసారధి తెలిపారు. సిఎం కె. చంద్రశేఖర్‌రావు రాష్ట్ర ప్రజలకు నాణ్య మై న ఉత్పత్తులను అందించాలనే ఉద్దేశ్యంతో ఉన్నారన్నారు. పసుపు, పొడికారం, అల్లం వెల్లు ల్లి మిశ్రమం, చింతపండు గుజ్జు వంటి వాటిని ప్రాసెసింగ్‌కు సహకరించాలని కోరారు.

ఈటలకు సభ ఏర్పాట్ల బాధ్యతలు

మన తెలంగాణ/హైదరాబాద్ : ఎస్‌ఆర్‌ఎస్‌పి పునరుజ్జీవ సభ ఏర్పాట్లను పర్యవేక్షించే బాధ్యతలను ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్‌కు సిఎం కెసిఆర్ అప్పగించారు. ఈనెల 10న పునరుజ్జీవ సభ నిర్వహించాలని నిర్ణయించినట్లు సిఎం కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ ప్రాజెక్టు పరిధిలోని ప్రజా ప్రతినిధులు, అధికారుల,రైతులను సమన్వయం చేసి సభను విజయవంతం చేసే బాధ్యతలు తీసుకోవాల్సిందిగా సిఎం కోరగా, మంత్రి రాజేందర్ అంగీకరించారు.

4 నుంచి డి.ఫార్మసీ కౌన్సెలింగ్

మనతెలంగాణ/హైదరాబాద్ : డి.ఫార్మసీ కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదలైంది. ఈ నెల 4న ఉదయం 9 గంటలకు ఎంపిసి అభ్యర్థులకు, ఉదయం 11 గంటలకు బైపిసి అభ్యర్థులకు ధృవపత్రాల పరిశీలన నిర్వహిం చనున్నట్లు ప్రవేశాల కన్వీనర్ ఎ.వాణిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు 4,5 తేదీలలో ఆప్షన్లు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ నెల 8న సీట్లు కేటాయిం చనున్నట్లు వెల్లడించారు. మాసబ్‌ట్యాంక్‌లోని సాంకేతిక విద్యాభవన్, వరంగల్, నిజామా బాద్, మహబూబ్‌నగర్, నల్గొండలోని ప్రభుత్వ పాలిటెక్నిక్‌లలో సహాయ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

నిజామాబాద్‌లో పసుపు బోర్డు ఏర్పాటు చేయండి



మన తెలంగాణ/ న్యూఢిల్లీ: పసుపు బోర్డు ఏర్పాటు కోరుతూ.. ఎంపి కవిత ఆధ్వర్యంలో నిజామాబాద్ టిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎలు ప్రధాని మోడీని గురువారం పార్లమెంటులోని ఆయన కార్యాలయంలో కలిశారు. తెలంగాణ రాష్ట్రంలో పసుపు బోర్డు ఏర్పాటు చేయాలని ప్రధానిని కోరుతూ.. పసుపు బోర్డు ఏర్పాటుకు మద్దతు ఇస్తూ, పలువురు ముఖ్యమంత్రులు రాసిన లేఖలను ప్రధానికి కవిత అందజేశారు. పది నెలల పాటు సాగు చేసే పసుపు పంటలో రైతులు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారని మోడీకి ఎంపి కవిత వివరించారు. విత్తనాల దగ్గర నుంచి దిగుబడి, మద్దతు ధర వరకు వారికి ఏ సహాయం లేదని తెలిపారు. పసుపు బోర్డు ఏర్పాటు చేస్తే తప్ప ప్రీ హార్వెస్టింగ్ , పోస్ట్ హార్వెస్టింగ్ సహాయం అందేలా లేదని స్పష్టం చేశారు. దేశంలో 13 రాష్ట్రాల్లో పసుపు సాగవుతుందని, పసుపు బోర్డు ఏర్పాటు చేస్తే మేలు జరుగుతుందన్నారు. సాగు, ప్రాసెసింగ్, మద్దతు ధర విషయాల్లో పసుపు బోర్డు ఉంటే రైతులకు మేలు జరుగుతుందని .. పసుపు బోర్డు ఎక్కడ ఏర్పాటు చేసినా తమకు అభ్యంతరం లేదని కవిత ప్రధాని మోడీని కోరారు. స్పైసెస్ పార్క్ విషయంలో కేంద్రం చేసిందేమీ లేదని, రాష్ట్ర ప్రభుత్వమే స్థలం కేటాయించి రూ. 30 కోట్లతో అభివృద్ధి చేసిందని తెలిపారు. కేంద్రం నిజామాబాద్‌లో స్పైసెస్ పార్క్ ఇస్తామంటే 42 ఏకరాల భూమిని ఇచ్చాము కాని, ఆ తర్వాత కేంద్రం అటువంటి స్కీం లేదంటూ మాట మార్చిందని కవిత ఆరోపించారు. వరంగల్‌లో స్పైస్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ నిబంధనల ప్రకారం రావాల్సిన సంస్థనే అందులో కేంద్ర ప్రభుత్వం కొత్తగా చేసిందేమి లేదన్నారు. పసుపుతో పాటు మిర్చి పెద్ద ఎత్తున సాగయ్యే వరంగల్‌లో స్పైస్ ఏజెన్సీ పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులకు రాజీవ్ గృహకల్ప ఇళ్లు

మన తెలంగాణ/హైదరాబాద్ : రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ తరపున ఆన్‌లైన్ ప్రక్రియ కోసం త్వరలోనే వైబ్ సైట్ ను ప్రారంభించనున్నట్లు గృహ నిర్మాణ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి తెలిపారు. దీని కోసం సెంట్రల్ ఫర్ గుడ్ గవ ర్నెన్స్ ప్రత్యేక ఆప్లికేషన్‌ను అభివృద్ధి చేసిందన్నారు. సిఎం కెసిఆర్ ఆదేశాల మేరకు ఆన్‌లైన్ ద్వారా ఫ్లాట్లను విక్రయించనున్నట్లు చెప్పారు. మొదటి దశలో బండ్లగూడ, పోచారంలో నిర్మించిన 3,719 ఫ్లాట్లను విక్రయించనున్నారు. రాజీవ్ స్వగృహపై ఉన్న అప్పులలో ఇప్పటి వరకు రూ.820 కోట్ల రుణాన్ని తీర్చినట్లు మంత్రి వెల్లడించారు. త్వరలోనే మిగిలిన రూ.256 కోట్ల అప్పును తీర్చేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాజీవ్ స్వగృహ కార్పొ రేష న్ అన్ని మౌలిక వసతులతో కూడిన ఫ్లాట్లను నిర్మించిందని, వీటిని కొను గోలు చేయాలనుకునే ప్రభుత్వ ఉద్యోగులు ఆన్ లైన్‌లో బుకింగ్ చేసుకో వాలని మంత్రి కోరారు. గృహ ప్రవేశాలకు సిద్ధంగా ఉన్న ఫ్లాట్లతో పాటు చిన్న చిన్న పనులు మిగిలి ఉన్న ఫ్లాట్లను యధాతాధ స్థితిలో విక్రయించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. విక్రయ మార్గదర్శకాలను వెబ్ సైట్‌లో ఉంచుతామన్నారు. బ్యాంకు అధికారులు కూడా ఫ్లాట్ల విక్రయానికి అభ్యంత రం లేదని గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి చిత్ర రామచంద్రన్ తెలిపినట్లు చెప్పారు. మొదటి దశలో బండ్లగూడలో ఉన్న 2245 ఫ్లాట్లను, పోచారంలో ఉన్న 1474 ఫ్లాట్లను రాజీవ్ స్వగృహ విక్రయించనుం ది. బండ్ల గూడలోని 2245 ఫ్లాట్లలో 316 గృహాలు ప్రవేశాలకు సిద్ధంగా ఉన్నాయని, మరో 1929 ఫ్లాట్లలో చిన్న చిన్న పనులు మిగిలి ఉన్నాయని మంత్రి గురు వారం విడుదల చేసిన ఒక ప్రకటనలో వివరించారు. వీటిని ఆన్ లైన్ వేలం ద్వారా కొనుక్కున్నవారే మిగతా పనులు చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు.

మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యం



మన తెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్రంలో శాంతి భద్రతలకు ప్రాధా న్యమిస్తున్న ప్రభుత్వం పోలీసు స్టేషన్లు, సిబ్బంది, బెటాలి యన్లు తది తర వాటిల్లో మౌలిక సదుపాయాలకు కూడా పెద్ద పీట వేస్తోందని రాష్ట్ర పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ దామోదర్‌గుప్త తెలిపారు. గురువారం తన కార్యాలయంలో ఎండి మల్లారెడ్డి, సిఇ గోపాలకృ ష్ణతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. మౌలిక సదుపాయాల కల్పన కోసం ఈ ఏడాది రూ. 300 కోట్లను కేటాయిం చడం జరిగిం దని పేర్కొన్నారు. పోలీసు అకాడమీ, జైళ్ళ శాఖ, 14 పోలీసు బెటా లియన్లలో 100 ఎకరాలలో నిర్మాణాలు, 600 ఎకరాల ఆక్టోపస్ క్యాంపస్‌లలో పలు నిర్మాణాలను చేపట్టిందని వివరించారు. కేంద్రం ఇచ్చిన నిధులతో సిబ్బంది కోసం దాదాపు 300 రెసిడెన్షియల్ క్వార్ట ర్లను నిర్మిస్తున్నా మన్నారు. రాష్ట్రంలోని 116 చోట్ల పోలీసుస్టేషన్ల భవ నాలు, క్వార్టర్ల నిర్మాణం కోసం రూ. 43 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింద న్నారు. ఇందులో 74 చోట్ల పనులను ప్రారంభిం చగా, మరో రూ. 60. 65 కోట్ల విలువ చేసే 42 పనులకు టెండర్లను పిలిచామని పేర్కొన్నారు. రూ. 375 కోట్లతో రెండు కమిషనరేట్లు, 13 జిల్లాలలో పోలీసు కార్యాలయాల నిర్మాణాల కోసం ప్రతిపాద నలు సిద్ధమయ్యాయని, టెండర్లను త్వరలోనే పిలువనున్నామని చెప్పారు. బెటాలియన్లలో రూ. 20 కోట్లతో పనులను చేపట్టాలని ఆదే శించిన ప్రభుత్వం రూ. 10 కోట్లను విడుదల చేసిందని, పనులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. రూ. 358.25 కోట్ల తొమ్మిది ఎక్సైజ్ పోలీసు స్టేషన్ల నిర్మాణాలకు అనుమతి లభించిందని, ఇందులో ఎనిమిది పనులు ప్రారంభమ య్యాయని, మరో స్టేషన్ నిర్మాణం కోసం స్థలాన్వేషణ జరుగుతుంద న్నారు. వీటితో పాటు సాంకేతిక విద్యా శాఖ, అటవీ శాఖ, గిడ్డంగుల సంస్థ, పివిఎన్‌ఆర్ వెటర్నరీ యూనివర్సిటీలు కూడా వారి వారి పనులను చేపట్టాలని తమను ఆహ్వానించాయని పేర్కొన్నారు.

రాష్ట్రంలో క్షిపణుల తయారీ



మన తెలంగాణ / హైదరాబాద్ : కళ్యాణి రాఫెల్ ఫెసిలిటి సంస్థ దేశంలోనే తొలి సారిగా ప్రైవేటు రంగంలో మిసైల్స్ తయారీ కేంద్రాన్ని రాష్ట్రంలో ఏర్పాటు చేసింది. మహేశ్వరంలోని హార్డ్‌వేర్ పార్కులో ఏర్పాటు చేసిన ఈ ఫెసిలిటి (కళ్యాణి రాఫెల్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్)కేంద్రాన్ని పరిశ్రమల శాఖ మంత్రి కె.తారక రామారావు గురువారం ప్రారంభించారు. 24వేల చ.అడు గుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ మిసైల్స్ తయారీ కేంద్రంలో మిసైల్స్ టెక్నా లజీకి సంబంధించిన పలు విభాగాలను ఏర్పాటు చేశారు. కళ్యాణి గ్రూప్

రాఫెల్ మిసైల్స్ కేంద్రం ప్రారంభం

జాయింట్ వెంచర్‌గా ఈ విభాగాన్ని రాఫెల్ అడ్వాన్స్‌డ్ డిఫెన్స్ సిస్టమ్స్ లిమి టెడ్‌తో కలిసి రాష్ట్రంలో ఏర్పాటు చేయడం పట్ల మంత్రి కెటిఆర్ కళ్యాణి గ్రూప్‌ని అభినందించారు. ప్రైవేటు రంగంలో మిసైల్స్ తయారీ విభాగంలో వస్తున్న కళ్యాణి రాఫెల్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ తెలంగాణకు మరింత మంచి పేరు తెస్తుందని ఆశిస్తున్నామన్నారు. ఇప్పటికే మిధాని, డిఆర్‌డిఎల్, బిడిఎల్ లాంటి ప్రతిష్టాత్మకత మిసైల్స్ మ్యానిఫ్యాక్చరింగ్ కేంద్రాలు హైదరాబాద్‌లో ఉన్నాయని.. ఇంకా చెప్పాలంటే డిఫెన్స్, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో తెలంగాణ అద్భుతంగా దూసుకుపోతోందని కెటిఆర్ పేర్కొన్నారు. బోయింగ్, టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ సంస్థల్లో హెలీకాప్టర్ విడి బాగాలు ఉత్పత్తి అవుతున్నాయ న్నారు. ఎంఎస్‌ఎంఈ రంగంలోనూ వెయ్యి వరకు డిఫెన్స్ రంగ లఘు పరిశ్ర మలు తెలంగాణలో తమ ఉత్పత్తులను అందిస్తున్నాయన్నారు. శాస్త్ర సాంకేతిక రంగాలు ఎంత అభివృద్ధి చెందుతున్నాయో.. అంతే పెద్ద ఎత్తున సైబర్ ముప్పు పొంచి ఉంటోందన్నారు. సైబర్ హ్యాకర్లను ఒక కంటి కనిపెడుతూ జాగ్రత్తగా ముందుకు అడుగులు వేయాలని కెటిఆర్ సూచించారు. ఈ కార్యక్రమంలో మంత్రి మహేందర్ రెడ్డి, స్థానిక శాసన సభ్యుడు తీగల కృష్ణారెడ్డి, ఐటి, పరిశ్ర మల శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, సిఎం కార్యాలయం అధికారి పా పారావు, భారత్‌లో ఇజ్రాయిల్ రాయబారి డానియల్ కార్మోన్ పాల్గొన్నారు.

లక్ష్యానికి తగ్గట్లుగా బొగ్గు ఉత్పత్తి : శ్రీధర్

మన తెలంగాణ/హైదరాబాద్: ప్రతి ఏరియా గనుల్లో నిర్దేశించిన లక్ష్యానికి తగ్గట్లుగా బొగ్గు ఉత్పత్తి చేయాలని సింగరేణి కాలరీస్ చైర్మన్ ఎన్.శ్రీధర్ ఆదేశించారు. హైదరాబాద్‌లోని సింగరేణి భవ న్‌లో గురువారం బొగ్గు ఉత్పత్తిపై 11 ఏరియాల జనరల్ మేనేజర్లతో శ్రీధర్ సమీక్షించారు. బొగ్గు ఉత్పత్తితో పాటు, బొగ్గు రవాణాకు కూడా ప్రాధాన్యత ఇస్తూ నిర్దేశిత లక్ష్యాలు సాధించాలన్నారు. 660 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని అధిగమించాలని సూచిం చారు. ఏరియాల వారీగా ఒక్కో జిఎంతో లక్ష్యాలు, అవరోధాలు, పరి ష్కార మార్గాలపై చర్చించారు. ఈ ఏడాది ఇతర రాష్ట్రాల విద్యుత్ సంస్థల నుంచి సింగరేణి బొగ్గుకు మంచి డిమాండ్ వచ్చిందని, దీన్ని అందుకోవడానికి పూర్తిస్థాయిలో ప్రయత్నం చేయాలని కోరారు. హరితహారంలో కోటి మొక్కలు నాటాలన్న లక్ష్యాన్ని అధిగమించడా నికి అన్ని ఏరియాల్లో మొక్కలు నాటే పనులు వేగవంతం చేయాలని సూచించారు. ఇప్పటి వరకు 45 లక్షల మొక్కలు నాటామని సిఎండి అన్నారు. ఈ సమావేశంలో సింగరేణి డైరెక్టర్లు జె.పవిత్రన్ కుమార్, బి.భాస్కర్‌రావు, ఎస్.చంద్రశేఖర్, ఎస్.శంకర్, ఇడి ఎన్.శ్రీనివాస్, జిఎంలు బి.కిషన్‌రావు, అంథోని రాజా, రాజేశ్వర్‌రెడ్డితో పాటు 11 ఏరియాల జిఎంలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను పట్టాలెక్కించేందుకు రాహుల్ ప్రణాళికలు



మనతెలంగాణ/న్యూఢిల్లీ : దేశంలోని అన్ని రాష్ట్రాలలో కాంగ్రెస్ పార్టీని తిరిగి పట్టాలు ఎక్కించేందుకు పార్టీ ఉపాధ్యక్షుడు రాహుల్ గాంధీ ప్రణాళికలు రచి స్తున్నారని మాజీ మంత్రి శశిథరూర్ స్పష్టంచేశారు. కాంగ్రెస్ పార్టీ ఇటీవల శశి థరూర్ అధ్యక్షుడు గా ఆల్ ఇండియా ప్రొఫెషనల్ కాంగ్రెస్ అనే సంస్థను ఏర్పాటు చేసింది. ఆ సంస్థ మొదటి సమావేశం గురువారం ఢిల్లీలో జరిగింది. అనంతరం ఈ విభాగం దక్షిణభారత దేశం ఇంఛార్జీ మాజీ మంత్రి గీతారెడ్డితో కలసి తెలంగాణభవన్ లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా మాజీ కేంద్ర మంత్రి శశిథరూర్ మాట్లాడుతూ...... పార్టీలో రాహుల్ గాంధీ శకం ప్రారంభమయిందని, దేశ వ్యాప్తంగా పలు కార్యక్రమాలను ఆయన చేపట్టారని, పార్టీ కార్యక్రమాలను రాహుల్ గాంధీ పట్టించుకోవడం లేదని కొన్ని మీడియాసంస్థలలో వస్తున్న వార్తలలో నిజం లేదని ఆయన వెల్ల డించారు. అనంతరం మాజీ మంత్రి గీతారెడ్డి మాట్లాడుతూ.... దేశంలో చాల మంది ప్రొఫెషనల్స్ ఉన్నప్పటికి రాజకీయాలకు చాలా దూరంగా ఉంటు న్నారు కాబట్టి, వాళ్ళందరిని కోఆర్డినేట్ చేస్తూ వాళ్ళ ఆలోచనల్ని అమలు చేసి పార్టీని ముందుకి తీసుకెళ్లాలని ఇది ఏర్పాటు చేసామని అన్నారు. పాన్ కార్డ్ ఉండి, ఎడ్యుకేట్ అయి ఉన్నవాళ్ళని ఇందులో సభ్యత్వం ఇస్తున్నామని వెల్లడిం చారు. వాళ్ళ ఆలోచనలు పార్టీ అభివృద్ధి కి ఉపయోగపడేలా ఈ విభాగం పని చేస్తుందని అన్నారు. దేశంలో చాలామందికి రాజకీయాల గురించి అనేక ఆలో చనలు ఉంటాయని, అవి బయటకు రావడం లేదని, వాటిని బయటపెట్టే వేదిక గా ఈ విభాగం పనిచేస్తోందని అన్నారు.

నేనా.. మళ్లీ కాంగ్రెస్‌లోకా? : డిఎస్



మన తెలంగాణ/న్యూఢిల్లీ: తాను తిరిగి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నానని వార్తలు రాయడం సరైంది కాదంటూ టీఆర్ఎస్ ఎంపి డి.శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. టిఆర్ఎస్ లో సంతోషంగా లేనని అనడం కూడా వాస్తవం కాదు అన్నారు. తన గురించి సోషల్ మీడియాలో అడ్డగోలుగా రాస్తున్నారు వాటిని తక్షణమే ఆపకుంటే చట్టపరంగా వారిపై చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. పార్టీలు మారే విషయంపై దాగుడుమూతలు ఆడాల్సిన అవసరం లేదన్నారు. నా సలహా ప్రకారమే దిగ్విజయ్ సింగ్ తీసేశారనడం అవాస్తవమని డి.శ్రీనివాస్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో ఆయన ఉంటే నాకు ఏంటి? పార్టీ నుండి పోతే నాకేంటని ఆయన ప్రశ్నించారు. టిఆర్ఎస్‌లో కేసీఆర్ నన్ను బాగా గౌరవించారు, నా అనుభవానికి తగినట్లుగా ఎంపిని చేశారని వెల్లడించారు. కెసిఆర్ బంగారు తెలంగాణ తెస్తారనే విశ్వాసం ఉందన్న టిఆర్ఎస్ ఎంపి, నాకు, ముఖ్యమంత్రికి మంచి అనుబంధం ఉందని అన్నారు. నాకు అప్పగించాల్సిన పని ఇస్తున్నారు, సోషల్ మీడియాలో, నాకు సంబంధించి వచ్చిన వార్తలను పట్టించుకోను అన్నారు. ఆ వార్తలు నాతో, సోనియాతో మాట్లాడి మరీ రాసినట్లుగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇరిగేషన్, పారిశ్రామిక అభివృద్ధి, గృహ నిర్మాణ రంగాలలో మంచి అభివృద్ధిని కెసిఆర్ సాధిస్తున్నారని కితాబునిచ్చారు.

అధికార అహంకారం



కాంగ్రెస్‌కు ఆదరణ చూసి కెసిఆర్‌కు భయం పట్టుకుంది : ఉత్తమ్

మన తెలంగాణ/హైదరాబాద్: సిఎం కెసిఆర్ అధికార అహంకారంతో కళ్లునెత్తికెక్కి మాట్లాడుతున్నారని, తెలంగాణ రాష్ట్ర మొదటి సిఎం ఇలా ఉంటారని తాము ఊహించలేదని టిపిసిసి అధ్యక్షులు ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. అధికారం కోల్పోతామని, కాంగ్రెస్‌కు పెరుగుతున్న ప్రభావాన్ని చూసి కెసిఆర్‌లో భయం పట్టుకున్నదని, అందుకే అడ్డగోలుగా, అన్నీ అబద్దాలే మాట్లాడారన్నారు. కెసిఆర్ వాడిన భాష, మాట్లాడిన విధానాన్ని చూసి తెలంగాణ సమాజం సిగ్గుపడుతోందని, బలహీనవర్గాలు అసహ్యించుకుంటున్నారన్నారు. పది శాతం కమీషన్ల కోసమే సిఎం తెలంగాణ రాష్ట్రాన్ని ఆంధ్రా కాంట్రాక్టర్లకు తాకట్టు పెట్టారని విమర్శించారు. గాంధీభవన్‌లో పిసిసి మాజీ అధ్యక్షులు పొన్నాల లక్ష్మయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ భట్టి విక్రమార్క, మాజీ ఎంపిలు అంజన్‌కుమార్ యాదవ్, మల్లురవి, రవీంద్రనాయక్‌తో కలిసి గురువారం మీడియా సమావేశంలో ఉత్తమ్ మాట్లాడారు. సిఎం వ్యాఖ్యల్లో బెదిరింపు ధోరణి కనిపించిందన్నారు. సింగరేణి వారసత్వ ఉద్యోగాలపై కేసు వేసిందే తెలంగాణ జాగృతి సభ్యులని, విద్యుత్ ఉద్యోగుల విషయంలో కూడా ఇతర వ్యక్తులు వేస్తే ఆ కేసులు కాంగ్రెస్‌పై అపవాదు వేయడం అన్యాయమన్నారు. ఈ కేసులకు కాంగ్రెస్‌కు సంబంధమే లేదన్నారు. మీరాకుమార్‌పై సిఎం చేసిన వ్యాఖ్యాలను తక్షణమే ఉపసంహరించి, దళితులు బేషరుతగా క్షమాపణ చెప్పాలని ఉత్తమ్ డిమాండ్ చేశారు. రాష్ట్ర జనాభాలో 0.5 శాతం సామాజిక వర్గానికి అధికారం వచ్చినా, ప్రజలు సానుకూల దృక్పథంతోనే ఉన్నారని, అలాంటిది దళితులు, బిసిలపై దాడులు చేయడం అన్యాయమన్నారు. నేరేళ్ల ఘటనలో దళితులు, బిసిలపై థర్డ్ డిగ్రీ ప్రయోగించినప్పటికీ సిఎం కెసిఆర్ మాత్రం పోలీసులను ప్రోత్సహిస్తున్నారని, బాధిత కుటుంబాల పట్ల సానుభూతి కూడా వ్యక్తం చేయకపోవడం ఆయన ఇసుక మాఫియాకు ఇస్తున్న ప్రాధాన్యత స్పష్ట మవుతుందన్నారు. భవిష్యత్తులో దళితులు సిఎంను తరిమికొట్టే రోజులు వస్తాయన్నారు. టిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కొత్తగా ఏ ప్రాజెక్టులు కట్టారని, తాము ఏ ప్రాజెక్టులను అడ్డుకున్నామని ప్రశ్నించారు. పాలమూరు ప్రాజెక్ట్‌లో రూ.7500 కోట్ల కాంట్రాక్ట్‌ను సింగిల్ టెండర్‌ద్వారా అప్పగించింది ఎవరని ప్రశ్నించారు.

సోనియా కాళ్లు పట్టుకోలేదా..

తెలంగాణ రాష్ట్రం ఏర్పడినందుకు కెసిఆర్ కుటుంబం మొత్తం సోనియాగాంధీ కాళ్లు పట్టుకున్నప్పుడు తెలియదా..? అని ఉత్తమ్ ప్రశ్నించారు. అవసరమైనప్పుడు కాంగ్రెస్ కాళ్లు పట్టుకుని, ఇప్పుడు జుట్టు పట్టుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ బిల్లులో లోపాలున్నాయని చెబుతున్న సిఎం, ఆ బిల్లులో ఒక అసెంబ్లీ స్థానాలే కాదని, కారు కోచ్ ఫ్యాక్టరీ, గిరిజన విశ్వవిద్యాలయ ఏర్పాటు ఇలా అనేక అంశాలు ఉన్నాయని గుర్తు చేశారు. మోడీని చూసి కెసిఆర్ గజగజ వణుకుతున్నారని, అందుకే బిల్లులో ఉన్న అంశాలను అమలు చేయాలని అడగలేకపోతున్నారన్నారు. హైదరాబాద్‌లో పబ్ కల్చర్ రావడానికి కారణమే సిఎం కెసిఆర్ అని ఆరోపించారు. పొన్నాల లక్ష్మయ్య మాట్లాడుతూ టిఆర్ఎస్ ప్రభుత్వం వ్యవహరించినట్టే ఉమ్మడి రాష్ట్రంలో నాటి ప్రభుత్వం వ్యవహరించి ఉంటే కెసిఆర్ కుటుంబమే ఉండేది కాదన్నారు. భట్టి విక్రమార్క మాట్లాడుతూ టిఆర్ఎస్ నడిబజారులో రంకెలు వేస్తే తెలంగాణ రాష్ట్రం రాలేదని, కాంగ్రెస్ వల్లనే వచ్చిందన్నారు. ప్రాణహిత, ఇందిరా సాగర్ కల్వకుర్తి ప్రాజెక్టులను అడ్డుకున్నదే కెసిఆర్ అని విమర్శించారు.

నేడు నేరెళ్లకు టిడిపి బృందం

బాధితులకు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి

మన తెలంగాణ/హైదరాబాద్: నేరెళ్ల బాధిత కుటుంబాలకు తక్షణమే రూ. 10 లక్షలు ఎక్స్‌గ్రేషియా, గాయాలపాలైన ప్రతి కుటుంబానికి రూ. 5 లక్షలతో పాటు కార్పొరేట్ వైద్యం చేయించాలని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు ఎల్. రమణ డిమాండ్ చేశారు. సిఎం కె. చంద్రశేఖర్‌రావు నేరెళ్లలో దళితులపై దాడి అనుకోకుండా జరిగిన సంఘటన అని అనడం దురదృష్టకరమన్నారు. టిడిపి తరపున శుక్రవారం నేరెళ్లకు వెళ్ళి బాధిత కుటుంబలను పరామర్శించనున్నట్లు తెలిపారు. ఎన్‌టిఆర్ ట్రస్టు భవన్‌లో గురువారం రమణ, టిడిపి నేతలు మోత్కుపల్లి నర్సింహులు, రేవంత్ రెడ్డి, రావుల చంద్రశేఖర్‌రెడ్డిలతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. మంత్రి కెటిఆర్‌కు రాజకీయ జన్మనిచ్చిన ప్రాంతంలోని అడబిడ్డలు కన్నీరు పెడుతుంటే పరామర్శించడం అటుంచి మానవత్వం లేకుండా సిఎం, కెటిఆర్ ప్రవర్తించారని మండిపడ్డారు. అలాగే సిరిసిల్ల జిల్లా ఎస్‌పిని దాడి చేసిన సిఐ,ఎస్‌ఐలను సస్పెండ్ చేయాలన్నారు. నేరెళ్ల బాధితులకు అండగా జాతీయ మానవ హక్కుల సంఘాన్ని కలిసి బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాడుతామన్నారు. జైలు నుంచి బయటికి వచ్చిన 8 మంది యువకులను సంసారానికి పనికి రాకుండా చేస్తామని, వారి భార్యలపై వ్యభిచార కేసులు పెడతామనడం అనే పద్దతులు ఏ కాలంలో చేశారని మోత్కుపల్లి నర్సింహులు ప్రశ్నించారు. ప్రజల ప్రాణలు తీస్తున్న లారీలకు అడ్డం తిరగడం నేరమా అన్నారు. రాష్ట్రంలో భయంకర వాతావరణం సృష్టించాలని చూస్తున్నారని మండిపడ్డారు. ఇలా చేయడం దళిత వ్యతిరేక ప్రభుత్వం అనిపించుకోదా సిఎం సమాధానం చెప్పాలన్నారు. రాజకీయం చేస్తోంది కెసిఆరేనని అన్నారు.

కమ్యూనిస్టులపై అక్కసా?:

రేవంత్ రెడ్డి మాట్లాడుతూ కమ్యూనిస్టుల పోరాటాలు లేకుండా తెలంగాణ సమాజాన్ని ఊహించుకోగలమా అన్నారు. కెసిఆర్ ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడాలన్నారు. విద్యార్థులు, అన్ని పార్టీలు ఉద్యోగ సంఘాలు ఉద్యమాలు చేస్తేనే సిఎం అయ్యారన్న విషయం గుర్తుంచుకోవాలన్నారు. రాష్ట్రంలో జరిగిన కీలక సంఘటనలపై ప్రభుత్వం తీసుకున్న చర్యలను ప్రెస్‌మీట్‌లో చెబుతారనుకుంటే దోపిడిదారులకు ఇంకా దోచుకునేందుకు ప్రోత్సాహించే విధంగా సిఎం ప్రసంగం ఉందన్నారు. ఈ సమావేశంలో ఇతర టిడిపి నేతలు కూడా ఉన్నారు.

98–డిఎస్‌సి అక్రమాలపై వాజ్యం

మన తెలంగాణ/ హైదరాబాద్: డిఎస్‌సి – 98 అక్రమాలపై హైలెవెల్ కమిటీ నివేదిక సమర్పించినా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని, ఈ వ్యవహారంపై సిబిఐ విచారణకు ఆదేశించాలని హైకోర్టులో వ్యాజ్యం దాఖలైంది. వరంగల్ అర్బన్ జిల్లా హన్మకొండకు చెందిన కె. వేణు , ఎన్. రమేశ్ మరికొందరు వేసిన రిట్ పిటిషన్‌ను గురువారం హైకోర్టు న్యాయమూర్తి ఎ. రాజశేఖర్‌రెడ్డి విచారించి ప్రతివాదులకు నోటీసులు జారీ చేశారు. తెలంగాణ విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి, పాఠశాల విద్యా శాఖ కమిషనర్, వరంగల్ అర్బన్ జిల్లా చైర్మన్ అయిన జిల్లా కలెక్టరు, డిఈవోలకు నోటీసులిచ్చి విచారణకు రెండు వారాలకు వాయిదా వేశారు. డిఎస్సీలో సున్నా మార్కులు వచ్చిన అభ్యర్థినికి ఇంటర్వ్యూలో కేవలం నాలుగే మార్కులు వస్తే ఆమెను అర్హురాలిగా ప్రకటించి ఉద్యోగం ఇచ్చారని పిటిషనర్ న్యాయవాది అర్జున్‌కుమార్ వాదనల్లో తెలిపారు. మరో అభ్యర్థినికి నోటిఫికేషన్‌లో మార్కులు రాని వారిని అర్హులు చేయాలనే ప్రయత్నంలో భాగంగానే కటాఫ్ మార్కుల్ని తగ్గించేశారని చెప్పారు. ఐఎఎస్ అధికారి ఐవీ సుబ్బారావు అధ్యక్షతన హైలెవల్ కమిటి 2004లో అక్రమాలు జరిగాయని నివేదిక ఇస్తే నేటికీ దానిపై చర్యల్లేవని, అనర్హులు సెకండ్ గ్రేడ్ టీచర్లుగా ఎంపిక చేశారని, ఇదే తరహాలో జరిగిన వ్యాపం వ్యవహారంపై సుప్రీంకోర్టు సిబిఐ విచారణకు ఆదేశించిందని న్యాయవాది చెప్పారు.

విఒఎలకు రూ.3వేల గౌరవ వేతనం

మన తెలంగాణ/హైదరాబాద్ : విలేజ్ ఆర్గనైజేషన్స్ అసిస్టెంట్లకు (విఒఎ) రూ.3 వేల గౌరవ వేతనం అందజేసేందుకు ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీచేసింది. ఇప్పటికే దీనికి సంబంధించిన మార్గదర్శకాలను సెర్ప్ సిద్ధం చేయగా, దీనికి అనుగుణంగా ప్రభుత్వం ఉత్తర్వులను విడుదల చేసింది. వీటి ప్రకారం ఈ ఏడాది ఏప్రిల్ నుంచి రాష్ట్రంలోని 18,836 మంది విఒఎలకు రూ. 3 వేల గౌరవ వేతనం అందనుంది. గతంలో సిఎం కెసిఆర్ ఇచ్చిన హామీకి అనుగుణంగా ఉత్తర్వులు జారీ చేసినట్లు పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. గ్రామాలలో మహిళా చైతన్యంతో పాటు సామాజిక రుగ్మతలు రూపుమాపడంలో, అక్షరాస్యత పెంచడంలో విఒఎలు కృషి చేయాలని మంత్రి జూపల్లి కోరారు. అలాగే ఉపాధి హామీ, హరిత హారం లాంటి కార్యక్రమాలను విజయవంతం చేయడంలో విఒఎలు ముందుండాలన్నారు. ఇక నుంచి మరింత బాధ్యతాయుతంగా పని చేయాలని పిలుపునిచ్చారు.

ఉన్నత విద్యామండలి చైర్మన్‌గా పాపిరెడ్డి కొనసాగింపు



మన తెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్‌గా ఆచార్య తుమ్మల పాపిరెడ్డికి మరోసారి అవకాశం లభించింది. ఛైర్మన్‌గా ఆయన పదవీకాలం శుక్రవారంతో ముగుస్తుంది. ఈ నేపథ్యంలో ఛైర్మన్‌గా పాపిరెడ్డిని రెండవసారి కొనసాగింపు దస్త్రంపై గురువారం ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు సంతకం చేసి విద్యాశాఖకు పంపించారు. వైస్ ఛైర్మన్–1గా ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి, వైస్ ఛైర్మన్–2గా, ప్రొఫెసర్ వెంకటరమణ నియమితులయ్యారు.

డ్రగ్స్ కేసు జాతీయ సంస్థలతో దర్యాప్తు

మన తెలంగాణ/హైదరాబాద్: డ్రగ్స్ కేసు వ్యవహారంలో జోక్యం చేసుకుని జాతీయ సంస్థలతో దర్యాప్తునకు ఆదేశించాలని కోరుతూ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ప్రధానమంత్రి నరేంద్ర మోడీలకు టిడిపి వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ.రేవంత్‌రెడ్డి ఆన్‌లైన్ ఫిర్యాదు చేశారు. రాష్ట్రపతి, ప్రధానులతో పాటుగా కేంద్ర హోం, ఆర్థిక మంత్రులకు, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి, నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో, డైరెక్టరేట్ ఆఫ్ రెవిన్యూ ఇంటెలిజెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, సిబిఐ ఉన్నతాధికారులకు కూడా ఫిర్యాదు చేశారు. డ్రగ్స్ వ్యవహారంలో పాఠశాలలు, కళాశాలలు, సినిమాలు, ఐటి వ్యాపార రంగాలలో డ్రగ్స్ ప్రమేయం ఉన్నట్లు రాష్ట్ర ప్రభుత్వం గుర్తించిందని రేవంత్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. కోట్లాది రూపాయల లావాదేవీలు విదేశా బ్యాంకులలో జరిగాయని, నగరానికి డ్రగ్స్ ఇతర దేశాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి కూడా వచ్చాయని, కేసును విచారిస్తున్న అధికారి అకున్ సభర్వాల్‌కు ఆఫ్రికా దేశాల నుంచి బెదిరింపు కాల్స్ కూడా వచ్చినట్లు ప్రభుత్వమే చెబుతుందన్నారు.

సిఎం ఇలాగేనా మాట్లాడేది : బిజెపి



మన తెలంగాణ/హైదరాబాద్: ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు మాటలు సభ్య సమాజం హర్షించేలా లేవని, సిఎం స్థాయిలోని వ్యక్తిగా కెసిఆర్ మాట్లాడలేదని బిజెపి అధికార ప్రతినిధి కృష్ణసాగర్‌రావు విమర్శించారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. లోక్‌సభ మాజీ స్పీకర్ మీరాకుమార్‌ను ఉద్దేశించి కెసిఆర్ చేసిన వ్యాఖ్యలు కూడా అభ్యంతరకరంగా ఉన్నాయన్నారు. తాను చెబితేనే దళితుడిని రాష్ట్రపతి అభ్యర్థిగా పెట్టారని చెప్పడం మరీ దారుణమన్నారు. రాజకీయాలలో భాషను వాడే విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని, ఆ నా కొడుకులు అని రాజకీయ నేతలను ఉద్దేశించి వ్యాఖ్యానించడం తీవ్ర అభ్యంతరకరమన్నారు. సిఎంగా ఉన్న కెసిఆర్‌ను ఎవరైనా అలాంటి వ్యాఖ్యలు తిరిగి చేస్తే ఆయన స్థాయికి తగ్గవిగా ఉండదన్నారు.

ఆ పిల్ వేసింది జాగృతి వ్యక్తి కాదు

మన తెలంగాణ/హైదరాబాద్: సింగరేణి కారుణ్య నియామకాలను నిలుపుదల చేయాలని న్యాయస్థానంలో పిల్ వేసిన సతీశ్ తెలంగాణ జాగృతికి చెందిన వ్యక్తి కాదని టిఆర్ఎస్ ఎంపి కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. సిఎల్‌పి నేత కె.జానారెడ్డి ఆరోపించినట్లు సతీష్ అనే వ్యక్తి తమ జాగృతికి సంబంధించిన వ్యక్తి కాదని, ఆయన కాంగ్రెస్ నేత శంకర్ ముదిరాజ్‌కు అత్యంత సన్నిహితులని తెలిపారు.సతీష్ తెలంగాణ జాగృతి సభ్యులని జానారెడ్డి చేసిన ఆరోపణలను నిరూపించాలని సవాల్ విసిరారు. టిఆర్ఎస్ ఎప్పుడూ కార్మికుల పక్షపాతమేనని చెప్పారు.

5న జిఎస్‌టి కౌన్సిల్ సమావేశం

మన తెలంగాణ/హైదరాబాద్: ఈ నెల 5న న్యూఢిల్లీలో జరగనున్న జిఎస్‌టి కౌన్సిల్ సమావేశానికి ఆర్థిక శాఖమంత్రి ఈటల రాజేందర్‌కు బదులుగా ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి కె.తారక రామారావు హాజరుకానున్నారు. గతంలో జరిగిన కౌన్సిల్ సమావేశానికి కూడా కెటిరా హాజరైన విషయం తెలిసిందే.

తెలుగు వర్సిటీ పిహెచ్‌డి ప్రశ్నాపత్రం లీక్..?



మన తెలంగాణ/హైదరాబాద్: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఎం.ఫిల్, పిహెచ్‌డి ప్రవేశ పరీక్ష ప్రశ్నాపత్రం లీకైందని ఆరోపిస్తూ విద్యార్థులు పరీక్షను బహిష్కరించారు. గురువారం ఉదయం 11 గంటలకు పరీక్ష ప్రారంభమైన తర్వాత ఓ విద్యార్థి చేతిపై సమాధానాలు రాసుకొచ్చి పరీక్ష రాస్తుండటాన్ని తోటి విద్యార్థులు గమనించి ఇన్విజిలేటర్‌కు ఫిర్యాదు చేశారు. ఆ విద్యార్థి రాసుకొచ్చిన ప్రశ్నలు, సమధానాలు పేపర్‌లోని వాటితో జత కావడంతో పేపర్ లీకైందని విద్యార్థులు గుర్తించారు. దీనిపై వర్సిటీ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ వర్సిటీ ప్రాంగణంలో ఆందోళన చేపట్టారు. దీంతో సంబంధం ఉన్న వర్సిటీ అధికారులు, విద్యార్థులపై చర్యలు తీసుకోవాలని డిమాం డ్ చేశారు.

లీకేజీ అవాస్తవం : విచారణ కమిటీ

తెలుగు వర్సిటీలో గురువారం జరిగిన ఎం.ఫిల్, పిహెచ్‌డిలలో ప్రవేశాల కోసం నిర్వహించిన ప్రశ్నాపత్రం లీకేజి జరిగిందన్న ఆరోపణలలో వాస్తవం విచారణ కమిటీ నిర్ధారించింది. ఈ ఆరోపణలపై వర్సిటీ ఉపాధ్యక్షులు వెంటనే స్పందించి, ప్రవేశపరీక్షకు హాజరైన అభ్యర్థులు సూచించిన ప్రొఫెసర్లతో కూడిన విచారణ సంఘాన్ని ఏర్పాటు చేశారు. వారు వివిధ అంశాలను పరిగణలోకి తీసుకుని విద్యార్థులను, అధ్యాపకులను విచారించిన తర్వాత ప్రశ్నాపత్రం ముందుగా బహిర్గతం కాలేదని నిర్ధారించారు. విచారణ కమిటీకి హాజరైన వారిలో ఒయుకు చెందిన ఆచార్య సూర్యధనుంజయ్, కేంద్రీయ విశ్వవిద్యాలయానికి చెందిన ఆచార్య లక్ష్మీనారాయణ, ఇఫ్లూకు చెందిన డాక్టర్ వి.రాజునాయక్ ఉన్నారు. ఈ మేరకు వర్సిటీ ఒక ప్రకటన విడుదల చేసింది.

టిఆర్ఎస్ ఓడితే టికాణా ఉండదు

ఆయన భాష తీరు సిఎం హుందాతనాన్ని దిగజార్చింది



మన తెలంగాణ/ హైదరాబాద్ : కమ్యూనిస్టులకు సీట్లు మాత్రమే రాలేదని, ఎన్నికల్లో ఓడితే టిఆర్ఎస్‌కు టికాణే ఉండదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి అన్నారు. సిఎం కెసిఆర్ బుధవారం రాత్రి సాయంత్రం పొద్దుపోయే వరకు సాగించిన విలేకరుల సమావేశంలో ఆయన భాష, తీరు ముఖ్యమంత్రి హోదాను, హుందాతనాన్ని దిగజార్చారని ఆయన గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో విమర్శించారు. కెసిఆర్ నోటికి హద్దు, అదుపులేని కుసంస్కారిగా అధికార అహన్ని, దర్పాన్ని ప్రదర్శించారే తప్ప ఒక నిజాయితీ గల రాజకీయవేత్తగా కూడా వ్యవహరించలేదన్నారు. ప్రతిపక్షాలు లేవనెత్తే ప్రశ్నలకు ఆయన రాజకీయ సమాధానం ఇచ్చే ధైర్యం తెచ్చుకోవాలని అన్నారు. కెసిఆర్ కమ్యూనిస్టులపై చేసిన వ్యాఖ్యలపై చాడ తీవ్రంగా స్పందించారు. ''అధికారం మత్తె మదమైనప్పుడు కళ్లు కప్పుకుపోవడం సహజం. కళ్ళు కప్పుకుపోయినప్పుడు కమ్యూనిస్టులపై, శ్రమజీవులపై ప్రత్యక్షంగా, పరోక్షంగా దిగజారిన విమర్శలు చేయడం సహజం. అందులో కెసిఆర్ మొదటివాడు కాదు, చివరివాడూ కాదు. మానవాళికే వెలుగునిచ్చే సిద్ధాంతాన్ని కరదీపిక చేసుకుని ప్రజల కోసం త్యాగాల కత్తి మొన మీద నడుస్తున్న కమ్యూనిస్టులది వీర చరిత్ర. అధికారం కోసం ఏ గడ్డైనా గరువాలన్నది కెసిఆర్ సిద్ధాంతం. ఎవరి వీపు వారికి కనపడదు. వాపును చూసి బలుపు అనుకోవడం అనాలోచితమే అవుతుంది. దశాబ్దాల పాటు పదవులను అనుభవించి తాను పదవులను త్యజించానని గొప్పలు చెప్పుకున్న కెసిఆర్, ప్రాణత్యాగాలు చేసిన వారి మాటేమిటి? ప్రజల కోసం నిరంకుశ పాలకులను ఎదిరించి పోరాడుతున్న కమ్యూనిస్టుల త్యాగాల ముందు కెసిఆర్ త్యాగమెంత?. మాటలు తప్పే, మాటలు మార్చే కెసిఆర్ కమ్యూనిస్టులకు హితువు చెపుతాడా! ప్రజలు కన్నెర్ర చేసే రోజులు దగ్గరలోనే ఉన్నాయి'' అని చాడ వెంకటరెడ్డి అన్నారు. ''ముఖ్యమంత్రి కెసి ఆర్‌కు తక్షణ చికిత్స అవసరం. ఎందుకీ ముఖ్యమంత్రి ఇంత దిగజా రిపోతున్నారని ఇప్పుడు అందరికీ ఆశ్చర్యాన్ని కలిగిస్తున్న ప్రశ్న. మానసిక, ఆరోగ్యపరమైన జబ్బు ఏదైనా ఎగబాకుతున్నదా?. కెసిఆర్ ముఖ్యమంత్రి. ఆయన్ను రక్షించుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రజలందరిది. ఈ జబ్బుకు చికిత్స కొసం ఆయన ఎక్కడికెళ్ళినా ఎవరికీ అభ్యంతరం వుండకూడదు'' అని అన్నారు. ఏ పార్టీలూ ప్రజాస్వామ్య వ్యవస్థలో విమర్శలకు అతీతం కాదని, అధికారపార్టీపై ప్రతిపక్షాలు విమర్శలు సాగించినప్పుడు వాటిపై విమర్శలు చేసే హక్కు ముఖ్యమంత్రికి ఉందని, కాని ఆయన గురువారం చేసిన వ్యాఖ్యలు ముఖ్యమంత్రి హోదాను విస్మరించిన, సంస్కారహీనమైన భాషతో కూడుకున్నవన్నారు. అవి తెలంగాణ యాసకు, భాషకు, సంస్కృతికి అపఖ్యాతికరమైనవన్నారు. సిఎం సాగించిన విమర్శల ధోరణికి అంతా ఖిన్నులయ్యారన్నారు. సిఎం వ్యక్తిగత దాడులు రాజకీయ దివాళ కోరుతనానికి నిదర్శనమని, ఇప్పటికైనా సంస్కారం నేర్చుకోవాలన్నారు.

పోలీసులుకు వత్తాసు పలికేలా సిఎం మాటలు

నేరేళ్ళ బాధితుల ఘటనపై సిఎం కెసిఆర్ మాట్లాడిన తీరు పూర్తిగా పోలీసులకు వత్తాసు పలికినట్లుగాఉందని చాడ వెంకటరెడ్డి విమర్శించారు. నేరెళ్ళ ఘటనపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతున్నా కెసిఆర్ నిర్లక్ష్యంగా చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని, ఏమాత్రం మానవత్వం, నిజాయితీ వున్నా ఘటనపై హైకోర్టు న్యాయమూర్తితో విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు.

నాడు దేశభక్తులని పొగిడి నేడు బూతులు : తమ్మినేని

మన తెలంగాణ/ హైదరాబాద్: ముఖ్యమంత్రి కెసిఆర్ అవకాశవాది అని, 2004 నుంచి 2014 వరకూ జరిగిన ఎన్నికల్లో కమ్యూనిస్టులతో పొత్తుకు వెంపర్లాడుతూ దేశభక్తులు అంటూ పొగిడారని, నేడు కమ్యూనిస్టులు ప్రశ్నిస్తే బూతులు మాట్లాడుతున్నారని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం విమర్శించారు. తమ్మినేని గురువారం మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ ప్రజలు, ప్రతిపక్షాల గురించి ఇష్టమొచ్చినట్టు మాట్లాడుతున్న కెసిఆర్ సిఎం పదవికి అర్హుడేనా? అనే అనుమానం కలుగుతోందన్నారు. మంత్రి కెటిఆర్‌కు చెందిన హిమాన్షు మోటార్స్ గురించి కమ్యూనిస్టులుగా మేం లేవనెత్తిన అంశాలు, ప్రశ్నలకు సమాధానమివ్వకుండా బూతులు మాట్లాడడం ఆయన రాజకీయ దివాళాకోరుతనానికి నిదర్శనమన్నారు. పరిపాలన లోపాలను ఎత్తిచూపిస్తున్నామని, వాటిని చక్కదిద్దుకోకుండా కమ్యూనిస్టులు, ఇతర ప్రతిపక్షాల గురించి చౌకబారు విమర్శలు చేయడం దారుణమన్నారు. కమ్యూనిస్టులు ఓట్లు, సీట్ల విషయంలో బలహీనంగా ఉన్నా, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ వారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతామన్నారు. ఇంటికో ఉద్యోగం ఏమైందని సిఎం కెసిఆర్‌ను తెలంగాణ సామాజిక, ప్రజా సంఘాల ఐక్య వేదిక (టి మాస్ ఫోరం) నాయకులు ప్రశ్నించారు. ఇంటికో ఉద్యోగం ఇస్తానని చెప్పి, అధికారంలోకి వచ్చి మూడేళ్లయినా.. ఆ వాగ్దానాన్ని అమలు చేయలేదని విమర్శించారు. ప్రజలకిచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ టి మాస్ ఫోరం గురువారం రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించింది. ఇందులో భాగంగా ట్యాంక్‌బండ్‌పై ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన ధర్నాలో టిమాస్ స్టీరింగ్ కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం, విమలక్క, జె.బి.రాజు, జాన్‌వెస్లీ, మేధావుల ఫోరం రాష్ట్ర కన్వీనర్ ప్రొఫెసర్ పి.ఎల్.విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు దిష్టి బొమ్మల దగ్ధం

దళితనాయకురాలు, మాజీ స్పీకర్ మీరాకుమార్‌ను, ప్రజా సంఘాల నాయకులను, వామపక్షాలు, ప్రతిపక్షాలను, మీడియాను సైతం ముఖ్యమంత్రి అప్రజాస్వామికంగా, అవమానకరంగా మాట్లాడడాన్ని నిరసిస్తూ శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా ముఖ్యమంత్రి దిష్టిబొమ్మను దగ్ధం చేయాలని టీమాస్ ఫోరం రాష్ట్ర కమిటీ నిర్ణయించింది.

జలయజ్ఞం పేరుతో కాంగ్రెస్ దోపిడీ


40 ఏళ్లలో కనీస అవసరాలు తీర్చలేదు ఈటల ధ్వజం



మన తెలంగాణ/హైదరాబాద్: నలభై ఏండ్లు పాలించిన కాంగ్రెస్ పార్టీ ప్రజల కనీస అవసరాలను కూడా తీర్చలేదని ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్ విమర్శించారు. జలయజ్ఞం పేరుతో కాంగ్రెస్ దోపిడీకి పాల్పడిందని ఆరోపించారు. టిఆర్ఎస్ శాసనసభాపక్ష కార్యాలయంలో మంత్రి ఈటల మాట్లాడుతూ కాంగ్రెస్ అడుగడుగునా అభివృద్ధికి అడ్డుపడుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్లలో మిడ్ మానేరు పూర్తి చేస్తమని చెప్పి..పదేళ్లయినా 30 శాతం కూడా పూర్తి చేయలేదన్నారు. ప్రాణహిత అంచనా వ్యయం పెంచింది కూడా కాంగ్రెస్సేనన్నారు. అధికారం లేకపోవడంతో కాంగ్రెస్ నేతలు నిరాశ, నిస్పృహలతో మాట్లాడుతున్నరని కాళ్లలో కట్టె పెట్టిన మాదిరిగా అభివృద్ధికి అడ్డుపడుతున్నారని ఆగ్ర హం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి దిశ, కర్తవ్యం ఉందని, కేంద్రంతోపాటు మిగతా రా ష్ట్రాలు ప్రభుత్వ పనితీరును ప్రశంసిస్తున్నాయన్నారు. కాంగ్రెస్ నేతలు జానారెడ్డి, షబ్బీర్ అలీ చేసిన విమర్శలను ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వర్ రెడ్డి ఖండించారు. అన్నింటికి రాజకీయ రంగు పులమడం కాంగ్రెస్‌కు అలవాటుగా మారిందన్నారు. నేరెళ్లలో ఇసుక లారీ ప్రమాదంలో ఓ యువకుడు మరణిస్తే దానిని కూడా వివాదం చేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో ప్రభుత్వ చీఫ్ విప్ పాతూరి సుధాకర్ రెడ్డి కూడా ఉన్నారు.

జానారెడ్డి ఆవేశంతో మాట్లాడుతున్నారు: తెలంగాణ భవన్‌లో ఎంపి బాల్కసుమన్ మాట్లాడుతూ జానారెడ్డి ఆవేశంలో ఏది పడితే అది మాట్లాడుతున్నారని అన్నారు. కాంగ్రెస్ చేస్తుందే సిఎం చెప్పారని తెలిపారు. సిఎం కె. చంద్రశేఖర్‌రావు కుటుంబంపై నిరాధార ఆరోపణలు చేస్తే ఊరుకుని లేదన్నారు. రాష్ట్రంలో అసలు టిడిపి లేదని, రేవంత్ రెడ్డి ఒక రాజకీయ ఉన్మాది అని మండిపడ్డారు. దళితుల గురించి మాట్లాడే అర్హత టిడిపికి లేదని నాటి వారి ప్రభుత్వ హయాంలో దళితులను ఊచకోత కోసింది నిజం కదా అని ప్రశ్నించారు. పద్దతి మార్చుకోకపోతే రేవంత్‌కు తగిన విధంగా బుద్ధి చెబుతామన్నారు.

"ఆదర్శంకంటే ధర్మం గొప్పది. ఆయుధాల కంటే ఆత్మశక్తి గొప్పది. రాక్షసత్వం కంటే మానవత్వం గొప్పది. –గోపాలకృష్ణ గోఖలే"



ముఖ్యమంత్రి అసహనం

సంపాదకీయం

ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు శానాళ్ల తర్వాత పత్రికల వారి సమావేశం పిలిచి ప్రతిపక్షాలపై కడుపులో ఆగ్రహం కక్కేశారు. ప్రభుత్వ అభివృద్ధి పథకాలను అడ్డుకోవటమే పనిగా పెట్టుకుని అదే పనిగా కోర్టుల్లో కేసులేస్తున్న కాంగ్రెస్ పార్టీకి పుట్టగతులుండవన్నారు. ఆ పార్టీ తెలంగాణ పాలిట పిశాచి, భూతం అని నిందించారు. కమ్యూనిస్టు పార్టీ లు ఇంకా ఈ రాష్ట్రంలో ఉన్నయ్యా అని ప్రశ్నించారు. ముస్లిం పేదల రిజర్వేషన్‌ల విషయంలో పాపం, లోకల్ బిజెపి వాళ్లు పరేశాన్‌లో ఉన్నారని వ్యాఖ్యానించారు తప్ప అంతకుమించి విమర్శలు చేయలేదు. 'కేంద్రంలో అంశాల వారీగా బిజెపికి మద్దతిస్తున్నాం. బిజెపికి దగ్గరగా ఉన్నామా? దూరమా అనేది అప్రస్తుతం. కేంద్రం–రాష్ట్రాల మధ్య సుహృద్భావ వాతావరణం ఉండాలన్న రాజ్యాంగం ప్రకారం నడుచు కుంటున్నాం' అని వివరించిన ముఖ్యమంత్రి ''మేం జీవితాంతం పూర్తిగా లౌకికవాదు లుగానే ఉంటాం. దేశం ఎప్పుడూ సెక్యులర్‌గానే ఉండాలని కోరుకుంటున్నా'' అన్నారు. తెలంగాణ అభివృద్ధికి వజ్ర సంకల్పంతో ముందుకు సాగుతామని ప్రకటించిన కెసిఆర్, రెండు–మూడేళ్లలో గొప్ప తెలంగాణ ఖాయం అన్నారు.

ఇరిగేషన్, విద్యుదుత్పాదన ప్రాజెక్టులు, కాంట్రాక్టు–ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్, ఉద్యోగ నోటిఫికేషన్‌లు, కొత్త సచివాలయ నిర్మాణం–ఇలా తలపెట్టిన ప్రతి కార్యానికి కోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు దాఖలు కావటంతో పనులు అనుకున్నంత వేగంగా ముందుకు సాగకపోవటం ముఖ్యమంత్రి అసహనానికి కారణంగా కనిపిస్తున్నది. ఆ కేసులన్నిటినీ కాంగ్రెస్ వారే వేయిస్తున్నారన్న అభిప్రాయంతో ఆ పార్టీ రాష్ట్ర నాయకత్వంపై దాడిని ఎక్కుపెట్టారు. వారు మొత్తం 196 కేసులు వేయించారంటూ, ఇరిగేషన్ ప్రాజెక్టులపైనే 164 కేసులు వేశారని పేర్కొన్నారు. ఇరిగేషన్ ప్రాజెక్టుల రీడిజైన్‌తో వారిలో గుబులు బయలుదేరిందని, తాము చెయ్యలేనిది టిఆర్ఎస్ ప్రభుత్వం చేస్తే తమకు పుట్టగతులుండవన్న భయంతో ఏంచేసైనా సరే ప్రాజెక్టులు ఆపాలని చూస్తున్నారని ఆరోపించారు.

కాంట్రాక్టు ఉద్యోగులందర్నీ రెగ్యులరైజ్ చేయాలనుకున్నప్పటికీ సుప్రీంకోర్టు వ్యతిరేక తీర్పు కారణంగా, కరెంటు డిపార్టుమెంట్ విభాగాల్లో 21వేలమందిని 'అబ్జార్బ్' (విలీనం) చేసుకునేందుకు జారీ చేసిన ఉత్తర్వులపై హైకోర్టులో ఒక ప్రైవేటు వ్యక్తి కేసువేయటం, ఆ ఉత్తర్వులను హైకోర్టు తాత్కాలికంగా నిలుపుదల చేయటం ముఖ్యమంత్రి ఆగ్రహానికి తక్షణ కారణంగా కనిపిస్తోంది. కోర్టు సూచించిన వేతనాలకన్నా అదనంగా చెల్లిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. రైతులు, కాంట్రాక్టు కార్మికులు దుష్టరాజకీయాలకు ఒడిగడుతున్న కాంగ్రెస్‌ను నిలదీయాలని కోరారు.

ముఖ్యమంత్రి తన ప్రభుత్వ పథకాలు, వాటి పురోగతి, ఇబ్బందులుంటే అందుకు కారణాలను ప్రజలకు వివరించటం ఎంతైనా సబబు. ప్రతిపక్షాలను విమర్శించనూ వచ్చు. ప్రతిపక్షాల విమర్శలు, ఆరోపణలన్నీ హేతుబద్ధంగా ఉండకపోవచ్చు. కొన్ని దురుద్దేశ పూరితం కూడా కావచ్చు. కాని వాటిని విమర్శించేందుకు ముఖ్యమంత్రి ఎంచుకునే భాష హుందాగా ఉండాలి. లేకపోతే ప్రజలు మెచ్చరు. సన్నాసులు, పిశాచాలు, భూతాలు, కంత్రీలు, దద్దమ్మలు, పిచ్చోళ్లు లాంటి పదాలు రాజకీయ పరిభాష కాదు. ప్రభుత్వం ఏ పనిచేయాలన్నా అది చట్టసమ్మతంగా ఉండాలి. ముఖ్య మంత్రికి వచ్చిన ఆలోచనల్లా చట్టం కాదు. అనేక ప్రభుత్వ ఉత్తర్వులను హైకోర్టు కొట్టివేసిందంటే అవి చట్ట వ్యతిరేకమనే కదా! అలాగే కొన్ని ప్రభుత్వ వ్యతిరేక పిల్‌లను కూడా కొట్టివేసింది. కాబట్టి పరిపాలన చట్టబద్ధంగా జరగాలి, ఉల్లంఘన జరిగిందని భావించిన ఎవరైనా కోర్టులో సవాలు చేయవచ్చు. కోర్టుల్లో కేసుల వల్ల అనేక ప్రాజెక్టుల నిర్మాణంలో ఆలస్యం జరగటం వాస్తవం. ప్రజాస్వామిక వ్యవస్థలో, రాజ్యాంగ బద్ధ పరిపాలనా వ్యవస్థలో ఇది సహజం. ప్రభుత్వం ముందే న్యాయపరమైన జాగ్రత్తలు తీసుకుంటే సక్సెస్ రేటు ఎక్కువగా ఉంటుంది. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాల పాత్రను గుర్తించి అఖిలపక్ష సమావేశాలు జరుపుతూ ప్రభుత్వ పథకాలను చర్చిస్తూ ఉంటే పరిస్థితి మెరుగ్గా ఉంటుంది. ప్రతి పక్షాలు నెగటివ్ మైండ్‌సెట్‌తో పనిచేస్తున్నా యంటున్న ముఖ్యమంత్రి వాటిపట్ల తన వైఖరిని పునఃసమీక్షించు కోగలిగితే ఇంతటి అసహనానికి ఆస్కారం ఉండదు.

బిసిల బిల్లుపై కపట నాటకం

చూపు


తరగతులకు జాతీయ కమిషన్ (ఎన్‌సిబిసి)ని ఏర్పాటు చేయడానికి ఉద్దేశించిన బిల్లును పార్లమెంట్ ఉభయ సభలలో వేర్వేరు పాఠాలను ఆమోదించిన ఫలితంగా రాష్ట్రపతి పంపలేదు. ఈ తప్పు అసలు ఎలా జరిగిందన్నది ప్రశ్న. ఇటీవల (2017, జులై 31) ప్రస్తుత ఎన్‌డిఎ ప్రభుత్వం ఈ బిల్లును రాజ్యసభలో ఆమోదింపజేసింది.

ఇది రాజ్యాంగం 123వ సవరణ బిల్లు. ఈ బిల్లు ఉద్దేశిస్తున్న ఎన్‌సిబిసి 2004లో యుపిఎ ప్రభుత్వం తెచ్చిన షెడ్యూల్డు కులాలు, తెగల జాతీయ కమిషన్‌లను పోలి ఉంది. ఎన్‌సి,బిసి బిల్లుకు రాజ్యసభలో పార్టీలు తమ వైరుధ్యాలను మరచి గట్టిగా మద్దతు పలికాయి. 3వ క్లాజును తొలగింపజేసి ఏకగ్రీవంగా సంబంధిత రాజ్యాంగ సవరణ బిల్లును ఆమోదించాయి. ఏమైనప్పటికీ ఆ బిల్లును ఇప్పుడు రాష్ట్రపతి ఆమోదం కోసం పంపలేని పరిస్థితి తలెత్తింది. ఎందుకంటే లోక్‌సభ, రాజ్యసభ ఆమోదించిన బిల్లు పాఠాలు ఒక్కటిగా లేవు.

ప్రతిపక్షంపై నిందలు

ఈ ప్రతిష్టంభన వల్ల ఎగువ సభలో ప్రతిపక్షాలు ఇంత కీలకమైన బిల్లును విచ్ఛిన్న పరిచాయని అధికార పక్షం ఆరోపణలు చేస్తోంది. రాజ్యసభలో ప్రతిపక్షాలు బిల్లులో 3వ క్లాజుకు నాలుగు సవరణలు జరిగేలా పట్టుబట్టడంతో బిజెపి అలా ఆడిపోసుకుంటోంది. ఆ క్లాజు చివరకు తొలగించినా, ప్రతిపక్షంపై బురద చల్లడాని కి ఆ ఉదంతాన్ని ప్రస్తుతం వాడుకొన్నారు. ఇక్కడ మూడు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. 1) ప్రతిపక్షాలు సూచించిన ఆ సవరణలు (2730) సరి యైనవేనా? 2) సభ నిర్వహణ వ్యూహంలో ప్రభుత్వం వైపు నుంచి ఏదైనా తప్పు దొర్లిందా?3) ప్రస్తుత ప్రతిష్టంభన తొలగింపునకు ఏకాభిప్రాయానికి వచ్చే మార్గాంతరాలు ఏవైనా ఉన్నాయా?

బిల్లును పరిశీలించిన సెలెక్టు కమిటీ సభ్యులయిన కాంగ్రెస్ ఎంపిలు దిగ్విజయ్ సింగ్, బికె హరిప్రసాద్, హుస్సేన్ దల్వాయి ఆ ప్రతిపాదనలు చేశారు. వాటివల్ల కమిషన్ సభ్యుల సంఖ్య మూడు నుంచి ఐదుకి పెరుగుతుంది. ఆ ఐదుగురు వెనుకబడిన తరగతుల వారై ఉండాలని వారి సవరణ నిర్దేశించింది. వారిలో ఒకరు విధిగా ఒక మహిళా సభ్యురాలు, ఒక మైనారిటీ ప్రతినిధి వుండాలి. సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన తరగతుల జాబితా నుంచి ఎవరినైనా తొలగించడం లేదా చేర్చే అధికారాలను రాష్ట్రాలకు ఇతర సవరణలు కట్టబెడుతున్నాయి. జాబితాలో మార్పులు చేర్పుల అధికారం కేవలం కేంద్రానికే ఉండాలని రాజ్యాంగంలోని 342 (ఎ) 366(26సి) అధికరణ నిర్దేశిస్తోంది. అందుచేత ఆ ఇతర సవర ణలు అవసరపడ్డాయి. గవర్నర్ అభిప్రాయాన్ని రాష్ట్రపతి పరిగణనలోకి తీసుకోవాలని ఈ బిల్లులో ఎక్కడా లేదు. సవరణలు ప్రతి పాదించిన వారి తరపున దిగ్విజయ్ సింగ్ మాట్లాడుతూ బిల్లును పటిష్ట పరచడం, ప్రాతినిధ్యం పెంచడమే లక్ష్యమని వివరించారు. దేశ వ్యాప్తంగా వెనుకబడిన తరగతుల గుర్తింపులో ఉన్న సంక్లిష్టత రీత్యా కమిషన్ విస్తృతి పెంచడం, మహిళలకు, మైనారిటీలకు ప్రాతినిధ్యం కల్పించడం ముఖ్యమైనది. ఉదాహరణకు దక్షిణ భారతదేశంలో రజక వృత్తి వారిని ఒబిసిలుగా కొన్ని చోట్ల పరిగణిస్తున్నారు. అయితే ఉత్తర భారతదేశంలోని కొన్ని చోట్ల వారిని షెడ్యూల్డ్ కులాలుగా గుర్తించారు.



బిల్లును పటిష్టపరిచిన సవరణలు

మధ్యప్రదేశ్ మీనాలను ఒబిసిలుగా పరిగణిస్తే రాజస్థాన్‌లో షెడ్యూల్డ్ తెగగా గుర్తించారు. అందువలన వెనుకబడిన తరగతులను గుర్తించడం పెద్ద సవాలుగా పరిణమించింది. విభిన్న వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించే విస్తృత కమిషన్ మాత్రమే ఆ పని చేయగలదు. అలాగే ఈ అంశంలో రాష్ట్రాల నుంచి తగినంతగా భాగస్వామ్యం కూడా అవసరం. ఆ కోణంలో సవరణలు ఎంతో ప్రాముఖ్యత సంతరించుకున్నాయి. అయితే సభా నాయకుడు అరుణ్ జైట్లీ ఒక వ్యతిరేక వాదన వినిపిస్తున్నారు. ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ల ఏర్పాటు చట్టాలలో ఉన్న నిబంధనలే బిసి కమిషన్ సభ్యత్వానికి తాజా బిల్లులో ఉన్నాయని అందుకు సవరణలే కారణమని ఆయన వాదిస్తున్నారు. అందువల్ల ఆచరణలో కష్టాలు తప్పవని సూచించారు.

త్వరగా ఆమోదానికి ప్రభుత్వ ప్రాధాన్యం

మహిళలకు, మైనారిటీలకు ప్రాతినిధ్యం వుండడం ముగ్గురు సభ్యుల కమిషన్‌లో సాధ్యం కాదు కనుక సభ్యుల సంఖ్య ఐదుగురుకి పెంచడం జరిగింది. నిజానికి ఆ సవరణలలో ప్రతి ఒక్కటి చట్టాన్ని బలోపేతం చేస్తున్నదే. అయితే బిల్లును త్వరగా ఆమోదింప చేయ డానికి ప్రభుత్వం అడుగడుగునా తహతహ ప్రదర్శించడం స్పష్టంగా కనిపిస్తోంది. ఈ బిల్లును గత ఏప్రిల్ 5న లోక్‌సభలో ప్రవేశపెట్టారు. మరునాడు తొలిసారి చర్చ జరిగింది. అక్కడ ఏప్రిల్ 10న లోక్‌సభలో ఆమోదం పొందగానే బిల్లును రాజ్యసభలో ప్రవేశపెట్టారు. ప్రతిపక్ష సభ్యుల సూచన మేరకు సెలెక్ట్ కమిటీకి పంపారు. ఆ కమిటీని బిజెపి మాజీ సభ్యుడు రూపేందర్ యాదవ్ అధ్యక్షతన తక్షణం ఏర్పాటు చేశారు. వివిధ పార్టీల సభ్యులతో ఏర్పడిన ఆ కమిటీ గత నెల 19న నివేదిక సమర్పించింది. కమిటీలోని కాంగ్రెస్ సూచించిన సవరణలను మంత్రి హామీపై పక్కనపెట్టారు. బిల్లు నియమాలను రూపొందించే తరుణంలో ఆ సవరణలను చేర్చుతామని మంత్రి హామీ ఇచ్చారు. అయితే అటువంటి హామీలను తరువాత పట్టించుకోని చరిత్ర చాలా బిల్లులకు ఉంది. ఉదాహరణకు 2017 ఆర్థిక బిల్లును అడ్డదోవలో ఆమోదింప చేశారు. లేదా రాజ్యసభను తప్పించు కోడానికి బిల్లులను ద్రవ్య బిల్లులుగా ముద్రవేసి ఆమోదించే సాంప్రదాయం కూడా ఉంది. ప్రస్తుత బిల్లు విషయంలో ప్రతిపక్షం సూచించిన పురోగామి సవరణలను ఓడించడానికి అధికారపక్షం ప్రయత్నించడంతో గందరగోళం తలెత్తింది. బిల్లు చట్టంగా రూపొందే ప్రక్రియ సజావుగా సాగకపోతే ప్రభుత్వానిదే తప్పని చెప్పాలి. రాజ్యాంగబద్ధంగా పటిష్టమైన కమిషన్ ఏర్పడాలని ప్రతిపక్షాలు కోరుతుంటే, వాటిని పక్కనపెట్టి త్వరగా బిల్లు ఆమోదింపచేసే ప్రయత్నం ప్రభుత్వం చేసింది. ఇదే ప్రస్తుత ప్రతిష్టంభనకు దారి తీసిందని చెప్పక తప్పదు.

– ఎం.వి.రాజీవ్ గౌడ

సంక్షేమంపై ఎన్‌డిఎ కత్తి



ఉజ్జిని రత్నాకర్‌రావు
ప్రధాన కార్యదర్శి
ఎఐటియుసి
తెలంగాణ రాష్ట్ర సమితి

''సబ్‌కాసాత్ సబ్‌కా వికాస్'' భారత ప్రజలందరి వికాసమే నా లక్ష్యం అని ప్రధాని నరేంద్ర మోడీ ప్రకటించారు. అధికారంలోనికి వచ్చిన ఈ మూడు సంవత్సరాలలో అనేక వాగ్దానాలు, పథకాల హామీల ప్రచారార్భాటానికేనన్న విషయం తేటతెల్లమవుతుంది. పాలనలో పారదర్శకత పాటించకుండా చాపక్రింద నీరులా పేదలకు అందిస్తున్న వివిధ సబ్సిడీల కత్తిరింపులకు పూనుకుంది.

ఆహార భద్రతా చట్టం క్రింద పేదలకు అందించే నిత్యావసర సరుకుల సరఫరాను ఒకటి తర్వాత ఒకటి నిలుపు చేస్తున్నారు. మే నెల నుండి చక్కెర సరఫరాను బంద్ చేయటం జరిగింది. గత ఏడాది పెట్రోల్‌పై ఇచ్చే రాయితీలు రూ.27,317కోట్ల నుండి రూ.25 వేల కోట్ల వరకు తగ్గించారు. తాజాగా ఎల్‌పిజి సిలెండర్లపై ఉన్న సబ్సిడీని ప్రతినెల రూ.4/–ల చొప్పున పెంచుతూ వచ్చే ఏడాది వరకు లేదా ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ సున్నా అయ్యేంతవరకు పెంచాలని ఏన్డీయే ప్రభుత్వం నిర్ణయించింది. ఇది పూర్తిగా అన్యాయం. ఒక వైపు అంతర్జాతీయ మార్కెట్‌లో పెట్రోల్ డీజిల్ క్రూడ్ ధరలు బ్యారెల్‌కు 48 డాలర్లకు పడిపోయింది. వాటి ధరలను అంతర్జాతీయ మార్కెట్‌కు అనుసంధానం చేశారు. అయినా భారత దేశంలో వివిధ రకాల పన్నులువేసి ప్రజలపై అధిక భారాన్ని మోపుతున్నారు.

ఆహార భద్రత చట్టం 2013 క్రింద పేదలకు రూ.2/–లకు కిలో గోధుమలు, రూ.3/–లకు కిలో బియ్యం, రూ.1/కి కిలో ముడి ధాన్యం (రాగులు, సజ్జలు, జొన్నలు వగైరా) సరఫరా చేయాలని ఆనాటి యుపిఏ ప్రభుత్వం నిర్ణయించి పౌర సరఫరాల సంస్థ ద్వారా నిత్యావసర వస్తువులైన గోధుమలు, బియ్యం, చక్కెర, గ్యాస్‌నూనె, మంచినూనె, పప్పులు, ఉప్పు, బెల్లం, కారం, చింతపండు, పసుపు, ఎల్లిగడ్డలు, సబ్బులు వగైరా 14 రకాల వస్తువులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సరఫరా చేస్తున్నాయి. వీటిపై కేంద్ర ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీలను ఒకటి తర్వాత ఒకటి తగ్గిస్తూ మరింత భారం పడటంతో రాష్ట్రప్రభుత్వాలు సరఫరాలను నిలిపివేస్తున్నాయి. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నడుపుతున్న మధ్యాహ్న భోజన పథకం, ఐసిడిఎస్ తదితర స్కీంలు కూడా నిర్వీర్యం అయ్యే స్థితి ఏర్పడనున్నది.

ప్రపంచ వ్యాపితంగా వంట కోసం బొగ్గు, కట్టెలు, పిడకలు 43శాతం వాడుతుండగా భారత్‌లో 50 శాతం కుటుంబాలు వీటిపైనే ఆధారపడి ఉన్నాయని లెక్కలు చెపుతున్నాయి. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు లబ్ధి చేకూర్చేలా 5కోట్ల కుటుంబాలకు ఉచిత గ్యాస్ కనెక్షన్స్ ఇస్తామని, 80శాతం జనాభాను గ్యాస్ వినియోగపరిధిలోనికి తీసుకొస్తామని వాగ్దానం చేసిన ప్రభుత్వం వాస్తవానికి ఈ 3 సంవత్సరాల కాలంలో 18లక్షలు మాత్రమే యిచ్చింది. మరోవైపు ఆదాయవర్గాలు వంటగ్యాస్ రాయితీని వదులు కోవాలని మోడీ పిలుపిచ్చారు. దీనికి 'లీవ్ ఇట్ ఆఫ్' అని ముద్దు పేరు పెట్టారు. రాయితీలు వదులుకున్న వారు మరొక పేదవాడికి సబ్సిడీని ఇచ్చినట్టేనని నమ్మబలికారు. దీనివలన రూ.5వేల కోట్ల ఆదాయం వచ్చినట్లు ప్రకటించారు. ఆ తర్వాత 10లక్షల ఆదాయం ఉన్నవారు సబ్సిడీ గ్యాస్ వదులుకోవాలని హెచ్చరించారు. ఇప్పుడు మొత్తం సబ్సిడీనే ఎత్తి వేశారు. ప్రభుత్వం ఒక పథకం ప్రకారమే సబ్సిడీ గ్యాస్‌కు మంగళం పాడుతున్నది.

వ్యాపార సిలిండర్లకు సబ్సిడీ లేదు. దేశ వ్యాపితంగా 24కోట్ల ఇండ్లు ఉంటే 14కోట్ల మందికి గ్యాస్ కనెక్షన్స్ ఉన్నాయి. గ్రామాలు, కొండ ప్రాంతాల్లోని 10 కోట్ల ఇండ్లల్లో ఇంకా వంటచెరుకు, పేడతో చేసిన పిడకలు, బొగ్గు వంటివి ఇంధనంగా వాడుతున్నారు. మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఉజ్వల పేరిట గ్యాస్ కనెక్షన్ల జారీని పెద్ద ఎత్తున ప్రారంభించారు. ఈ పథకంలో 1.60కోట్ల కుటుంబాలకు ఉచిత గ్యాస్ కనెక్షన్స్ అందించామని చెపుతున్నారు. అంతకు ముందు కొన్ని రాష్ట్రాలలో దీపంవంటి పథకాల ద్వారా మహిళలకు ఉచితంగానే గ్యాస్ కనెక్షన్స్ ఇచ్చారు.

గత ఏడాది మొత్తం 19 మిలియన్ టన్నుల వంట గ్యాస్ వినియోగించారు. ఏటేటా ఇది 10శాతం చొప్పున పెరుగుతుంది. తాజా అంచనాల మేరకు గ్యాస్ కనెక్షన్లలలో 25శాతం ఎస్‌సి, ఎస్‌టి కుటుంబాల వద్ద ఉన్నాయి. 43శాతం కనెక్షన్స్ దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవారు ఉపయోగిస్తున్నట్లు తెలుపుతున్నారు. మోడీ ప్రకటించిన 'లీవ్ ఇట్ ఆఫ్' పథకంలో ఉన్నత వర్గాలు వదిలేసిన సబ్సిడీ విలువ రూ.21వేల కోట్లు ఆదా అవుతుంది. గ్యాస్ సబ్సిడీని నేరుగా లబ్ధిదారులకు బ్యాంక్ ఖాతాలో జమచేయటం వలన నకిలీ కనెక్షన్ల బెడద తొలగి పోయింది. ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ ప్రతిపైసా వినియోగదారుడికి చేరుతుంది. సబ్సిడీ భారం రూ.20 వేల కోట్లకు పరిమితం అయ్యింది.

గతంలో కిరోసిన్‌పై సబ్సిడి అన్ని వర్గాల వారికి అందించేవారు. మొదట్లో పింక్ రేషన్ కార్డువారికి 25 లీటర్ల తర్వాత 10లీటర్లకు, 5లీటర్లకు తగ్గిస్తూ గ్యాస్ కనెక్షన్ ఉన్నవారికి కిరోసిన్ ఎత్తివేశారు. తెల్ల రేషన్ కార్డు వారికి 5లీటర్ల కిరోసిన్ ఇచ్చేవారు. మార్కెట్‌లో కిరోసిన్ ధర విపరీతంగా పెరిగింది. దీనిపై కూడా సబ్సిడీని ఎత్తివేశారు. గ్యాస్ కనెక్షన్స్ ఉన్న పేద వారికి కూడా ఇచ్చే సబ్సిడిని కిరోసిన్ 5లీటర్ల నుండి ఒక్క లీటర్‌కు తగ్గించింది. చెట్లను నరికి వంటచెరుకుగా ఉపయోగించటంతో ప్రకృతి, పర్యావరణం దెబ్బ తింటుంది. కట్టె, బొగ్గు, పిడకలతో వంట నిర్వహణ వల్ల వాతావరణం లో పెద్ద ఎత్తున కారన్‌డయాక్సైడ్, కార్బన్ మోనాక్సైడ్ మిళితమై పర్యావరణం కాలుష్యం అవుతున్న నేపథ్యం లో పర్యావరణాన్ని కాపాడాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ చెపుతున్నది.

ఈ నేపథ్యంలో గ్యాస్ కనెక్షన్స్ అందించాలనే ఉద్దేశంతో ఉజ్వల పథకం ప్రవేశపెట్టింది. ప్రస్తుతం ఇస్తున్న గ్యాస్ సబ్సిడీని తొలగించటంలో దారిద్ర్యంతో ఉన్న గ్రామీణ నిరుపేదలు తిరిగి వంట చెరుకువైపు పరిస్థితి వచ్చే ప్రమాదం ఉన్నది. సంక్షేమ ప్రభుత్వం అని చెప్పుకుంటున్న ఎన్‌డిఎ ప్రభుత్వం గ్యాస్‌పై సబ్సిడీని కొనసాగించాలి. ప్రజారోగ్యాన్ని కాపాడాలి.



ఆహార భద్రతా చట్టం క్రింద పేదలకు అందించే నిత్యావసర సరుకుల సరఫరాను ఒకటి తర్వాత ఒకటి నిలుపు చేస్తున్నారు. మే నెల నుండి చక్కెర సరఫరాను బంద్ చేయటం జరిగింది. గత ఏడాది పెట్రోల్‌పై ఇచ్చే రాయితీలు రూ.27,317కోట్ల నుండి రూ.25 వేల కోట్ల వరకు తగ్గించారు. తాజాగా ఎల్‌పిజి సిలెండర్లపై ఉన్న సబ్సిడీని ప్రతినెల రూ.4/–ల చొప్పున పెంచుతూ వచ్చే ఏడాది వరకు లేదా ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ సున్నా అయ్యేంతవరకు పెంచాలని ఏన్డీయే ప్రభుత్వం నిర్ణయించింది. ఇది పూర్తిగా అన్యాయం.

రెవెన్యూ రికార్డుల క్షాళన



రావుల రాజేశం,
98948811424

ఎన్నో దశాబ్దాలనుండి గ్రామ స్థాయిలో చిన్నాభిన్నమైన రెవెన్యూ రికార్డులను సరిదిద్ది, నిజమైన పట్టాదారులకు భూములు అందించటానికి ప్రభుత్వం నడుం బిగించటం హర్షణీయం. నిజాం కాలంలో ఉన్న సర్వే నెంబర్లు ఇప్పటికి ఉన్నాయి. 'మోఖా' మీద ఉన్నవారికి న్యాయం జరుగలేదు. గత 50 ఏళ్ళుగా పాలకులు రెవెన్యూ శాఖ మీద నిఘా పెట్టకుండా, గ్రామానికో విలేజ్ రెవెన్యూ ఆఫీసర్‌ని నియమించకుండా పాలనను భ్రష్టు పట్టించాయి. పట్టాదారుల పేర్లు రెవెన్యూ రికార్డుల నుంచి చాలా చోట్ల అవినీతి రెవెన్యూ అధికారులు మాయం చేశారు. భూమి ఎవరిది? పట్టా ఎవరి పేరిట ఉంది? కబ్జాదారు నిజంగా ఎవరో ఇప్పటిదాకా రెవెన్యూ యాంత్రాంగానికి తెలియదు.

తెలంగాణలోని 31జిల్లాలు, ఆంధ్రప్రదేశ్‌లోని 13జిల్లాల్లో రెవెన్యూ రికార్డులు తప్పుల తడకగా ఉన్నాయి. తమ పేర్లు తప్పు పడ్డాయని సవరించాలని రైతులు కాళ్లరిగేలా రెవెన్యూ కార్యాలయాల చుట్టు తిరిగిన సందర్భాలు అనేకం.

గ్రామస్థాయిలో విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్, విలేజ్ రెవెన్యూ ఆఫీసర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పోస్టుల్ని భర్తీ చేయకపోవటంవల్ల గ్రామస్థాయి రెవెన్యూ రికార్డులు 'ట్యాంపరింగ్'కు గురైనవి. తెలంగాణ సర్కారు ఇటీవల రైతు సమగ్ర సర్వే నిర్వహించింది. అన్ని ఆధారాలు వ్యవసాయ అధికారులు జిరాక్స్‌లతో సహా సేకరించారు.

రెవెన్యూ శాఖ ద్వారా పట్టాదారులు అయితేనే ఎకరానికి 4 వేలు ఇస్తామని తెలంగాణ సిఎం కెసిఆర్ ప్రకటించటంతో భూముల మీద రైతుల దృష్టి మరిలినది. రైతు సమగ్ర సర్వేలో రైతులు ఇచ్చిన 'డాటా' కరెక్టేనా? కాదా? అనే విషయమై తెలంగాణ సర్కారు సందిగ్ధంలో పడింది. ఒక్కో జిల్లాలో ప్రభుత్వ భూములు ఎన్ని? ప్రైవేటు భూములు ఎన్ని? సాగులో ఉన్న భూములు ఎన్ని? 'పడావు' ఉన్న భూములు ఎన్ని? దేవాదాయ శాఖ భూములు ఎన్ని? ఫారెస్టు డిపార్టుమెంట్ భూములు భద్రంగా ఉన్నాయా? అనే విషయాలను సమగ్రంగా తెలుసుకోవడానికి రెవెన్యూ రికార్డుల ప్రక్షాళనకు తెలంగాణ సర్కారు ఆదేశాలు ఇచ్చింది. ఆన్‌లైన్‌పత్రాల్లో స్పెల్లింగ్ మిస్టేక్స్ లేకుండా చర్యలు తీసుకోనున్నారు. సర్వే నెంబర్ల ఆధారంగా ఫీల్డ్‌లో ఇన్‌స్పెక్షన్ చేయాలని ఆదేశించారు. ఇంతకాలం ఐబి పొందటానికి రైతులు పడుతున్న కష్టాలకు చరమగీతం పాడాలని పాలకులు నిర్ణయించటం జరిగింది.

ఆగస్టు నెలలో నోటిఫికేషన్ ఇచ్చి 3 నెలల్లో రికార్డుల ప్రక్షాళన పూర్తి చేయనున్నారు. గతనెలలో వ్యవసాయ శాఖ అధికారులు రైతు సమగ్ర సర్వే కోసం ఊరూరూ తిరిగినపుడు రెవెన్యూశాఖ రికార్డులు తప్పుల తడకగా ఉన్న విషయం బయటపడింది. భూముల విస్తీర్ణం, పట్టాదారులు, కబ్జాదారుల మధ్య భారీ తేడాలు బయటపడ్డాయి. చనిపోయిన వారి పేరిట పట్టా ఉండరాదు. 'విరాసత్' కోసం మృతుని వారసులు అప్లికేషన్ పెట్టుకున్న తహసిల్దార్ కార్యాలయాల్లో 'విరాసత్' చేయటం లేదనే విషయం బయటపడింది. ఒకే సర్వేనెంబర్‌లో మూడు నుండి ఆరుగురికి పట్టాదారు పాసు పుస్తకాలు, సర్వేనెంబర్, కబ్జాదారులు, దరఖాస్తు దారుల వివరాలకు పొంతన లేదు. వచ్చే ఏడాది నుంచి నిజమైన రైతులకు పంటకు ఎకరాకు నాలుగు వేల చొప్పున బ్యాంక్ అక్కౌంట్‌లో జమచేయాలని, కెసిఆర్ సర్కారు నిర్ణయించటంతో గ్రామాల్లో గందరగోళం ఏర్పడింది.

రైతులు భూముల తప్పులను సరిచేయించుకోవాలని ఉవ్విళ్ళూరుతున్నారు. రైతు సర్వేలో పట్టాదారుల వివరాలు సేకరించారు. వాటిని కంప్యూటరైజ్ చేస్తున్నారు. రైతుల పహాణి, 1బి పత్రాలను రెవెన్యూ, అగ్రికల్చర్ అధికారులు సేకరిస్తున్నారు. తప్పుల తడకగా ఉన్న రెవెన్యూ రికార్డుల సవరించి నూతన పాసు పుస్తకాలను (పాస్ పోర్టుల మాదిరిగా) డిజిటల్‌గా అందించటానికి నిర్ణయించటం మంచిదే.

రైతులకు పూర్తి హక్కులు ఉండాలంటే పట్టాదారు పాస్ పుస్తకం, టైటిల్ డీడ్, 1బి పట్టాల్లోకి ఎక్కవల్సి ఉండగా, 50% భూములు ఎక్కటం లేదు. ప్రజావాణి, కార్యక్రమాల్లో రెవెన్యూ తప్పుల మీద అప్లికేషన్‌లు పెట్టి చేసేదిలేక తలపట్టుకుంటున్న రైతులు ఉన్నారు. భూములను రెండు రకాల జాబితాలతో సర్వే చేస్తారు. 11 అంశాలతో కూడిన ప్రశ్నావళి ఉంటుంది. ఇందులో మృతుల పేరిట విస్తీర్ణం ఎంత? బాధితుల స్వాధీనంలోనే భూములు ఉన్నాయా? అనే విషయాలు సేకరించనున్నారు. మృతుని వారసులు స్వాధీనంలో కబ్జాలో భూమి ఉంటే 'విరాసత్' ద్వారా పట్టా హక్కులు తక్షణమే కల్పించనున్నారు. రెండో జాబితాలో 20 అంశాలున్నాయి.

ఇందులో సర్వే నెంబర్ ఆధారంగా విస్తీర్ణం ఎంత? పట్టాదారు జీవించి ఉన్నాడా? సర్వే నెంబర్‌లో విస్తీర్ణం ప్రకారంగా పట్టాదారులు పాసుపుస్తకాలు కల్గి ఉన్నారా? అనే వివరాలు క్షేత్రస్థాయికి వెళ్ళి పక్కాగా నమోదు చేయాలి. ఒకే సర్వే నెంబర్‌లో ఎక్కువమందికి భూములు ఎక్కువ, తక్కువ అనే విషయాలను తేల్చనున్నారు. క్షేత్రస్థాయికి వెళ్లి నిజమైన పట్టాదారు లకు పహాణీ, 1బిలను సవరించి జారీ చేయటం జరుగనున్నది. రైతు ఆధార్ నెంబర్ క్లిక్ చేస్తే, సదరురైతుకు సంబంధించిన సమగ్ర సమాచారం లభించేలా కొత్త 'సాఫ్ట్‌వేర్'ను రూపొందించారు. నేలల స్వభావం, పంటలు పండే అవకాశం ఏమిటి? ప్రభుత్వం నుండి ఎన్ని పథకాలు పొందారు? ఎన్ని పథకాల ద్వారా సబ్సిడీ పొందారు? అనే వివరాలు సేకరిస్తున్నారు.

ప్రతి గ్రామానికి ఒక విఆర్ఓ పోస్టు ఉంటే మంచిది. రాష్ట్రంలో 8 వేల గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ప్రస్తుతం మూడువేల విలేజ్ రెవిన్యూ అధికారుల పోస్టులు ఖాళీగా ఎన్నో ఏళ్లనుంచి ఉన్నాయి. ప్రతి విఆర్ఓ కు 4 గ్రామాల పాలన బాధ్యతలు ఇస్తే ఏం లాభం. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, హరితహారంతోపాటు రెవెన్యూ రికార్డుల 'ప్యూరిఫికేషన్'లో విఆర్ఓల పాత్ర కీలకమైనది. రెవెన్యూ సర్వేయర్లు, విఆర్ఒ, తహసిల్దార్లు, కార్యాలయ సిబ్బంది వంటి ఖాళీలను సర్కారు భర్తీ చేస్తే రెవెన్యూ పాలన గాడిన పడే అవకాశం ఉంది.

క్షేత్ర సర్వే చేసిన తర్వాత పక్కాగా ఆన్‌లైన్‌లో రికార్డులను 'ఎంటర్' చేయించాలి. రెవెన్యూ గ్రామాలను పునర్ విభజన చేయాలి. మండలాల విస్తీర్ణం బట్టి, పోస్టులు మంజూరు చేయాలి. 50ఏళ్ల భూ, రెవెన్యూ కష్టాలు, క్షేత్రస్థాయి సర్వేతో తీరితే రైతులకు హర్షదాయకం.

మన తెలంగాణ
5
హైదరాబాద్
శుక్రవారం
4, ఆగస్టు, 2017
www.manatelangana.news



వాయనాలలో పోషక విలువలు



వాయనం మాటకు మూల పదం ఉపాయనం. అంటే కానుక. కానుక తీసుకున్నవారు మనకు దగ్గరవుతారనే భావం. ఉపాయనం అనేది సౌహార్ధాన్ని పెంచుతుంది. ఎవరు వ్రతం చేయించారో ఆ బ్రాహ్మణులకు, పెద్దలకు కానుకలు ఇవ్వడం సంప్రదాయం. దాని తర్వాత ముత్తైదువులను పిలిచి వాయనం ఇవ్వాలి. ఆ తరువాత వచ్చిన బంధువులకు, మిత్రులకు ఇవ్వాలి. అందరికీ శక్తి ఉంటే భోజనం పెట్టాలి. లేకుంటే కొందరికైనా పెట్టాలి. భోజనం, తాంబూలం, వస్త్రములు, కానుకలు, వాయనములు ఇవన్నీ మన హృదయాన్ని చెబుతాయి. ఇవన్నీ శక్తిని బట్టి చేసుకోవాలి. అమ్మవారు భక్తికి సంతోషిస్తుంది కానీ ఆడంబరాలకు కాదనేది గుర్తుపెట్టుకోవాలి. గృహిణి అనగానే ఇంట్లో ఆమె పిల్లలు ఉంటారు కనుక వారి కోసం అరటిపండు. ఆవిడ నిత్యం సుఖంగా ఉండాలని కుంకుమ. దీంతోపాటు పువ్వులు. ఈ ద్రవ్యాలను ముత్తైయిదువుకు వాయనంగా ఇవ్వడం సరైన విధానం.

నానబెట్టిన శనగలు:



వందగ్రాముల శనగల్లో 115 క్యాలరీల శక్తి, 7.2 గ్రాముల ప్రొటీన్లు, 16.1 గ్రాముల కార్బొహైడ్రేట్లు, 2.9 గ్రా. కొవ్వు పదార్థాలు, ఫైబర్ లు పుష్కలంగా ఉంటాయి. ఫైబర్ వల్ల రక్తంలో హానికరమైన కొవ్వు తగ్గుతుంది. అధిక మోతాదులో ప్రొటీన్లు లభిస్తాయి. వ్యాధినిరోధక శక్తిని పెంచుతాయి. రక్తప్రసరణకు తోడ్పడుతాయి. వీటిలోని ప్రత్యేక పదార్థాలు నిద్ర రావడానికి తోడ్పడతాయి. ఆరోగ్యవంతమైన వ్యక్తి ప్రతి రోజూ మొలకెత్తిన శనగలు తీసుకోవాలి.

తాంబూలం:

ఆకు వక్క సున్నం కలిపితే తాంబూలం.. ఇవి దేనికదే విడివిడిగా తింటే అనార్యోగం. మూడూ కలిపి వేసుకుంటే జీర్ణశక్తి సక్రమంగా ఉంటుంది. నాలుకకు సంబంధించి వ్యాధులను రాకుండా చేసేది తాంబూలం. ఆకు వక్క సున్నం మూడు కలిపి వేసుకుంటే నాలుకకు సంబంధించిన వ్యాధులను దూరం చేసినట్లే. నాలుకకు ఉండే వ్యాధిని తొలగించే శక్తి తాంబూలానికి ఉంది. స్త్రీ ఆరోగ్యం మీద కుటుంబం ఆధారపడి ఉంటుంది. ఆవిడ ఆరోగ్యం కోసం తాంబూలం.


అరటిపండు: జీర్ణసంబంధమైన వ్యాధులకు అరటిపండు దివౌషధం. జబ్బు పడిన వాళ్లు ఈ పండు తింటే త్వరగా కోలుకుంటారు. దీంట్లో అధ్యధికంగా ఉండే పొటాషియం రక్తపోటును, అధిక ఒత్తిడిని తగ్గిస్తుంది. శరీరంలో విషపదార్థాలను తొలగిస్తుంది. చిన్నపాటి కాలిన గాయాలను తగ్గించే గుణం ఈ పండుకు ఉంది. తాహతును బట్టి యాపిల్, బత్తాయిలాంటివి కూడా వాయనంగా ఇస్తుంటారు. పండ్లు తినడం అనేది ఏ కాలంలోనైనా మంచిది. అందుకే పండు ఇవ్వడం ఆనవాయితి.



పసుపు:

వర్షాకాలంలో జలుబు, దగ్గులాంటి రోగాలు తొందరగా వస్తుంటాయి. అందుకనే కాళ్లకు పసుపు రాసుకుంటారు. పసుపు యాంటిబయాటిక్. సూక్ష్మ క్రిములను నాశనం చేస్తుంది. చాలా రోగాలను పసుపు అడ్డుకుంటుంది. వర్షాకాలంలో కాళ్లపగుళ్లు వస్తుంటాయి. వీటిని పోగొడుతుంది పసుపు.

లక్ష్మి అంటే డబ్బు ఒక్కటేనా..?



నేడు వరలక్ష్మీ వ్రతం

లక్ష్మి అంటే లక్ష్మింపబడేది అని అర్థం. జనం ఎవరినైతే బాగా పట్టిపట్టి పరకాయించి చూస్తారో ఆమే లక్ష్మి. ఆమె సంపదకు రారాణి అంటోంది పురాణం. కనుక లోకమంతా సహజంగా ఆమె వైపే చూస్తోంది. డబ్బుకున్న ఆకర్షణే అది కదా! లక్ష్మి అంటే డబ్బు. డబ్బు అంటే లక్ష్మి అన్నట్టుగా చూస్తుంటారు మనవాళ్ళు.

లక్ష్మి అంటే డబ్బేనా? డబ్బే సర్వస్వమా?..కాదు..! ధన, కనక, వస్తు, వాహన, పుత్ర, పౌత్రాభివృద్ధి లక్ష్మి కటాక్షం వల్ల అమరుతాయని చెబుతుంటారు. కనుక చేతిలో ఆడే డబ్బొక్కటేకాదు ఒంటి మీద మెరిసే బంగారం కూడా లక్ష్మి స్వరూపమే! దేనికీ తడుముకోనక్కర్లేకుండా అవసరానికి, అందానికి, సదుపాయానికి, సౌలభ్యానికి ఉపయోగపడే వస్తువులు కూడా లక్ష్మి స్వరూపమే! ఇలా పరిపూర్ణంగా ఉంటే అది భాగ్యవంతమైన జీవితంగా కదా పరిగణిస్తారు. ఇవికాక విలాసవంతమైన వస్తువులు సమకూరితే అది భోగవంతమైన జీవితం అంటారు. భోగాన్ని అనుభవించే యోగ్యత ఉంటే దాన్ని భాగ్యం అంటారు. అందుకే భోగ భాగ్యాలు కవలపిల్లల్లా కనబడతాయి. సాధారణంగా భోగం ఉన్న వాడికి భాగ్యం ఉండదు. భాగ్యం ఉన్న వాడికి భోగం ఉండదు. ఈరెండూ ఉన్న వారికి వారసత్వం ఉండదు. ఇవన్నీ అమరిన వారికి అదృష్టానికేకొదవా ఉండదు. డబ్బు ఒక్కటే కాదు లోకంలో అనేక రకాల సంపదలున్నాయి. అవన్నీ సమకూరితేనే బతుకు పరిపూర్ణమవుతుంది. అందుకే మనకు పురాణాలలో రకరకాల లక్ష్ములు కనబడతారు. అందులో సుప్రసిద్ధమైన వారు అష్టలక్ష్ములు. ఆదిలక్ష్మి, ధాన్యలక్ష్మి, ధైర్యలక్ష్మి, గజలక్ష్మి, సంతానలక్ష్మి, విజయలక్ష్మి, విద్యాలక్ష్మి, ధనలక్ష్మి.

వీరి కన్నా పురాతనంగా ఆరాధనలో ఉన్న వారు సిద్ధలక్ష్మి, మోక్షలక్ష్మి, జయలక్ష్మి, సరస్వతి, శ్రీలక్ష్మి, వరలక్ష్మి. వీళ్ళంతా విడివిడి దేవతలు కారు. అంతా కలిపి ఒకే లక్ష్మి. ఆమెనే మహాలక్ష్మి అన్నారు. ఇటు అష్టలక్ష్ములలోకాని, అంతకు ముందు నుంచి పూజలందుకుంటున్న వారినిగానీ చూసినపుడు మొట్టమొదటి స్థానంగా ధనం కనిపించదు.

అష్టలక్ష్ములు-సామాజిక కోణం :

అష్టలక్ష్మలలో మొదట కనిపించేది ఆదిలక్ష్మి. అంటే వస్తుతః మనలో ఉండే జీవకళ. ఈ కళను పెంచిపోషించేది పౌష్టికాహారం. అందుకే ధాన్యలక్ష్మి రెండో స్థానంలో నిలిచింది. తిండి ఉండేవాడికెటూ కండ ఉంటుంది. తిండి కలిగితె కండగలదోయ్ కండగలవాడేను మనిషోయ్ అన్నారుగా పెద్దలు. కండా గుండె ఉండేవాడికి ధైర్యం చాలా సహజంగానే అలవడుతుంది. అలాంటి వాడే మనిషి కనుక ధైర్యలక్ష్మి మూడోవరసలో నిలబెట్టారు. ధైర్య స్థైర్యాలతో ముందుకు దూసుకుపోయే డైనమిక్ యంగ్ మాన్‌కు సకల సంపదలు ఎలాగూ వశమవుతాయి. కనుక నాలుగో స్థానంలో గజలక్ష్మి నిలిచింది. అణిమాది అష్టసిద్ధులకు, అష్టైశ్వర్యాలకు గజలక్ష్మి సంకేతం. సంపద ఎంత ఉన్న సంతానం లేకపోతే ఆ లోటు ఏం చేసినా తీరేదికాదు. కనుక సంతానం కూడా ఉండాలని అయిదో స్థానంలో సంతాన లక్ష్మి ని నిలిపారు. చక్కని సంపద, సత్సంతానం ఉన్న వాడిదే విజయవంతమైన జీవితమంటే! అందుకే ఆరవ స్థానంలో విజయలక్ష్మి ని నిలబెట్టారు. ఇక్కడితో సామాన్యుడి జీవితం కావడానికి కావాల్సిన సకల సంబరాలు పూర్తవుతాయి. ఇక ముందు చెప్పబోయేవి టాపప్స్ మాత్రమే! అందులో మొదటిది చదువు. చదువుకుంటే, చదువు బాగా అబ్బితే సంతోషమేకాని అది లేకపోతే జీవితమేలేదని కాదు. చదువులో బాగా రాణిస్తే సంతోషం. అలాకాకపోయినంత మాత్రాన డిప్రెస్ అయిపోయి నిద్రమాత్రలు తినేసి, ఉరితాడికి వేలాడబడి, బిల్డింగ్ మీది నుంచి దూకేసి ప్రాణాలు తీసుకోనక్కర్లేదు. చివరాఖరుగా కనిపించే 8వ లక్ష్మి ధనలక్ష్మి. అదీ డబ్బుకున్న విలువ. డబ్బు ఉంటే సంతోషమే కానీ అది ఎక్కితొక్కి లేనందుకు బాధపడక్కర్లేదు. డబ్బుతో చేయలేని అనేక పనులున్నాయి. అవి చేసుకుని కూడా జీవితాన్ని చరితార్థం చేసుకోవచ్చు.

ఇతర లక్ష్ములు-ఇంగిత జ్ఞానం :

పురాతన కాలం నుంచి కనిపించే లక్ష్ములు సిద్ధలక్ష్మి, మోక్షలక్ష్మి, జయలక్ష్మి, సరస్వతి, శ్రీలక్ష్మి, వరలక్ష్మి. వీరిలో మొట్టమొదటిది సిద్ధలక్ష్మి. ఏ పనైనా ఎప్పుడు సిద్ధిస్తుంది? పనిచేసినపుడు. అసలు పనిచేయకపోతే సిద్ధి ఉండదు కదా! కనుక చేతులెత్తేసి ఊరికనే కూచోకుండా చాతనైన పని ఏదో ఒకటి చేస్తూ ఫలితాన్ని సిద్ధింపజేసుకొమ్మని చెప్పడానికే సిద్ధలక్ష్మి కి పెద్దవాళ్ళు అగ్రతాంబూలమిచ్చారు. భగవద్గీతలో కృష్ణుడు చెప్పిన మాట కూడా ఇదే! ఆ తర్వాతది మోక్షలక్ష్మి. మోక్షం అంటే ఒక్కరిగా ఉండడం. ఇప్పటి భాషలో చెప్పాలంటే నెంబర్ వన్‌గా మిగలడం. పనిచేయడం అంటూ మొదలుపెడితే ఏదో ఒక నాటికి నెంబర్ వన్ పొజిషన్‌కు వస్తాడు కదా అదే మోక్షలక్ష్మి స్థానం. దీన్ని సుస్థిరం చేసుకుని ముందుకు దూసుకుపోయేవాడే ఎదురులేని విజయుడిగా గుర్తింపు పొందుతాడు. ఈ స్థితినే విజయలక్ష్మి స్థానం అన్నారు.ఇలా ఉన్నత స్థానానికి వెళ్లడానికి చదువుతో సంబంధం లేదు. కృషి ఒక్కటి చాలు. జీవితంలో ఉన్నత స్థానానికి చేరిన వారంతా పెద్దపెద్ద చదువులు చదువుకున్న వారేంకారు. చదువు ఉంటే పువ్వుకు తావి అబ్బినట్టుంటుంది. అందుకే చదువు, సంస్కారం, సంపద తోడైతే వచ్చే స్థితిని సరస్వతి అంటారు. చదువు, సంపదలు గలిగి ముందుకుపోయేవాడే సంపదను నిలబెట్టుకోగలుగుతాడు. దాన్ని సద్వినియోగం చేయగలుగుతాడు. తద్వారా సామాజిక గుర్తింపు కలిగి గౌరవం పెరుగుతుంది.

డబ్బున్న ప్రతీ ఒక్కడికీ పేరు రాదు. ఆ సంపద మానవ సేవకు ఉపయోగపడేలా చేస్తేనే గౌరవస్థానం ఏర్పడుతుంది. ఈ స్థితే శ్రీలక్ష్మి స్థానం. ఇలాంటివాణ్ణే శ్రీమంతుడు, స్థితిపరుడు అంటారు. ఇలాంటి వాణ్ణే వరప్రసాది అంటారు. అలాంటి స్థితినే వరలక్ష్మి స్థానం అంటారు. జీవితంలో ఎవరైనా ఇలాంటి స్థితిని చేరుకోడానికి, సర్వదా కొనసాగించడానికి లక్ష్మి ని ఆశ్రయించాలి. ఈ సందేశాన్నే వరలక్ష్మి వ్రతం మనకు అందిస్తోంది.

వరలక్ష్మీ వ్రతం సందేహాలు- సమాధానాలు



1. వరలక్ష్మి వ్రతం శ్రావణమాసంలోనే ఎందుకు చేస్తారు?

జ : శ్రావణమాసం విష్ణుమూర్తికి సంబంధించిన మాసంగా ప్రశస్తి. ఈ మాసంలోనే ఆయన జన్మించాడని పురాణాలు చెబుతున్నాయి. విష్ణువెక్కడుంటే శ్రీమహాలక్ష్మి కూడా అక్కడే కనుక ఆమెకు కూడా ఈ మాసమే ఇష్టమైంది. ఉభయులూ తీరికగా దొరికే మాసం కనుక ఈ మాసం విష్ణుభక్తులకు ఎంతో ఇష్టమైంది. లక్ష్మీనారాయణులిరువురినీ శ్రద్ధాభక్తులతో ఆరాధిస్తారు.

2. వ్రతం ఏ సమయంలో ప్రారంభిస్తే మంచిది.

జ : వర్జ్యం ఉ. 6.33 నుండి 8.16 ని. వరకు ఉంది. వర్జ్య సమయం మంచిదికాదు కనుక అది దాటిపోయింతర్వాత మొదలుపెట్టుకోవడం మంచిది. సాధారణంగా అపహార్ణవేళ అంటే 12 గంటలు దాటిన తర్వాత మొదలుపెట్టుకుంటే మంచిది. అలా కుదరకపోతే సాయంత్రం చేసుకుని పేరంటం పిలుచుకుంటే రెండూ ఒక్కసారిగా జరిగిపోతాయి.

3. ఏం మంత్రాలు చదువుకోవాలి?

జ : రోజూ చదువుకునే లక్ష్మి స్తోత్రంతోబాటు అష్టోత్తరం కాని సహస్రనామం కాని అనుసంధానిస్తే మంచిది.

4. వరలక్ష్మి వ్రతం రోజు ఉపవాసం ఉండాలంటారు నిజమేనా?

జ : ఉండగలిగితే మంచిది. పూర్తి ఉపవాసం చేయదలచుకున్నవారు వ్రతాన్ని సాయంత్రానికి మార్చుకోండి. అలా కుదరనివారు. మధ్యాహ్నానికే పెట్టుకోండి. వ్రతం ముగిసే వరకు ఎలాగూ ఏమీ తీసుకోరు కనుక ఆ మేర ఉపవాసం చేసినట్టే అవుతుంది.

5. అమ్మవారి పూజలో కలశం ఎందుకు పెడతారు?

జ : కలశం అమ్మవారికి ప్రతిరూపం. కలశ పాత్రగా మట్టి పాత్రనుగాని, వెండి, బంగారు, రాగి, పంచలోహపాత్రలను గాని వినియోగిస్తారు. లోహమైనా మట్టి అయినా అది పృథ్వీతత్త్వానికి సంకేతం. అందులో పోసే నీరు జలతత్త్వానికి సంకేతం. అందులో కలశాన్ని పూర్తిగా నీరుతో నింపం కనుక శూన్యస్థితి ఆకాశతత్త్వానికి సంకేతం. మనం చదివే మంత్రం వాయుజనితం. కనుక అది వాయుతత్త్వానికి సంకేతం. దాని ముందు ఉంచే దీపం అగ్నితత్త్వానికి సంకేతం. ఇలా పంచభూతాలను ఒకచోటికి చేర్చి పూజిస్తాం. అమ్మవారు పంచభూతమయి కనుక కలశ స్థాపనతో ఆరాధించడం ఆనవాయితీ! శ్రావణమాసం వెళ్ళేవరకు ఆరాధన కొనసాగించాలి.

6. కలశం ఎలా తయారుచేసుకోవాలి?

జ : కలశం కోసం తెచ్చుకున్న పాత్రను శుభ్రంగా కడగాలి. తర్వాత దానికి పసుపు, కుంకుమలతో అలంకరించాలి. బియ్యంపోసి వేదికను సిద్ధం చేయాలి. వేదికను పూలు, చందనం, పరిమళ ద్రవ్యాలు జల్లి శోభాయమానంగా చేసుకోవాలి. ఆ తర్వాత కలశాన్ని దానిపై అమర్చాలి. దానికి తాంబూలం సమర్పించి ఆరాధించాలి. కలశంలో నీరుపోసి మామిడాకులు కానీ, తమలపాకులు కాని అందులో వేయాలి. ఆకులు ఏవైనా అవి నిటారుగా నిలిచేటట్టు చూసుకోవాలి. దాని మీద కొబ్బరికాయ నుంచి దానికి రవికెల గుడ్డను వస్త్రంగా చుట్టాలి. కొబ్బరికి ముఖస్వరూపం వచ్చేలా కళ్ళు ముక్కు, పెదవులు, కనుబొమలు అమరేలా దిద్దవచ్చు లేదా అమ్మవారి రూపును దానికి తగిలించి ఆకారం ఏర్పరచవచ్చు. దానికి తమకు తోచిన నగలు వగైరాలు అలంకరించవచ్చు.

7. అమ్మవారికి ఎన్ని రకాల ప్రసాదాలు నివేదించాలి?

జ : 1/3/5/9. సాధారణంగా అమ్మవారికి అప్పాలు, వడలు, చక్కరపొంగలి, పులిహోర, దద్ధోజనం, శుండలు, పాయసం, కేసరి, లడ్డు ప్రసాదంగా నివేదిస్తారు.

8. అమ్మవారి దీక్షా తోరణం ఎలా తయారుచేసుకోవాలి?

జ : సాధారణ దారాన్ని 5 పొరలుగా తీసుకుని దానికి పసుపురాయాలి. దానికి మధ్యలో మామిడి ఆకునుకాని, తమలపాకును కాని పెట్టి ముడివేయాలి. దీన్ని అమ్మవారి సమక్షంలో ఉంచి పూజించాక చేతికి మణికట్టు దగ్గర ధరించాలి. దీన్ని మొదటి శుక్రవారం కట్టుకుంటే నెలంతా ఉంచుకుని అమ్మవారి పూజ నెలరోజులూ జరుపుకోవాలి లేదా వరలక్ష్మి వ్రతం నాడు కట్టుకుని కలశానికి ఉద్వాసన పలికిన తర్వాత తీసేయొచ్చు. భర్తకు భార్య, భార్యకు భర్త ఈ తోరణాన్ని కట్టాలి. పిల్లలకు తండ్రే కట్టవచ్చు.

9. పూజలో ఏయే పువ్వులు వినియోగించాలి?

జ: అమ్మవారికి పూజలో తామర,మొగలి పువ్వులు వినియోగించాలి. దూర్వాయుగ్మం (గరిక) కూడా వాడతారు.

10. తాంబూలంలో ఏమేమి ఉంచాలి?

జ : తమలపాకులు, పచ్చివక్కలు లేదా ఎండు వక్కలు, ఖర్జూరం, కుంకుమ, పసుపు, చందనం, చిన్న అద్దం, దువ్వెన, కాటుక, అందుబాటులో ఉండే ఏదో ఒక పండు, నానబెట్టిన శెనగలు, వీలైతే జాకెట్‌గుడ్డ వాయనంగా సమకూర్చి పేరంటానికి వచ్చినవారికి బహూకరించాలి.

11. వ్రతంలో చక్కరపొంగలి నైవేద్యంగా పెట్టాలా? పాయసం పెట్టాలా? పాయసమైతే బియ్యం పాయసం పెట్టాలా? సేమ్యా పాయసమైనా ఫర్వా-లేదా?

జ : అమ్మవారికి పూజలో ప్రసాదంగా చక్కరపొంగలికానీ పాయసం కాని నివేదిస్తారు. పాయసం దేనితో తయారుచేసినా దోషం కాదు.

12. పూజ కోసం తయారుచేసిన హరిద్రా రూపాన్ని ఏం చేయాలి?

జ : పసుపుతో చేసే రూపాన్ని హరిద్రా లక్ష్మి అంటారు. అది ఎటూ పసుపే కనుక ముఖానికి రాసుకోవడం ఉత్తమం. ముత్యమంతా పసుపు ముఖమంత ఛాయ. ముఖవర్చస్సులో లక్ష్మి కళ ఉంటుంది.

13. పూజలో వినియోగించిన బియ్యాన్ని ఏం చేయాలి?

జ : మర్నాడు అన్నం వండి దేవతా మందిరంలో ఇలవేలుపుకు ప్రసాదంగా సమర్పించి స్వీకరించాలి.

14. పూజ తర్వాత కొబ్బరికాయను ఏంచేయాలి?

జ : మనం రోజూ పూజించే దేవుడికి నివేదన చేసి కొట్టి ప్రసాదంగా చేసుకుని అందరూ తీసుకోవాలి.

15. కలశంలోని నీటినేం చేయాలి?

జ : కలశంలో ఉన్న నీరు పరమపవిత్రమైనవి కనుక అందరూ తలా కాసిని తలపై చల్లుకోవాలి. మిగిలిన నీటిని ఇంటావిడ, ఆడపిల్లలు స్నానంచేసేటప్పుడు నీటిలో కలిపేసుకుని స్నానం చేయాలి.

16. కలశంగాపెట్టిన కొబ్బరికాయ కొట్టినపుడు పాడైపోయి ఉంటే ఏం చేయాలి?

జ : అలా జరిగిందేమని మనసు పాడుచేసుకోకండి. మీరు పూజించింది కలశానికే కాని దాని మీద నిలబెట్టిన కొబ్బరికాయకు కాదు. అది లోపల బాగున్నా చెడిపోయినా బాధపడనక్కర్లేదు.

17. కలశం లేకుండా కూడా వ్రతం చేసుకోవచ్చా?

జ : వ్రతం అంటే ఒక దేవుణ్ణో దేవతనో ఆహ్వానించి కొంతకాలంపాటు ఆరాధించే పద్ధతి. ఇది కొనసాగింపు పూజా విధానం కనుక అది పూర్తయ్యేవరకు ఆరంభంలో ఉంచిన కలశం కూడా ఉంటుంది. ఈ కలశం వ్రతకాలం మొత్తానికి గుర్తుగా ఉంటుంది. అందుకని కలశం తప్పనిసరి. కలశం లేకుండా అయితే లక్ష్మీ పూజ చేసుకుంటే సరిపోతుంది. నెలమొత్తంగా విధివిధానంగా పూజ చేయడానికి కుదరనివారు కలశరహితంగా చేసుకోవడం ఉత్తమం. అందువల్ల ఎప్పుడైనా అవాంతరం వచ్చినా మనసు నొచ్చుకోకుండా ఉంటుంది.

18. మా ఇంట్లో నాలుగు నెలల గర్భిణి ఉంది. మేం వ్రతం చేసుకోవచ్చా?

జ : నిరభ్యంతరంగా చేసుకోవచ్చు. కాకపోతే గర్భిణులు ఎక్కువ సేపు కూచోలేరు కనుక వేగంగా వ్రతవిధి పూర్తిచేస్తే తీర్థ ప్రసాదాలు తీసుకుని విశ్రాంతి తీసుకోగలుగుతారు.

19. ఇంట్లో ఎవరికౌనా నెలసరి ఉంటే వ్రతం చేసుకోవచ్చా?

జ : నెలసరి ఉన్న వారికి ఇబ్బందులు ఉంటాయి కనుక వారు మరుసటి శుక్రవారం చేసుకుంటే మంచిది. నెలసరి ఉంది కనుక చేయకూడదు అని ఎక్కడా లేదు.

20. ఈ శుక్రవారం వ్రతం చేసుకోడానికి కుదరకపోతే ఏం చేయాలి?

జ :ఈ వారం కుదరకపోతే శ్రావణమంతా అమ్మవారికి విశేషమైనదే కనుక ఏ శుక్రవారమైనా వ్రతం చేసుకోవచ్చు. అలా కూడా కుదరనివారు దసరా నవరాత్రులలో అమ్మవారు లక్ష్మి అవతారంలో ఉన్నప్పుడు ఈ పూజ చేసుకోవచ్చు.

గ్రహ రక్షకుడు కావలెను : నాసా

వాషింగ్టన్ : అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ (నాసా) తాజాగా గ్రహరక్షణాధికారి కావలెను అని ఓ ఉద్యోగ ప్రకటనను వెలువరించింది. తాజాగా తీసుకోబోయే ఈ ప్లానెటరీ ప్రొటెక్షన్ ఆఫీసర్‌కు తగు అర్హతలు ఉంటే, గ్రహాల రక్షణలో తగు గత అనుభవం ఉంటే ఆరు అంకెల ఆకర్షణీయ జీతం కూడా ఉంటుందని ప్రకటించారు. అయితే భూగోళ పరిరక్షణనే ఈ అధికారి కీలక బాధ్యతగా ఉంటుంది. గ్రహాంతరవాసుల నుంచి దాడులు జరగకుండా చూసుకోవడం ఈ అధికారి కీలక బాధ్యతగా ఉంటుంది. ఇక ఇదే సమయంలో భూమి నుంచి వివిధ గ్రహాలకు వెళ్లే మనుష్యులు పరిశోధనలు ఇతరత్రా చర్యలతో ఆ గ్రహాలను దెబ్బతీయకుండా చేసే కీలక పాత్రను కూడా ఈ అధికారి నిర్వర్తించాల్సి ఉంటుంది. మూడేళ్లపాటు ఈ బాధ్యతలలో ఉండే ఈ అధికారి పనితీరును బట్టి పొడిగింపునకు కూడా వీలుంటుంది. ఇక ఫిజికల్ సైన్స్, ఇంజినీరింగ్, గణితం వంటి వాటిలో డిగ్రీ పొందిన వారు కనీసం ఏడాది పాటు ఉన్నతస్థాయిలో ప్రభుత్వ విభాగాలలో అధికారిగా ఉన్నవారు , ఖచ్చితంగా ఖగోళ రక్షణలో అధునాతన విజ్ఞానవంతులుగా ఉన్న వారు ఈ పదవికి అర్హులుగా ఉంటారు. ఇక ఎంపికైన అభ్యర్థులకు ఇచ్చే వేతనం ఏడాదికి 1,87,000 డాలర్లుగా ఉంటుంది. ఇతరత్రా భత్యాలు కూడా ఉంటాయని యాడ్‌లో తెలిపారు. ఇదే క్రమంలో వ్యోమగాములు కూడా పలు రకాల పదార్థాల ప్రభావానికి గురి అవుతున్నారు.



డిగ్రీలో క్రెడిట్లా? పేపర్లా?

● ఏ విధానంలో డిటెన్షన్ అమలు..?

● కొనసాగుతున్న కసరత్తు

మన తెలంగాణ/హైదరాబాద్ : డిగ్రీలో డిటెన్షన్ విధానం అమలు చేయాలని ఉన్నత విద్యామండలి నిర్ణయించింది. అయితే క్రెడిట్ల విధానంలో డిటెన్షన్ అమలు చేయాలా..? లేక పేపర్ల విధానంలో డిటెన్షన్ అమలు చేయాలా..? అనే విషయంపై తర్జనభర్జన జరుగుతోంది. రాష్ట్రంలోని అన్ని యూనివర్శిటీల పరిధిలో గత ఏడాది నుంచి డిగ్రీలో ఛాయిస్ బేస్డ్ క్రెడిట్ సిస్టం(సిబిసిఎస్) అమలు చేస్తున్నారు. గత ఏడాది డిగ్రీ ప్రథమ సంవత్సరంలో ప్రవేశం పొందిన విద్యార్థులు ఫస్ట్, సెకండ్ సెమిష్టర్లు పూర్తయ్యాయి. అయితే రెండు సెమిష్టర్లు క్రెడిట్లు కాకుండా పేపర్ల విధానమే కొనసాగింది. ప్రథమ సంవత్సరానికి సంబంధించిన రెండు సెమిష్టర్లలోని మొత్తం పేపర్లలో 50 శాతం పేపర్లు ఉత్తీర్ణులైన విద్యార్థులనే ద్వితీయ సంవత్సరానికి ప్రమోట్ చేయాలని నిర్ణయం తీసుకున్నారు. అయితే సిబిసిఎస్ విధానంలో క్రెడిట్ల ఆధారంగా డిటెన్షన్ విధానం అమలు చేయాల్సి ఉంటుంది. ఇప్పటికిప్పుడు క్రెడిట్ల విధానం అమలు చేస్తే కొంత ఇబ్బంది తలెత్తే అవకాశం ఉంటుందని, వీరు డిగ్రీ ఫైనల్ ఇయర్ పూర్తి చేసుకుని పట్టా తీసుకునే సమయంలో పేపర్లనే క్రెడిట్లుగా మార్చి సర్టిఫికెట్లు అందజేయాలని ఉన్నత విద్యామండలి ఆలోచిస్తున్నట్లు తెలిసింది. ప్రస్తుతం డిగ్రీ ప్రథమ సంవత్సరం పూర్తి చేసుకున్న అభ్యర్థులు డిగ్రీ పూర్తయిన తర్వాత పిజి ప్రవేశ పరీక్షలో ఉండే అర్హతలపై కూడా చర్చిస్తున్నారు. క్రెడిట్ల విధానంలో లాంగ్వేజ్ సబ్జెక్టులకు తక్కువ క్రెడిట్లు ఉంటాయి. ఈ నేపథ్యంలో ఈ సబ్జెక్టులు ఎంచుకునే విద్యార్థులకు తక్కువ క్రెడిట్లు వచ్చే అవకాశం ఉంటుంది. కాబట్టి స్థానిక అవసరాలను దృష్టిలో ఉంచుకుని లాంగ్వేజ్ సబ్జెక్టులకు కూడా మిగతా సబ్జెక్టుల తరహాలోనే క్రెడిట్లు కేటాయించాలని భావిస్తున్నట్లు సమాచారం.



క్రెడిట్స్‌తో కీలకమార్పు : సిబిసిఎస్ విధానంతో అకడమిక్స్‌లో కీలకమార్పు రానుంది. ఇప్పటివరకు ఏదైనా కోర్సును ఎంచుకుంటే, సంబంధిత కోర్సులోని ఒక్కో సబ్జెక్టుకు గరిష్టంగా కేటాయించిన మార్కులకు విద్యార్థులు పొందిన మార్కులు గణనలోకి వచ్చేవి. క్రెడిట్స్ విధానంలో ఒక గ్రూప్‌లోని ప్రతి సబ్జెక్ట్‌కు దాని పరిధి, ప్రాధాన్యత ఆధారంగా సెమిష్టర్ వ్యవధిలో టీచింగ్ లెర్నింగ్ అంశాలను పరిగణిస్తూ గరిష్టంగా క్రెడిట్స్ కేటాయిస్తారు. ఇది ప్రతి సబ్జెక్ట్‌కు మారుతుంది.

పాత విధానానికి స్వస్తి : డిగ్రీలో డిటెన్షన్ విధానం అమలుకు నిర్ణయం తీసుకోవడంతో కొత్త విధానం అమలులోకి రానుంది. ఇప్పటివరకు కొనసాగిన విధానానికి స్వస్తి పలికారు. గతంలో డిగ్రీలో ఏ కోర్సులోనైనా విద్యార్థులు సంవత్సరంలో ఎన్ని సబ్జెక్టులు ఫెయిలైనా తర్వాతి ఏడాదికి అర్హత సాధించేవారు. దీంతో కొందరు విద్యార్థులు కళాశాలలకు సరిగ్గా వెళ్లకుండా, పరీక్షల సమయంలోనే చదివేవారు. మరికొందరు విద్యార్థులు అసలు కళాశాలలకే రాకుండా ఫీజులు చెల్లించి, పరీక్షలు రాసినా అన్ని సబ్జెక్టుల్లో ఉత్తీర్ణత సాధించలేకపోయేవారు. దీంతో యూనివర్శిటీలలో డిగ్రీలో 30 నుంచి 40 శాతం వరకు మాత్రమే ఉత్తీర్ణత నమోదయ్యేది.అయితే డిటెన్షన్ విధానంలో ప్రతి ఏడాది మొత్తం పేపర్లలో కచ్చితంగా 50 శాతం పేపర్లలో ఉత్తీర్ణత సాధిస్తేనే తర్వాతి ఏడాదికి ప్రమోట్ అవుతారు. లేనిపక్షంలో 50 శాతం పేపర్లలో ఉత్తీర్ణత సాధించే వరకు పరీక్షలు రాస్తూ ఉండాల్సిందే. సెమిష్టర్ విధానం కాబట్టి మళ్లీ సప్లిమెంటరీ పరీక్షలు కూడా ఉండవు. దాంతో కనీసం ఏడాదిపాటు విద్యార్థుల సమయం వృథా అవుతుంది.

క్రెడిట్ల విధానంపై అధ్యయనానికి కమిటీ

మన తెలంగాణ/హైదరాబాద్ : డిగ్రీలో అమలు చేయాల్సిన క్రెడిట్ల విధానంపై అధ్యయనం చేసేందుకు నిపుణులతో కమిటీని నియమించాలని విద్యాశాఖ నిర్ణయించింది. గురువారం ఉన్నత విద్యామండలి కార్యాలయంలో విద్యాశాఖ స్పెషల్ సిఎస్ రంజీవ్ ఆర్ ఆచార్య అధ్యక్షతన వైస్ ఛాన్సలర్ల సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం అటానమస్ కళాశాలల్లో సిబిసిఎస్ విధానం కొనసాగుతున్న నేపథ్యంలో ఆయా కళాశాలల్లో అమలవుతున్న విధివిధానాలపై అధ్యయనం చేసే అంశంపై చర్చించినట్లు తెలిసింది. యుజిసి రూపొందించిన క్రెడిట్ల స్థానిక అవసరాలను దృష్టిలో ఉంచుకుని కొన్ని మార్పులు చేస్తే విద్యార్థులకు మేలు జరుగుతుందని, అందుకే క్రెడిట్ల విధానంపై అధ్యయనానికి కమిటీని నియమించాలని నిర్ణయించినట్లు సమాచారం. ఈ సమావేశంలో ఉన్నత విద్యామండలి చైర్మన్ టి.పాపిరెడ్డి, వివిధ వర్సిటీల వైస్ ఛాన్సలర్లు పాల్గొన్నారు.



జర్నలిస్టులపై దురుసుగా ప్రవర్తించిన పోలీసులను సస్పెండ్ చేయాలి

మన తెలంగాణ/హైదరాబాద్ : ప్రగతి భవన్ వద్ద జర్నలిస్టులపై దురుసుగా ప్రవర్తించిన పోలీసులపై 48 గంటల్లో విచారణ జరిపించి, బాధ్యులను సస్పెండ్ చేయాలని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టియూడబ్ల్యూజే), హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (హెచ్‌యూజె)లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. ఈ మేరకు టియూడబ్ల్యూజే ప్రధాన కార్యదర్శి కె. విరాహత్ అలీ నేతృత్వంలో జర్నలిస్టుల బృందం గురువారం డిజిపి అనురాగ్ శర్మను కలిసి వినతి పత్రాన్ని సమర్పించింది. మహిళా జర్నలిస్టు రాధిక (10 టివి), కెమెరామెన్ ధనుంజయ్ (10 టివి)లపై పంజాగుట్ట ఎసిపి వెంకటేశ్వర్లుతో పాటు మరికొందరు పోలీసు అధికారులు చేయి చేసుకోవడమే కాకుండా అక్కడున్న మిగతా ఛానళ్ల జర్నలిస్టులపై దురుసుగా ప్రవర్తించారని వివరించింది. దీనిపై డిజిపి స్పందిస్తూ విచారణకు నగర పోలీసు కమిషనర్ మహేందర్ రెడ్డిని ఆదేశించినట్లు జర్నలిస్టు యూనియన్ నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. వినతి పత్రం అందజేసిన వారిలో హెచ్‌యుజె అధ్యక్షులు రియాజ్ అహ్మద్, కార్యదర్శి శంకర్‌గౌడ్, ఉపాధ్యక్షులు ఐరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, ఎలక్ట్రానిక్ మీడియా విభాగం అధ్యక్షులు పి. బాలకృష్ణ, రాష్ట్ర నాయకులు ఎ. రాజేష్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కె. శ్రీకాంత్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

రాజకీయ పార్టీల ఖండన: జర్నలిస్టులపై పోలీసుల దురుసు ప్రవర్తనను కాంగ్రెస్ నేతలు కె.జానారెడ్డి,షబ్బీర్ అలీ, పొంగులేటి సుధాకర్‌రెడ్డి, సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఖండించారు.

'పెనాల్టీ పాయింట్స్' రద్దు చేయండి

మన తెలంగాణ / హైదరాబాద్ : వాహనదారులు, డ్రైవర్లకు విధిస్తున్న 'పెనాల్టీ పాయింట్స్' విధానాన్ని రద్దు చేయాలని తెలంగాణ రాష్ట్ర ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి బి.వెంకటేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రేటర్ హైదరాబాద్‌లో సరైన రోడ్లు, పార్కింగ్ స్థలాలు, సిగ్నలింగ్ వ్యవస్థ లేకుండా ఉల్లంఘనల పేరుతో పెనాల్టీ పాయింట్ల విధానాన్ని అమలు చేయడం ఎంతవరకు న్యాయమో ప్రభుత్వమే ఆలోచించాలన్నారు. బతుకుదెరువు కోసం ఆటో నడుపుకుని జీవించే డ్రైవర్లకు ఈ నిబంధనలు మరణ శాసనంగా మారాయని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. స్కూల్ పిల్లలను నిబంధనలకు విరుద్ధంగా రవాణ చేస్తున్న వ్యాన్లను నిషేధించాల్సిన రవాణ శాఖ అధికారులు లంచాలకు అలవాటుపడి వాటిని పట్టించుకోవడం లేదన్నారు.

'ప్రభుత్వ ట్యాక్సీ యాప్'ను తేవాలి

మన తెలంగాణ / హైదరాబాద్ : ప్రైవేటు ట్యాక్సీ సంస్థల దోపిడీని అరికట్టేందుకు 'ప్రభుత్వం ఆధ్వర్యంలో ట్యాక్సీ యాప్'ను సాధ్యమైనంత తొందరగా ప్రవేశపెట్టాలని తెలంగాణ క్యాబ్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.సునీల్, ప్రధాన కార్యదర్శి హరినాథ్ కోరారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో ట్యాక్సీ యాప్‌ను ప్రవేశపెట్టాలని ఆలోచిస్తున్నట్లు ఇటీవల కేంద్ర ప్రభుత్వం చేసిన నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామన్నారు. రవాణ రంగంలో ట్యాక్సీ కంపెనీల ఆధారిత యాప్‌లను రద్దు చేసి మార్కెట్ ఛార్జీలను నిర్ణయిస్తూ ప్రభుత్వ నియంత్రిత ట్యాక్సీ యాప్‌ను రూపొందించాలని వారు విజ్ఞప్తి చేశారు. నగరంలో గురువారం జరిగిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. ప్రైవేటు క్యాబ్స్ సంస్థలు డ్రైవర్ల శ్రమను దోపిడీ చేస్తున్నారని, అధిక లాభాలు, కమీషన్ల కోసం రవాణ రంగంలో అవసరాలకు మించిన ట్యాక్సీలను ప్రవేశపెట్టడం వల్ల ఏ ఒక్క డ్రైవర్ నెలకు కనీస వేతనాన్ని పొందలేకపోతున్నారని సునీల్ వివరించారు. 18 గంటల పాటు క్యాబ్‌లు నడిపినా శ్రమకు తగిన ఫలితం ఉండడం లేదని సునీల్ వివరించారు. ఉపాధి కోసం అప్పులు చేసి క్యాబ్‌లు కొనుగోలు చేసిన తమకు తగిన ఆదాయం రాకపోవడంతో అప్పులు చెల్లించలేక ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

ఐఎఎస్‌ల భగీరథ యాత్ర

(మొదటిపేజీ తరువాయి)

ప్రాజెక్టును పరిశీలించటానికి గురువారం ఐఎఎస్ అధికారులు వెళ్తూ మార్గ మధ్యలో గజ్వేల్‌లో మిషన్ భగీరథను పరిశీలించారు. ఈసందర్భంగా వారు కోమటిబండ గుట్టపై నిర్మించిన ప్రాజెక్టు సంప్‌లు, పంపింగ్ హౌజ్, భారీ ఓవర్‌హెడ్ ట్యాంకులు, పైలాన్ తదితర నిర్మాణాలను ఆసక్తిగా పరిశీలించారు. జిల్లాలో మిషన్ భగీరథ పనుల పురోగతిని, స్థానిక ప్రాజెక్టు పనితీరును జిల్లా కలెక్టర్ వెంకట్రాంరెడ్డి ఈ బృందంలోని ఐఎఎస్ అధికారులకు వివరించారు. ఆయన తెలిపిన వివరాలను ఆసక్తిగా విన్న అధికారులు ఇంత భారీ ప్రాజెక్టు నుంచి గ్రామాలకు గ్రావిటీ ద్వారానే నీటిని అందించటం గొప్పవిషయమన్నారు. ప్రతిష్టాత్మకమైన ఈ పథకాన్ని అద్భుతంగా తీర్చిదిద్దిన అధికారులు, ఇంజనీర్ల పనితీరును వారు అభినందించారు. ఈ సందర్భంగా నీటిసరఫరా తీరుతెన్నులను మ్యాపులు, ఫోటో ఎగ్జిబిషన్ ద్వారా పరిశీలించారు. అదనపు సమాచారాన్ని కలెక్టర్ వెంకట్రాంరెడ్డి, ఎస్‌ఇ విజయప్రకాశ్‌లు అధికారులకు అందించారు. అనంతరం అల్పాహారం చేసి అధికారుల బృందం కాళేశ్వరం బయలు దేరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ఐఎఎస్ అధికారులు బిపి ఆచార్య, సురేష్ చంద్ర, జగదీశ్వర్, శ్రీలక్ష్మి , మహేష్ దత్‌ఎక్కా, పార్థసారథి, ఉమర్ జలీల్‌తో పాటు సిద్దిపేట జిల్లా కలెక్టర్ వెంకట్రాంరెడ్డి, గడా ప్రత్యేక అధికారి హనుమంతరావు. ఆర్‌డబ్ల్యూఎస్ సిఇ విజయప్రకాశ్ ఇతర శాఖల అధికారులు, మెగా కంపెనీ ప్రతినిధులున్నారు.

గోదావరి బోర్డు ఫిర్యాదు

(మొదటిపేజీ తరువాయి)

చట్టం ప్రకారం రెండు రాష్ట్రాల్లో చేపట్టిన కొత్త ప్రాజెక్టుల వివరాలను, సాంకేతిక అధ్యయనానికి, పాత ప్రాజెక్టులపై ప్రభావాన్ని మదింపు చేయడానికి బోర్డుకు సమర్పించాల్సి ఉంది. కానీ కాళేశ్వరం ప్రాజెక్టు కొత్తదేం కాదని తెలంగాణ ప్రభుత్వం చెబుతోందని, ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టునే రీఇంజనీరింగ్ చేసామంటున్నారని లేఖలో వివరించారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ప్రాణహిత, కాళేశ్వ రం ప్రాజెక్టులుగా రీ డిజైన్ చేశామని చెబుతున్నారని, డిపిఆర్‌లు అడిగితే ఖాత రు చేయడం లేదని సాహు లేఖలో తన ఆవేదన వ్యక్తపరిచారు. ఈ లేఖ ప్రతుల ను రెండు రాష్ట్రాల ఇంజినీర్ ఇన్ చీఫ్‌లకు కూడా బోర్డు అధికారులు పంపించారు.

చంచల్‌గూడకు విక్రమ్

(మొదటిపేజీ తరువాయి)

దృష్ట్యా విక్రమ్‌గౌడ్‌కు బెయిల్ ఇవ్వరాదని పోలీసులు వాదన వినిపించడంతో మెజిస్ట్రేట్ ఏకీభవించారు. దీంతో విక్రమ్ బెయిల్ పిటిషన్ రద్దయ్యిం ది. ఇదే కేసులో కిరాయి ముఠా సభ్యులు నందకుమార్, షేక్ అహ్మద్, రయీస్ ఖాన్, కె.బాబుజాన్, ఎ.గోవింద్‌రెడ్డిలను అరెస్టు చేసి జైలుకు పంపించిన విషయం తెలిసిందే. ఈ కేసులో పరారీలో ఉన్న వెంకటరమణ, గౌస్‌ల కోసం పోలీసులు గాలిస్తున్నారు. జైలులో రిమాండ్‌లో ఉన్న విక్రమ్‌గౌడ్‌కు అండర్ ట్రయల్ నెంబర్ 8407ను జైలు అధికారులు కేటాయించారు. అతని ఆరోగ్య పరిస్థితి నేపథ్యంలో జైలు డాక్టర్ల పర్యవేక్షణలో ఉన్నాడు.

కన్నడ కృష్ణలీల

(మొదటిపేజీ తరువాయి)

జూరాలలో ఉన్నది. ఇదేవిధంగా నారాయణపూర్ రిజర్వాయర్లోకి ఇప్పటి వరకు 33.08 టిఎంసిల నీరు వచ్చింది. వాటర్ ఇయర్ మొదటి రోజే 14.23 టిఎంసిల నీరు ఉన్నది. రెండు రిజర్వాయర్లు కలిపి 202.88 టిఎంసిల నీరు ఉండాలి. రెండు రిజర్వాయర్ల సామర్థ్యం 167.36 టిఎంసిలే. మిగతా 35.52 టిఎంసిల నీళ్లకు లెక్క లేదు. దీంతో పాటు కె1 బేసిన్‌లో ఆగస్టు 1న 36000 క్యూసెక్కుల వరద ఇన్‌ఫ్లో నమోదు అయ్యింది. ఈ నీళ్లు ఆగస్టు 3న ఆల్మట్టికి చేరాలి. కానీ ఆల్మట్టిలో ఇప్పుడు చూపుతున్న ఇన్‌ఫ్లో 21000 క్యూసెక్కులే. మధ్యలోనే పదివేల క్యూసెక్కులు ఎక్కడికి పోయాయి. అక్రమ వినియోగమా, నీటి మళ్లింపా, లెక్కల్లో కనికట్టా.. కర్ణాటక ప్రభుత్వానికే తెలియాలి. తక్కువ ఇన్‌ఫ్లోలు చూపుతూ, అధికంగా వినియోగం, నీటి మళ్లింపు చేస్తున్నారని, అందుకే జూరాల నిండలేదని నిపుణులు చెబుతున్నారు. రాష్ట్రంలోని జూరాల రిజర్వాయర్లోకి ఈ సీజన్లో 6.72 టిఎంసిల నీరు వచ్చింది. అంతకు ముందు 2 టిఎంసిల నీరు డ్యాంలో ఉంది. మొత్తం 8.72 టిఎంసిలు కాగా, కెనాళ్లకు నీరు వదలడంతో 5.52 టిఎంసిల నీరు ప్రస్తుతం ఉంది. ఇదేవిధంగా కర్ణాటకలోని తుంగభద్ర డ్యాంలోకి 41 టిఎంసిల నీరు వచ్చింది. రిజర్వాయర్ నిండాలంటే ఇంకా 60 టిఎంసిలు కావాల్సివుంది. 215 టిఎంసిల భారీ నిల్వ సామర్థ్యం ఉన్న శ్రీశైలంలోకి కేవలం 3.18 టిఎంసిల నీరు మాత్రమే వచ్చింది. ఇదేవిధంగా 312 టిఎంసిల అధిక నీటినిల్వ సామర్థ్యం ఉన్న నాగార్జునసాగర్లో వచ్చింది కేవలం 2.56 టిఎంసిలే. ఇవి కూడా స్థానికంగా కురిసిన వర్షాల వల్లనే. శ్రీశైలం నిండి, గేట్లెత్తాలంటే ఇంకా 196 టిఎంసిలు, నాగార్జునసాగర్‌కు195 టిఎంసిలు కావాలి. జూరాలలో ఇంకా 4 టిఎంసిలు, మొత్తంగా 395 టిఎంసిలు వస్తేనే తెలంగాణకు జలకళ వస్తుంది. ఇది సాకారం కావాలంటే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు కర్ణాటకలోని కృష్ణా పరివాహక ప్రదేశంలో భారీ నుంచి అతి భారీ వర్షాలు వరుసగా రావాలి. అప్పుడే ప్రాజెక్టులు నిండి గేట్లెత్తుతారు. కర్ణాటక వినియోగించిన 35 టిఎంసిల అక్రమ వినియోగం విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఏం చేయలేని స్థితిలో ఉంది. ఇదే స్థితి కొనసాగితే, కల్వకుర్తి ఎత్తిపోతలలో ప్రభుత్వం నీరు ఇవ్వదలపెట్టిన 4.5 లక్షల ఎకరాల ఆయకట్టు, నాగార్జునసాగర్ ఎడమ కెనాల్ 179 కిలోమీటర్ల పొడవునా లక్షలాది ఎకరాల ఆయకట్టుకు సాగునీరును పారిస్తుంది. నల్గొండ జిల్లాలో 1,53,000 ఎకరాలు, సూర్యాపేట జిల్లాలో 2,27,000, ఖమ్మం జిల్లాలో 2,60,814 ఎకరాల ఆయకట్టుకు నీరందిస్తూ రైతుల జీవితాల్లో వెలుగులు నింపుతోంది. ఇవేకాకుండా మరో 2.5 నుంచి 3 లక్షల ఎకరాల వరకు కృష్ణా జిల్లాలో సాగునీటిని ఎడమ కాలువ తీసుకెళుతుంది. అయితే ఎగువన కర్ణాటకలో కృష్ణమ్మను మలుపుకోవడం, ఆపసోపాలతో శ్రీశైలం రిజర్వాయర్‌కు చేరినా, అక్కడి నుంచి దిగువకు రాని పరిస్థితుల నేపథ్యంలో ఎడమ కాలువ ఆయకట్టుకు ఏడుపే మిగిలే ప్రమాదం పొంచివుంది.

ఎన్‌హెచ్‌గా రాజీవ్ రహదారి

(మొదటిపేజీ తరువాయి)

రహదారిగా గుర్తించాలంటూ రాష్ట్రానికి చెందిన పలువురు ఎంపిలు, కరీంనగర్, మెదక్ జిల్లాకు చెందిన శాసన సభ్యులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేస్తూ వచ్చారు. ఈ రహదారిని జాతీయ రహదారిగా గుర్తించవచ్చా? లేదా? అన్న అంశంపై ప్రాథమికంగా శాఖ పరంగా అధ్యయనం చేయించింది. ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం ఈ రహదారిని ఏసియా డెవలప్‌మెంట్ బ్యాంక్(ఏడిబి) ఆర్థిక సహాయంతో నాల్గు లైన్లుగా రోడ్డుగా విస్తరించిందని, అయితే ఇది జాతీయ రహదారి స్థాయి ప్రమాణాలు లేవని తేల్చింది. మరో వైపు ఈ రహదారి తెలంగాణలోనే అత్యధికంగా రద్దీ ఉన్న రహదారిగా గుర్తింపు పొందింది. నిత్యం వాహనాల రాక పోకలు భారీగా ఉండడం, హైదరాబాద్, గజ్వేల్, సిద్దిపేట మీదుగా కరీంనగర్ లాంటి ముఖ్యపట్టణాలను ఈ రహదారి కలుపుతూ వెల్లడంతో రవాణా పరంగా కీలకంగా నిలుస్తోంది. ఒక వైపు బస్సులు, కార్లతో ప్రయాణికుల రాకపోకలు సాగడం, మరో వైపు సరుకు రవాణా కోసం లారీలు, కంటెయినర్లు ఈ రహదారినే ఆశ్రయిస్తుండడంతో రోడ్డు ప్రమాదాలు కూడా అత్యధికంగా నమోదు అవున్నన్నదిగా రాజీవ్ రహదారి ఘనత కెక్కింది.

ప్రమాదాలపై పలు మార్లు అధ్యయనం..

రాజీవ్ రహదారిపైనే అత్యధికంగా ఎందుకు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయో తెలుసుకునేందుకు రోడ్లు భవనాలశాఖ ఇటీవల ఒక ప్రైవేటు ఏజెన్సీతో అధ్యయనం చేయించింది. ఈ సంస్థ గత రెండు మాసాల కిందటే నివేదిక సమర్పిస్తూ 60కి పైగా ఉన్న డేంజర్ స్పాట్లు, వంకర టింకర రోడ్డు కారణంగానే ప్రమాదాలు జరుగుతున్నట్లు ప్రభుత్వానికి నివేదికను ఇచ్చింది. వాహనాల తాకిడి పరంగా సాధారణంగా ఒక జాతీయ రహదారికి ఎంత రద్దీ అయితే ఉంటుందో అంతకు మించిన రద్దీ రాజీవ్ రహదారిలో ఉంటోందని, అయితే నేషనల్ హైవేకి ఉండాల్సిన ప్రమాణాలు లేవని తేల్చింది. కుంచించుకు పోయిన చోట్ల తాత్కాలిక మరమ్మతులు జరిపించి చేతులు దులుపుకుంటున్న ప్రభుత్వం శాశ్వత ప్రాతిపదికన హైవే రోడ్డుగా గుర్తింప జేసేందుకు మాత్రం కేంద్రంపై గట్టి ఒత్తిడి తేవడం లేదన్న విమర్శలను ఎదుర్కొంటోంది. ఈ క్రమంలోనే తాజాగా సిఎం కెసిఆర్ ఈ రోడ్డు అలైన్ మెంట్‌ను మార్చాలని, వీలైనంత మేరకు వంకర్లు తగ్గేలా ఉండాలని అధికారులకు సూచించారు. ప్రజ్ఞాపూర్, కుక్కనూర్‌పల్లి, గౌరారం, వంటిమామిడి పల్లి, తుర్కపల్లి, దుద్దెడ, ములుగు, కొడకండ్ల, రామునిపట్ల, ఇబ్రహీంనగర్ మీదుగా బైపాస్ రోడ్డును వేస్తే బావుంటుందని అధికారులు ప్రభుత్వానికి నివేదిక అందించారు. అధికారులు సూచించిన ఈ మార్గాన్ని జాతీయ రహదారుల మంత్రిత్వశాఖకు ప్రభుత్వం నివేదిస్తూ..ఈ రోడ్డును జాతీయ రహదారిగా గుర్తించాలని విజ్ఞప్తి చేసింది. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ దీనిపై స్పందిస్తూ తప్పనిసరిగా ఈ రోడ్డును జాతీయ రహదారిగా గుర్తిస్తామని ప్రకటించారు.



పైశాచిక ప్రభుత్వం

(మొదటిపేజీ తరువాయి)

ప్రజలుకు చెప్పి ముఖ్యమంత్రి కాలం గడపాలని చూస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నడూ ప్రభుత్వంపై కేసులు వేయలేదని, కడుపు మండిన వాళ్ళు, న్యాయం కావాలనుకున్నవాళ్ళు, చట్టవిరుద్ధంగా పనులు జరుగుతున్నాయనుకున్న వాళ్ళే కేసులు వేశారన్నారు. సింగరేణి డిపెండెంట్ ఉద్యోగాలపై గతంలో తెలంగాణ జాగృతి సంస్థలో పనిచేసిన వారే కేసు వేయడం వాస్తవమా? కాదా?, ఈ కేసు వాదించిన న్యాయవాది గతంలో టిఆర్‌ఎస్ సభ్యుడా? కాదా? అని ప్రశ్నించారు. సింగరేణి డిపెండెంట్ ఉద్యోగాల కోసం శాసనసభలో కాంగ్రెస్ పార్టీ, తాను, జీవన్‌రెడ్డి సహకరించామా? లేదా? అని సిఎంను సవాలు చేశారు. ప్రభుత్వంపై కేసులు వేయడం కొత్తేమి కాదని, తమ హయాంలో కూడా ఇరిగేషన్ ప్రాజెక్టులు, కాంట్రాక్టు ఉద్యోగాలపై కేసులు వేశారని చెప్పారు. తాను మంత్రి ఉన్నప్పుడు శ్రీశైలం లో లెవల్ కెనాల్ విషయంలో తమ పార్టీకి చెందిన మహిళ, తన మద్దతుదారే తనపై కేసు వేశారని తెలిపారు. తాను మంత్రిగా ఉన్నపుడు పంచాయతీరాజ్ కార్యదర్శుల రెగ్యులరైజ్ చేసినప్పుడు కూడా కేసులు వేశారని గుర్తు చేశారు. అసలు కేసులు వేసిన చరిత్ర టిఆర్‌ఎస్‌దని, గతంలో పంచాయతీరాజ్ ఎన్నికలు, వాటి ఫలితాలు నిలిపివేయాలని టిఆర్‌ఎస్ కేసు వేయలేదా? అని ప్రశ్నించారు. వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ ఇస్తే అద్భుతమని తాను అన్నట్లుగా సిఎం, మంత్రులు అబద్ధాలు చెబుతున్నారని జానారెడ్డి అన్నారు. శాసనసభలో24 గంటల విద్యుత్‌పై చర్చ సందర్భంగా 2018 నాటికి కొత్త ప్రాజెక్టులు పూర్తయి 20వేల మెగావాట్ల అందుబాటులోకి వస్తాయని సిఎం అంటే, అలా జరిగితే అద్భుతమని అన్నానని వివరించారు.

కమ్యూనిస్టులను నా కొడుకులు అంటావా?

సాయుధపోరాటం చేసి,నిరంతరం పేద ప్రజల కోసం ఉద్యమించే కమ్యూనిస్టులను నా కొడుకులు అని సిఎం అనడాన్ని జానారెడ్డి తీవ్రంగా ఖండించారు. వారు అధికారంలోకి రాకపోవచ్చని, కాని వారి పోరాటాలు శ్లాఘనీయమైనవన్నారు. రాజకీయాల్లో పరస్పరం గౌరవించుకోవడం సంప్రదాయమన్నారు.

కెటిఆర్ ఆబిడ్స్‌లో చర్చకు రా: షబ్బీర్ అలీ

హిమాన్షు మోటార్స్‌పై ఆధారాలు ఉంటే జైరామ్ రమేశ్ ఆబిడ్స్‌లో చర్చకు రావాలని సిఎం కెసిఆర్ సవాలుపై షబ్బీర్ అలీ స్పందిస్తూ, తన వద్ద ఆధారాలు ఉన్నాయని, ముఖ్యమంత్రి తన కుమారుడు కెటిఆర్‌ను ఆబిడ్స్‌కు పంపాలని అన్నారు. 'కాంగ్రెస్‌ని పిశాచి అన్న కెసిఆర్.. నీ రాజకీయ జీవితం 1970లో సిద్ధిపేటలో యువజన కాంగ్రెస్ నుండి ప్రారంభం అయిందని మరిచావా?1983లో యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షునిగానే టిడిపిలో చేరింది గుర్తు లేదా? నువ్వు, నీ కుటుంబసభ్యులు రాక్షసులుగా మారారు'' అని అన్నారు.

''తెలంగాణ బిల్లును లోక్‌సభలో పాస్ చేయించిన మీరాకుమార్‌ను వెక్కిరిస్తావా? తక్షణమే ఆమెకు క్షమాపణ చెప్పాలి. తెలంగాణ బిల్లును రాసిన జైరామ్ రమేశ్ ఇష్టమొచ్చినట్లు తిడతావా? కాంగ్రెస్ పార్టీని అంటే కబర్దార్, కార్యకర్తలు నీ వెంట పడతార'ని హెచ్చరించారు. నేరెళ్ళ ఘటనలో ఇద్దరు, ముగ్గురే దళితులు ఉన్నారని సిఎం సిగ్గు శరం లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి భాష చూస్తుంటే ప్రగతిభవన్‌కు దయ్యాలు పట్టినట్లుందని పొంగులేటి సుధాకర్‌రెడ్డి అన్నారు. నాడు కాంగ్రెస్ అధినేత సోనియాగాంధీని దేవత అన్న కెసిఆర్, ఇవాళ ఆ పార్టీని పిశాచి అనడం దేనికి నిదర్శనమన్నారు. ఎవరైనా కోర్టుకు వెళ్తే దోషులవుతారా? ఇది న్యాయవ్యవస్థను కించపరిచినట్లేనని అన్నారు.

మోడీ టీంలో మురళీధర్?

(మొదటిపేజీ తరువాయి)

అనుగుణంగా రాష్ట్ర పార్టీ శ్రేణులు ప్రజల్లోకి అంతగా చొచ్చుకు పోవడం లేదన్న విషయాన్ని అధిష్టానం ఇప్పుడిప్పుడే గ్రహిస్తోంది. దీంతో ఎట్టి పరిస్థితులలో లక్ష్యం గురి తప్పొద్దన్న ఉద్దేశ్యంతో ఉన్న నాయకత్వం అవసరమైతే మరో కేంద్ర మంత్రి పదవిని కూడా తెలంగాణకు ఇచ్చేందుకు సిద్ధమైనట్లు సమాచారం. తెలుగు రాష్ట్రాలలో కొన్నేళ్ళుగా బిజెపి అంటే వెంకయ్యనాయుడు, వెంకయ్య నాయుడు అంటే బిజెపి అనేలా ఉండేది. ఎవరికి ఏ పదవి కావాలన్నా, ఎవరిని ఏ పనులకు వినియోగించుకోవాలన్న వెంకయ్య కనుసన్నల్లో జరిగేది. తాజాగా ఆయన ఉప రాష్ట్రపతిగా వెళ్ళడంతో తెలుగు రాష్ట్రాల్లో పార్టీకి ఏ మాత్రం లోటు రాకుండా ఉండేందుకు వీలుగా అధిష్టానం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోందన్న చర్చ కూడా సాగుతోంది. తెలంగాణలో పార్టీని ఉరుకులు, పరుగులు పెట్టించేందుకు చేపట్టాల్సిన చర్యలకు అధిష్టానం శ్రీకారం చుట్టిందన్న చర్చ కూడా సాగుతోంది. మురళీధర్‌రావుకు తెలంగాణ, రాంమాధవ్‌కు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాధ్యతలను కట్టబెట్టాలన్నది అధిష్టానం ఆలోచన అని పార్టీలో చర్చ జోరుగా సాగుతోంది. తెలంగాణ రాష్ట్ర పార్టీపైనా, నాయకులపైనా మురళీధర్‌రావుకు పూర్తి అవగాహన కూడా ఆయనకు ఉండటమే ఇందుకు కారణం. అంతే కాకుండా జాతీయ స్థాయిలోనూ అనేక మంది నేతలతోనూ సత్సంబంధాలున్నాయి. త్వరలో రాజస్థాన్ రాష్ట్రం నుంచి రాజ్యసభకు జరుగనున్న ఎన్నికల్లో ఆయనను బరిలోకి దింపే అవకాశాలు ఉన్నట్లు భావిస్తున్నారు. అదే తరహాలో రాంమాధవ్‌కు కూడా రాజ్యసభకు ఎంపిక చేస్తారని అంటున్నారు. గత కొంత కాలంగా మురళీధర్‌రావు తెలంగాణలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. ఇటీవల అమిత్‌షా పర్యటనలో కూడా ఆయనే ప్రధానంగా కనిపించారు. అంతేకాకుండా అధికార టిఆర్‌ఎస్‌పై ఆయన ఘాటైన విమర్శలు, ప్రభుత్వ పని తీరును ఎప్పటికప్పుడు నిశితంగా పరిశీలించడంలో ఆయన చూపుతున్న శ్రద్ధ పార్టీకి కలిసి వస్తుందని జాతీయ పార్టీ భావిస్తుండవచ్చని నేతలు పేర్కొంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వ పనితీరును వీలైనప్పుడల్లా ఎండగడుతూనే కేంద్ర ప్రభుత్వ పథకాలు, ఆయా పథకాలకు కేటాయిస్తున్న నిధులపై ప్రజల్లో చైతన్యం కోసం ఆయన చేస్తున్న ప్రయత్నాలు కూడా కలిసి వస్తాయని భావిస్తున్నారు. అంతేకాకుండా రాష్ట్ర పార్టీలోని నాయకుల మధ్య ఉన్న సమన్వయ లోపం, ఉద్యమాలపై చిత్తశుద్ధి లేమిని కూడా మురళీధర్‌రావు సరిచేస్తారన్న నమ్మకం కూడా అధిష్టానం పెట్టుకుంది.

చైనాతో పరిష్కారం

(మొదటిపేజీ తరువాయి)

మాత్రమైనా చెప్పకుండా ప్రధాన ప్రతిపక్ష నాయకులు చైనా రాయబారితో భేటీ జరపడం దేశ సమగ్రతకు, కీలక అంశాలపై గోప్యతకు భంగం వాటిల్లుతుందని సుష్మా ఆందోళన వ్యక్తం చేశారు. ముందుగా ఆయన ప్రభుత్వంతో చెప్పి ఉంటే బాగుండేదని సూచించారు. భారతదేశ విదేశాంగ విధానం, కీలక భాగస్వామ్య పక్షాలతో సంబంధాల అంశంపై ఎగువ సభలో వాడివేడి చర్చ జరిగింది. ఈ సందర్భంగా ప్రతిపక్ష సభ్యులు సరిహద్దులలో ప్రతిష్టంభన పరిస్థితిని ప్రస్తావించారు. భారతదేశ విధానంలో లోపాలను ఎత్తిచూపారు. అయితే ప్రతిపక్షాల వాదనను విదేశాంగ మంత్రి తిప్పికొట్టే ప్రయత్నం చేశారు. దౌత్య వర్గాల ద్వారా చైనాతో సరిహద్దుల ఉద్రిక్తతలను నివారించేందుకు యత్నిస్తున్నట్లు తెలిపారు. భారతదేశానికి పటిష్టమైన సైనిక శక్తి ఉందని, అయితే అన్నింటికీ సైనిక చర్యలే, యుద్ధాలే పరిష్కారం కాదని స్పష్టం చేశారు. దౌత్య మార్గాల ద్వారా అడ్డంకులను తొలిగించుకునే యత్నాలు సాగుతున్నాయని దీనిని సభ్యులు వేరే విధంగా భావించరాదని తెలిపారు. సమస్యల పరిష్కారానికి ఓపిక అవసరం అని, అయితే సమస్యలు తొలిగిపోతాయని హామీ ఇచ్చారు. చైనా, భూటాన్ రాయబారులను కలిసేందుకు కాంగ్రెస్ పార్టీ రాహుల్‌కు అనుమతిని ఇచ్చిందని, ఇప్పుడున్న దశలో ఇది సముచితం కాదని సుష్మా స్వరాజ్ చురకలు అంటించారు. తాను చైనా రాయబారిని కలిసినట్లు స్వయంగా రాహుల్ ట్వీట్ చేశారని, అదే విధంగా ఎన్‌ఎస్‌ఏ మాజీ అధినేతలు , ఈశాన్య ప్రాంత కాంగ్రెస్ నాయకులు కూడా రాయబారులను కలిసినట్లు స్వయంగా రాహుల్ తెలిపినట్లు వెల్లడైందని సుష్మా తెలిపారు. అయితే ఇవి పెద్దగా పరిగణనలోకి తీసుకునే సమావేశాలు కావని, కేవలం సృహద్భావపూర్వకంగానే రాహుల్ రాయబారులను కలిశారని ఆ తరువాత కాంగ్రెస్ ప్రతినిధి రణదీప్ సూర్జేవాల్ వివరణ ఇచ్చారు. పొరుగుదేశాల రాయబారులు అప్పుడప్పుడు కాంగ్రెస్ అధ్యక్షులు సోనియాను, ఉపాధ్యక్షులు రాహుల్‌ను కలుసుకోవడం మామూలే అని స్పష్టం చేశా రు.

చెరి రూ.5 కోట్లు

(మొదటిపేజీ తరువాయి)

తీసుకోవాలని కోరగా గ్రామాభివృద్ధికి రూ. 5 కోట్ల నిధులు మంజూరు చేస్తానని తెలిపారు. స్థానిక సర్పంచ్‌తో పాటు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడినట్లు సమాచారం. దీంతో పాటు లక్ష్మాపూర్ గ్రామంలో సైతం గ్రామస్తులతో ముచ్చటించి ఆ గ్రామానికి సైతం రూ. 5 కోట్ల నిధులు మంజూరు చేస్తానని చెప్పారు. కేశవరం నుంచి కృష్ణగౌడ్, లక్ష్మాపూర్ నుంచి డప్పు నర్సయ్యలను తన కాన్వాయ్‌లో ఎక్కించుకొని వెళ్లి గ్రామాల సమస్యలపై ఆరా తీశారు. గ్రామ సమస్యలతో పాటు స్వంత సమస్యలను సిఎం దృష్టికి తీసుకువెళ్లగా వాటి పరిష్కారానికి కృషి చేస్తానని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. కేశవరం గ్రామస్తులు రాములుగౌడ్, రవిగౌడ్, ప్రదీప్, మహేశ్, లక్ష్మాపూర్ శ్యామల, గ్రామస్తులు జగన్నాథం సిఎంతో ముచ్చటించిన వారిలో ఉన్నారు.



కెసిఆర్ పచ్చి అబద్ధాల కోరు : పొన్నం ప్రభాకర్

మన తెలంగాణ/హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తెలంగాణ వ్యతిరేకులే రాజ్యమేలుతున్నారని టిపిసిసి ఉపాధ్యక్షులు పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. సిఎం కెసిఆర్ పచ్చి అబద్దాల కోరని, ఆయన మాటకు పొంతనే ఉండదన్నారు. వాగ్దానాలు, హామీలతోనే పబ్బం గుడపుతున్నారని చెప్పారు. సిరిసిల్ల ఘటనలో ఎస్‌సి,ఎస్‌టి,బిసి వారిపై థర్డ్‌డిగ్రీ ప్రయోగించి, చిత్రహింసలు పెట్టిన విషయం మంత్రి కెటిఆర్‌కు తెలియదా అని ప్రశ్నించారు. ఈ మేరకు పొన్నం ప్రభాకర్ పలుప్రశ్నలతో గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాజకీయ విలువలను తుంగలో తొక్కిన పచ్చి అవకాశ వాది కెసిఆర్ అని అన్నారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత కెసిఆర్ కుటుంబమే బాగుపడిందన్నారు. పాత కెసిఆర్‌గా మారుతాను అని అనడమంటే తిరిగి దుబాయ్ ఏజెంట్ శేఖర్‌గా మారిపోతారా అని ఆయన ఎద్దేవా చేశారు. ప్రజల అభ్యంతరాలను, ప్రతిపక్షాల సూచనలను, విమర్శలను సిఎం కెసిఆర్ ఎందుకు స్వీకరించరని ప్రశ్నించారు.



లంబాడీల సంక్షేమానికి కృషి

● **తీజ్ పండుగ వేడుకల్లో మంత్రి జగదీశ్‌రెడ్డి**

మనతెలంగాణ/నల్లగొండ టౌన్ : లంబాడీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర విద్యుత్ ,దళిత అభివృద్ధి శాఖా మంత్రి జి. జగదీశ్‌రెడ్డి అన్నారు. గురువారం నల్లగొండ పట్టణంలోని గడి యారం సెంటర్ వద్ద జరిగిన తీజ్ పండుగ వేడుకల్లో మంత్రి పాల్గొని మాట్లాడారు. లంబాడీలను అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు అనే కార్యక్రమాలను చేపట్టిందని, లంబాడీ సోదరులు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలని ఆయన ఆకాంక్షించారు. లంబాడీల సంస్కృతి గొప్పదని ఆయన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. యువతులు చేసిన బంజార నృత్యాన్ని చూసి మంత్రి సంబరపడ్డారు. జిల్లాలో వెనుకపడ్డ దేవరకొండ ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ఇప్పటికే జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించాలని వారిని ఆదేశించినట్లు ఆయన స్పష్టం చేశారు. గురుకుల పాఠశాలల్లో బంజారా పిల్లలను చేర్పించి, ఉన్నత విద్యను అభ్యసించే విధంగా చొరవ తీసుకోవాలని అధికారులు , నాయకులను ఆయన కోరారు. జెడ్పి చైర్మన్ బాలూ నాయక్ , ఆర్డిఒ వెంకటాచారి ఎంఎల్‌వి వేముల వీరేశం బంజారా సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు మద్దతు ధర : ఉత్తమ్



మన తెలంగాణ/హుజూర్‌నగర్ రూరల్ : రైతులు పండించిన ధాన్యానికి కనీస మద్దతు ధర ప్రభుత్వం ప్రకటించాలని టిపిసిసి అధ్యక్షులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. గురు వారం మండల పరిధిలోని లింగగిరి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన పిఎసిఎస్ గోదామును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రైతుల రుణాలు ఒకే సారి రెండు లక్షల రూపాయలను మాఫీ చేసి కొత్త రుణాలను అందిస్తామని వివరించారు. టీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చి రాష్ట్రంలోని వ్యవసా యాన్ని సంక్షోభంలోకి నెట్టిందన్నారు. కేసీఆర్‌ది నియంతపాలనని, గారడీ మాటలతో ప్రజలను బురిడీ కొట్టిస్తున్నారని ఎద్దేవా చేశారు. టీఆర్ఎస్ పార్టీ నాయకుల మాటలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని స్పష్టం చేశారు. అధికారంలోకి వస్తే ఒకేసారి రుణమాఫీ చేస్తామని చెప్పి నేటికీ ఇంత వరకు పూర్తిగా రుణమాఫీ చేయకుండా, కొత్త రుణాలను ఇవ్వకుండా రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటీసి హఫీజానిజాముద్దీన్, ఆ సంఘ ఛైర్మన్ కట్ట గోపాల్‌రావు, సీఈఓ జనార్ధన్, సంఘ డైరెక్టర్లు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ విద్యను ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం



మనతెలంగాణ/చర్లపల్లి : కార్పొరేట్ పాఠశాలలను ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం ప్రభుత్వ విద్యా సంస్థలను నీరు గారుస్తుందని జెఎసి చైర్మన్ కోదండరాం అన్నారు. గురువారం ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్‌యు) ఈసిఐఎల్ కమిటీ అధ్యక్షురాలు స్వాతి అధ్యర్యం లో కుషాయిగూడ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన విద్యార్థి పోరు గర్జన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో పోరాటాలతో సాధించుకున్న తెలంగాణలో విద్య రంగం నేటికీ సమస్యలు ఎదుర్కోవడం విచారకరమన్నారు. ఉప్పల్ నియోజకవర్గంతో పాటు పరిసర ప్రాంతాలైనా ఘట్‌కేసర్, కీసర వంటి ప్రాంతాల్లో నేటికి ప్రభుత్వ కళాశాలలు లేకపోవడం ప్రభుత్వ పని తీరుకు అద్దం పడుతుందని అన్నారు. పిడిఎస్‌యు రాష్ట్ర మాజీ కార్యదర్శి ఎస్ఎల్ పద్మ, ఐఎఫ్‌టియు రాష్ట్ర నేత వి.కిరన్, రాష్ట్ర ప్రదాన కార్యదర్శి కెఎస్ ప్రదీప్, రాష్ట్ర నాయకులు రవీందర్, నాగేశ్వర్ రావు, అనిల్, రాజశేఖర్‌లు ప్రసంగించారు. భవన, గోపి, సుప్రియ, ఝాన్సీ, జునేరియ, అర్చన, శశాంక్, వినోద్ పాల్గొన్నారు.

ఇసుక మాఫియాపై జడ్జిచే న్యాయ విచారణ!

● **టిఎస్ ఫోరం డిమాండ్**

మన తెలంగాణ/హైదరాబాద్ హిమాయత్‌నగర్: టిఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని, జిల్లెల, నేరెళ్ళ ఘటనలపై న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ సామాజిక ప్రజా సంఘాల ఐక్యవేదిక (టిఎస్ ఫోరం) నాయకులు కార్యకర్తలు గురు వారం ట్యాంక్‌బండ్ వద్ద గల డాక్టరు బిఆర్ అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఫోరం రాష్ట్ర స్టీరింగ్ కమిటీ నాయకులు తమ్మినేని వీరభద్రం, విమలక్క, జె.బి.రాజు, టి మేధావుల ఫోరం రాష్ట్ర కన్వీనర్ ప్రొఫెసర్ పిఎల్ విశ్వేశ్వరరావు తదితరులు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బిసి ఎంబిసి, మైనార్టీలు 90శాతం ఉన్నారని వీరు తరతరాలుగా సామాజిక, ఆర్థిక రాజకీయ, సాంస్కృతికంగా అణచివేతకు గురవుతున్నారని అవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వాల మాదిరిగానే పాలన కొనసాగిస్తున్నదన్నారు. ఇప్పటికైనా టిఆర్ఎస్ ప్రభుత్వం ప్రజల ఇచ్చిన హామీలను అమలు చేయాలని, లేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. జిల్లెల, గ్రామంలో దళిత గిరిజన ప్రజలపై పోలీసుల దమన కాండ ఇసుక మాఫియాపై సింగిల్ జడ్జిచే న్యాయ విచారణ జరిపించాలని, జిల్లా ఎస్పీ, సంబంధిత పోలీసు అధికారులను సస్పెండ్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ఎస్సీ, ఎస్టీ అభివృద్ధి చట్టంలోని లోపాలను సవరించి రూల్స్ రూపొందించాలని, బిసి, మైనార్టీ అబివృద్ధికి సబ్ ప్లాప్ చట్టం తీసుకురావాలని, కులాంతర వివాహితుల రక్షణకు ప్రత్యేక చట్టం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కె. చంద్రన్న, కృపసాగర్, శ్రీరాంనాయక్ తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా మానేస్తే జీవనోపాధి

● **రూ.157 కోట్లతో పునరావాసం**

● **కాంగ్రెస్, టిడిపిలు లంచాలకే పరిమితమయ్యారు : హరీశ్‌రావు**





మన తెలంగాణ/సంగారెడ్డి : రాష్ట్రంలో ప్రతి ఒక్కరు జీవనోపాధి కలిగి సంతోషంగా ఉండాలన్నదే రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్ ఉద్దేశ్యమని, గతంలో పాలించిన టిడిపి, కాంగ్రెస్ ప్రభుత్వాలు లంచాలకే పరిమితమై పేదల ప్రజలను దోచుకున్నారని భారీ నీటిపారుదలశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఆరోపించారు. గురువారం జిల్లా కేంద్రం సంగారెడ్డిలో ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యే చింతాప్రభాకర్ అధ్యక్షతన గుడుంబా నిర్మూలన పునరావాస పథకం కింద ఆస్తుల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక గుడుంబా తయారీని మాన్పించి దానిపై ఆధార పడ్డ 7786 మంది కుటుంబాలకు ఆసరాగా ఉండేందుకు రూ.157 కోట్ల నిధులతో పునరావాసాన్ని ఏర్పాటు చేసిన ఘనత ఒక్క కెసిఆర్‌కే దక్కిందన్నారు. ఒక్క సంగారెడ్డి జిల్లాలోనే 165 గుడుంబా తయారు మానేసిన కుటుంబాలకు పునరావాసం కింద రూ.3.30 కోట్లతో వివిధ రకాల జీవనోపాధి మార్గాలు చూపించడం జరిగిందన్నారు. గత ప్రభుత్వాలు కేసులు పెట్టడం జైలుకు పంపడం చేసాయే తప్ప పూర్తిస్థాయిలో గుడుంబా తయారీని మాన్పించలేదన్నారు. ప్రస్తుత టిఆర్ఎస్ ప్రభుత్వంలో గుడుంబా మానిపించడం తోపాటు కుటుంబానికి రూ.2లక్షల చొప్పున కేటాయిస్తూ వారికి కిరాణా దుకాణాలు, టెంట్‌హౌస్, బర్రెలు, గొర్రెలు, ఆటోలు తదితర వాటిని ఇప్పించి వారి మనుగడకు పునాదులు వేసిందన్నారు. కేవలం ఒక్క సంవత్సరం క్రితం తయారీ మానేసిన వారికే ప్రస్తుతం పునరావాసం కల్పించడం జరిగిందని, గతంలోనే మానేసిన వారిని కూడా జాబితా తయారు చేసి తనకు పంపించాలని సూచించారు. ఈ విషయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్‌తో చర్చించి వారికి కూడా పునరావాసం కింద లబ్ధిచేకూరేలా చూస్తామన్నారు. కల్తీపై రాష్ట్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపి ఎక్కడికక్కడ నిర్మూలన చర్యలు చేపట్టిందని, ఎవరైన కల్తీకి, మోసాలకు పాల్పడితే పీడీయాక్ట్ పెట్టి చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని సూచించారు. కల్తీ లేని తెలంగాణను తయారుచేయడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని పేర్కొన్నారు. అంతకుముందు స్థానిక ఎమ్మెల్యే చింతాప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో కెసిఆర్ ప్రభుత్వం సంక్షేమ పథకాలను దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రవేశపెట్టి ప్రథమ స్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. సంగారెడ్డి నియోజకవర్గంలో 2015లోనే 90శాతం గుడుంబా మహమ్మారిని అరికట్టడం జరిగిందని, అనంతరం వందశాతానికి పూర్తిగా నిర్మూలించి రాష్ట్రంలోనే మొదటిస్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం చేపట్టిన సిఐ లక్ష్మణ్ గౌడ్‌ను ప్రత్యకంగా అభినందించారు. అనంతరం ఎమ్మెల్సీలు రాములునాయక్, భూపాల్‌రెడ్డి, ఎంపి ప్రభాకర్‌రెడ్డిలు మాట్లాడారు. అనంతరం గుడుంబా తయారీమానేసిన కుటుంబాల చేత ప్రతిజ్ఞ, ప్రమాణం చేయించారు. లబ్ధిదారులకు పునరావాస పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ రాజమణీమురళీయాదవ్, ఎంపి బిబి పాటిల్, ఎమ్మెల్యేలు భూపాల్‌రెడ్డి, బాబుమోహన్, జిల్లా డిప్యూటీ కమిషనర్ కెఎబి శాస్త్రి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ చంద్రయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ బొంగుల విజయలక్ష్మీ రవి, స్త్రీ, శిశుసంక్షేమ శాఖ కోఆర్డినేటర్ లక్ష్మీ, జిల్లా గ్రంథాలయ చైర్మన్ నరహరిరెడ్డి, సిడిసి చైర్మన్ విజయేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కొండల్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఆర్.సత్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షుడు ప్రభాకర్, అశోక్, పట్టణ కార్యదర్శి నర్సింలు, రామిరెడ్డి, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

గౌడన్నలను సతాయించొద్దు

మన తెలంగాణ/సంగారెడ్డి : ఎక్సైజ్ అధికారులు గౌడ్‌లను కేసుల పేరిట సతాయించొద్దు.... కేసులు కాదు వారికి ఈత చెట్లు నాటి వారి అభివృద్ధికి తోడ్పడాలని రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు ఎక్సైజ్ అధికారులను ఆదేశించారు. గురువారం సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని పాత డిఆర్‌డిఎ కార్యాలయంలో గుడుంబా నిర్మూలనపునరావాస పథకం కింద ఆస్థుల పంపిణీ కార్యక్రమాన్నినిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ గౌడ్‌లపై అనవసరంగా కేసులు పెట్టొద్దని, టిఎఫ్‌టి లైసెన్సుల మంజూరీలో ఇబ్బందులకు గురి చేస్తున్నారని తనకు ఫిర్యాదులు వచ్చాయని, ఇబ్బందులకు గురిచేయడం మానుకోవాలని అధికారులకు సూచిం చారు. సొసైటీలతో సమావేశాలు ఏర్పాటుచేయాలని, ఈత మొక్కలను నాటడానికి కృషి చేయాలన్నారు. ప్రతి గ్రామానికి ఒక్క కానిస్టేబుల్‌ను ఇన్‌ఛార్జీలుగా చేసి అక్కడ చెట్లు నాటాలన్నారు. పది గ్రామాలకు ఓ ఎస్ఐని బాధ్యున్ని చేస్తూ పూర్తి మండలంలో ఎన్ని మొక్కలను నాటారో ప్రతివారం తనకు నివేదిక పంపాలన్నారు. ఎక్సైజ్ అధికారులు గౌడ్‌లపై అక్రమంగా కేసులు పెడుతూ ఇబ్బందులకు గురిచేయడం తగదన్నారు. ఇకపై ఎక్కడ కూడా గౌడ్‌లపై కేసులు పెట్టకూడదని, కల్తీని నివారించడానికి ప్రభుత్వం పిడి యాక్ట్‌ను కూడా పెట్టేందుకు వెనకాడదన్నారు. జిల్లా కలెక్టర్ సహకారంతో జిల్లాలో ఈత వనాలను పెంచి కల్తీ కల్లు లేకుండా చూడాలన్నారు. గ్రామంలో ఎక్కడ ఖాళీ స్థలం ఉంటే తప్పకుండా ఈత చెట్లు పెంచాలన్నారు. ఈత మొక్కలు నాటేందుకు అవసరమైన బోరుమోటారు, 90 శాతం సబ్సిడీపై డ్రిప్పు పరికరాలు అందజేస్తామన్నారు. గీత కార్మికులను కాపాడదాం.. కల్తీ కల్లును పారద్రోలుదాం అనే నినాదంతో ముందుకు సాగుదామన్నారు.

ఎన్‌హెచ్ఎఐ అధికారులపై విచారణ

న్యూఢిల్లీ: ఓ అమెరికా సంస్థ నుంచి జాతీయ రహదారి అభివృద్ధి సంస్థ (ఎన్‌హెచ్ఎఐ) అధికారులు లంచం తీసుకున్నారనే ఆరోపణలపై విచారణ ప్రారంభించినట్లు గురువారం ప్రభుత్వం తెలిపింది. ఎన్‌హెచ్ఎఐ అధికారులు అమెరికాకు చెందిన ఎం/ఎస్ సిడిఎం స్మిత్ సంస్థ ఉద్యోగులు, ఏజెంట్ల ద్వారా దాదాపు 1.18 మిలియన్ అమెరికన్ డాలర్లు లంచం తీసుకున్నారని మీడియా కథనం వచ్చినట్లు కేంద్ర రోడ్డు రవాణా, రహదారి శాఖ మంత్రి నితిన్ గడ్కరీ లోక్‌సభకు తెలిపారు. జాతీయ రహదారి పర్యవేక్షణ, డిజైన్ కాంట్రాక్టు కోసం లంచాలు తీసుకున్నట్లు ఆ కథనం వెల్లడించిందన్నారు. అవినీతి ఆరోపణలను ధ్రువ పరిచే పత్రాలు కోసం అమెరికా న్యాయ శాఖ, భారత రాయబార కార్యాలయాన్ని కోరినట్లు తెలిపారు. 2015లో అమెరికా సంస్థ పనుల్లో నాణ్యత లోపం ఉండటంతో మూడు నెలలపాటు ఎన్‌హెచ్ఎఐ నిషేధం విధించినట్లు తెలిపారు. ఈ అంశానికి సంబంధించి సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ ముగ్గురు సభ్యులతో కూడిన విచారణ కమిటీని నియమించిందని గడ్కరీ తెలిపారు.

రైలు సర్వీసులకు నక్సలైట్ల అంతరాయం

లాఖీ సరాయ్: బీహార్‌లో రెండు రైల్వే లైన్ల మధ్య నడిచే రైలు సర్వీసులకు నక్సలైట్లు అంతరాయం కలిగించారు. జిల్లాలో నక్సలైట్లు చేపట్టిన 'షహాదత్ సప్తా' లో భాగంగా వారంరోజులుగా కొనసాగుతున్న నిరసన గురువారంతో ముగియనున్న నేపథ్యంలో ఇద్దరు రైలు క్యాబిన్ సిబ్బందిని కిడ్నాప్ చేసినట్టు పోలీసులు వెల్లడించారు. దీంతో బుధవారం అర్థరాత్రి కియిల్‌ఘూఘా రైలు విభాగం, కియిల్ జమల్‌పూర్ రైలు విభాగం మధ్య నడిచే రైలు సర్వీసులు నిలిచిపోగా, గురువారం ఉదయం రెండు మార్గాల్లో రైలు సర్వీసులను పునరద్ధరించినట్టు అధికారులు పేర్కొన్నారు. ఎఎస్‌పి పవన్ కుమార్ మాట్లాడుతూ.. కియిల్‌ఘూఘా రైలు సెక్షన్‌లో గోపాల్‌పూర్ రైల్వే హాల్ట్‌కు చెందిన క్యాబిన్ వ్యక్తిని కిడ్నాప్ చేసిన నక్సల్స్ రైల్వే సర్వీసులను నిలివేయాల్సిందిగా బెదిరించారని చెప్పారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక వసతులు

● **వందల కోట్లు కేటాయింపు : లక్ష్మారెడ్డి**

మన తెలంగాణ/హైదరాబాద్/గోషామహల్ : రాష్ట్ర వ్యాప్తంగా గల అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక వసతులు కల్పించి పేద రోగులకు ఉచితంగా కార్పొరేట్‌కు ధీటైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు వందల కోట్ల నిధులను కేటాయి స్తున్నారని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సి.లక్ష్మా రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యసేవలపై విశ్వాసం పెరిగిందని. అందుకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో పెరుగుతున్న రోగుల సంఖ్యే నిదర్శనమని మంత్రి పేర్కొన్నారు. కోఠి ఈఎన్‌టీ ఆసుపత్రిలో గోల్డెన్‌జూబ్లీ బ్లాక్‌ను మంత్రి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. అంతకుముందు వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి రాజేశ్వర్‌తివారి, ఎమ్మెల్యే రాజాసింగ్, టిఎస్ఎంఎస్ ఐడిసి ఛైర్మన్ పర్యాద కృష్ణమూర్తిల తో కలిసి నూతనంగా నిర్మించిన బ్లాక్‌లు, అందులో ఏర్పాటు చేసిన వైద్య పరికరాలు, వైద్య సిబ్బంది పని తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి పలువురు రోగులకు పరామర్శించి వారికి అందుతున్న వైద్యసేవల గురించి వాకబు చేశారు. డిప్యూటీ మేయర్ బాబా ఫసీయోద్దీన్, టిఎస్ఎంఎస్ఐడిసి ఎండి వేణుగోపాలరావు, సీఈ లక్ష్మారెడ్డి, డిఎంఈ డాక్టర్ రమేష్‌రెడ్డి, ఉస్మానియా వైద్య కళాశాల ప్రిన్సిపల్ అరుణా రామయ్య, టిజిడిఎ అధ్యక్షులు డాక్టర్ పుట్ల శ్రీనివాస్, సెక్రటరీ జనరల్ డాక్టర్ రవిశంకర్, కోశాధికారి లాలూప్రసాద్ రాథోడ్, ఆర్ఎంవో డాక్టక్ మనీష్, డాక్టర్ శోభన్‌బాబు, రాజు, సుజాత, రాజేందర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో పెరిగిన ప్రసవాలు

మన తెలంగాణ / హైదరాబాద్ : ప్రభుత్వ హాస్పిటల్స్‌లో గత ఆరు నెలల్లో ప్రసవాల సంఖ్య గణనీయంగా 30 నుండి 41 శాతానికి పెరి గిందని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి డా. లక్ష్మారెడ్డి అన్నారు. మారు మూల ఆదిలాబాద్ జిల్లాలో 82 శాతం, అత్యల్పంగా మేడ్చల్‌లో 5 శాతంగా నమోదైనట్లు మంత్రి వెల్లడించారు. రానున్న ఆరు నెలల్లో 50 శాతం నమోదు చేసుకోవాలన్నారు. వైద్యాధికారులు సమీక్షించు కుంటు సత్ఫలితాలు సాధించాలని డా. లక్ష్మారెడ్డి సూచించారు.

అమల్లోకి 'రెరా'

● **రియల్టర్లకు ముకుతాడు, మోసాలకు చెల్లుచీటి**

మన తెలంగాణ/హైదరాబాద్ సిటీబ్యూరో : రియల్టర్ల ఇష్టారాజ్యంగా వ్యవహరించేందుకు వీలులేని రోజులు వచ్చాయి. రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ యాక్ట్(రెరా)తో వినియోగదారులకు రక్షణగా ఉండనుంది. కేంద్ర ప్రభుత్వం రెరాను తీసుకొచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం కూడా రెరా అమలు కోసం గురు వారం జిఓ 202ను విడుదల చేసింది. ఈ సంవత్సరం జనవరి నెల నుంచి భవన నిర్మాణ అనుమతుల కోసం వచ్చిన ప్రాజెక్ట్‌లు రెరా పరిధిలోకి వస్తాయి. అంటే జనవరి మాసం నుంచి ఈ చట్టం అమలవుతుంది. రెరా అమలోకి రావడంతో వినియోగదారుల నిశ్చితంగా లావాదేవిలు జరిపేందుకు అవకాశాలు ఏర్పడ్డాయి. భవన నిర్మాణ అనుమతులు తీసుకున్న అనంతరం ప్లాన్ ప్రకారం నిర్మించకపోవడం, నిబంధనలను ఉల్లఘించడం, కొనుగోలుదారులతో కుదుర్చుకున్న ఒప్పందాలకు కట్టుబడకపోవడం, డబ్బులు తీసుకొని నిర్ణిత సమయంలోగా నిర్మించకపోవడం లాంటివి ఇక సాధ్యం కావు. నాణ్యత ప్రమాణాలు పాటించకపోతే బిల్డర్‌కు జరిమానాతో పాటు మూడేళ్ల జైలు శిక్ష విధించే అవకాశం ఉంది. ఈ చట్టం వల్ల బిల్డర్ల మోసాల నుంచి వినియోగదారులు చిక్కుకోకుండా ఉంటుంది. ఇక రియల్టర్లు కూడా బాధ్యతయుతంగా వ్యాపారం చేసుకోవాల్సిన పరిస్థితులు ఉంటాయి. రియల్ రంగంలో అనేక అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ అక్రమాలకు కేంద్ర ప్రభుత్వం చెక్ పెడుతూ రెరా చట్టాన్ని తీసుకొచ్చింది. ఈ చట్టానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలను ఉత్తర్వుల ద్వారా ఇచ్చింది. అక్రమ లేఅవుట్లు ఏర్పాటు చేయడం, అనుమతులు తీసుకున్నాక నిబంధనల ప్రకారం నిర్మించకపోవడం లాంటివి జరుగుతున్నాయి. వినియోగదారులతో ముందుగా చేసుకున్న ఒప్పందాలను పాటించ కూడా ఇష్టారాజ్యంగా వ్యవహరించేవారు. రెరా చట్టం వినియోగదారులకు పూర్తి స్థాయిలో రక్షణ కల్పిస్తుంది. రెరా చట్టం ప్రకారం కొత్తగా ఏర్పాటు చేసే లేఅవుట్లు, 500 చదరపు మీటర్ల కన్నా ఎక్కువ వైశాల్యంలో నిర్మించే అపార్ట్‌మెంట్లు, రాష్ట్ర రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీలో నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. దీనికోసం రాష్ట్ర ప్రభుత్వం ఉన్నతాధికారులతో ఈ అథారిటీని ఏర్పాటు చేస్తుంది. డెవలపర్లు, సంబంధిత ప్రాజెక్ట్ కోసం ప్రత్యేకంగా బ్యాంకు ఖాతా తెరవాల్సి ఉంటుంది. కొనుగోలుదారుల నుంచి వచ్చే మొత్తాలలో 70 శాతం ఆ ప్రాజెక్ట్ కోసం వినియోగించాల్సి ఉంటుంది. ఒప్పందం ప్రకారం గడువులోగా ప్రాజెక్టును పూర్తి చేయాలి. నిధులను ఇతర ప్రాజెక్ట్‌లకు మళ్లిస్తే అథారిటీ సదరు డెవలపర్‌కు జరిమానా విధించే ఆస్కారం ఉంటుంది. అన్ని రకాల అనుమతులు పొందిన తరువాతే నిర్మాణాలు ప్రారం భించాల్సి ఉంటుంది. అనుమతులు తుదిదశలో ఉన్నట్లు చెప్పితే డబ్బులు ఇచ్చిన తరువాత మోసం చేస్తే జరిమానా విధిస్తారు. నిర్మాణంలో ఏవైనా మార్పులు, చేర్పులు చేయాల్సివస్తే మూడింట రెండు వంతులు కొనుగోలుదారుల అమోదం తీసుకోవాల్సిందే. వారి అనుమతి లేకుండా ఎటువంటి మార్పులూ చేయడానికి వీల్లేదు. ప్రాజెక్ట్ ముందు ప్రకటించిన గడువుకన్నా జాప్యమైనా, కొనుగోలుదారుల అనుమతి లేకుండా నిర్మాణంలో మార్పులు చేసినా డెవలపర్‌కు జరిమానా విధించడంతో పాటు మూడేళ్ల జైలు శిక్ష విధించేందుకు అవకాశం ఉంటుంది. నిర్మాణంలో ప్రతి ప్రక్రియ నమోదు చేయాల్సి ఉంటుంది. కొనుగోలుదారుడికి ఇంటిని అప్పగించిన అనంతరం ఐదేళ్లపాటు నిర్వహణ బాధ్యతలు బిల్డర్‌వే. ఒప్పందం ప్రకారం ఇంటిని నిర్మించకపోతే ఇచ్చిన డబ్బుకు రెండు శాతం వడ్డీ చెల్లించాలి. డెవలపర్ కార్పెట్ ఏరియాను మాత్రమే విక్రయించాల్సి ఉంటుంది. కామన్ ఏరియాను విక్రయించే అస్కారం లేదు.

రెరాతో ధైర్యంగా కొనుక్కోవచ్చు – సిటీచీఫ్ ప్లానర్

రెరా చట్టం అమలుతో ప్లాట్లు, ఇళ్ల కొనుగోళ్లలో అక్రమాలకు చోటు ఉందని జిహెచ్ఎంసి చీఫ్‌సిటీ ప్లానర్ ఎస్.దేవేందర్‌రెడ్డి అన్నారు. కొనుగోలుదారులు ధైర్యంగా కొనుగోలు చేసేందుకు అస్కారం ఉంటుందన్నారు. ఈ చట్టం భరోసా ఉంటుందన్నారు. డెవలపర్లు ఎలాంటి మోసాలకు పాల్పడిన కఠినమైన శిక్షలు ఉన్నాయన్నారు. ఈ చట్టం వల్ల మోసాలకు ముకుతాడు పడుతుందన్నారు. రియల్ ఎస్టేట్ రంగంలో మోసాలు ఘననీయంగా తగ్గిపోతాయని దేవేందర్‌రెడ్డి తెలిపారు.

ముగ్గురు రైతులు ఆత్మహత్య

● **వేర్వేరు ప్రాంతాల్లో ఘటనలు**



రామాయంపేటలో...



బజార్‌హత్నూర్‌లో...


మనతెలంగాణ/వికారాబాద్/రామాయంపేట/బజార్‌హత్నూర్ : వికారాబాద్ రూరల్ : అప్పుల బాధ భరించలేక మరో యువ రైతు బలవన్మరణం పొందిన సంఘటన బూరుగుపల్లిలో చోటు చేసుకుంది. బాధిత కుటుంబీకులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వికారాబాద్ మండలం బూరుగుపల్లి గ్రామానికి చెందిన గంగారం నర్సింహులు(28) వ్యవసాయం కోసం వడ్డీ వ్యాపారుల వద్ద రూ. 3.50లక్షల అప్పు తీసుకున్నాడు. దీంతో అప్పుల బాధలు భరించలేక గురువారం మధ్యా హ్నం ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో ఆ కుటుంబంలో విషాదం చోటు చేసుకుంది. ప్రభుత్వం ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. కాగా మెదక్ జిల్లా మరో రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాల్లోకి వెళ్తే... అప్పుల బాధ తాళలేక ఓరైతు తన వ్యవసాయ పొలంలోనే చెట్టుకు ఉరివేసుకుని మృతి చెందిన సంఘటన నిజాంపేట మండల తిప్పనగుల్లలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. నిజాంపేట ఎస్ఐ ఆంజనేయులు వివరాల ప్రకారం గ్రామానికి చెందిన బొమ్మ బాలమల్లయ్య (45) కుటంబ అవసరాల కోసం, వ్యవసాయం కోసం చేసిన అప్పులు పెరిగిపోవడంతో తీవ్రమనస్థాపం చెందిన బాలమల్లయ్య బుధవారం చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గురువారం ఉదయం స్థానిక రైతులు గమనించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. దీంతో ఆ ఇంట్లో విషాదం నెలకొంది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలను అడిగి తెలుసుకున్నారు. పంచనామా అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అంజనేయులు తెలిపారు. మరో ఘటన ఆదిలాబాద్ జిల్లా బజార్ హత్నూర్ మండలంలోని భూతాయి(కే) గ్రామ పంచాయతీ పరిధిలోని మాన్కపూర్ గ్రామానికి చెందిన యువరైతు బాంద్రే అమర్‌సింగ్(20) అప్పుల బాధతో బుధవారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కాగా వ్యవసాయం కోసం చేసిన అప్పులే కారణమని కుటుంబీకులు చెబుతూ కన్నీరుమున్నీరయ్యారు. స్థానిక ఎస్ఐఆకుల శ్రీనాథ్ బాంద్రే అమర్‌సింగ్ ఆత్మహత్యపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో రైతు దుర్మరణం

మన తెలంగాణ/కట్టంగూర్ : లారీ ఢీకొని, రైతు దుర్మరణం పాలయ్యాడు. ఈ విషాద ఘటన మండ లంలోని అయిటిపాముల గ్రామ శివారులో గురువారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. ఎస్సై బి. రంజిత్ తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని అయిటిపాముల గ్రామానికి చెందిన పాపట్ల శ్రీనివాసరెడ్డి రోజు మాదిరిగానే ఉదయాన్నే గ్రామ శివారులోని విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలో ఉన్న తన వ్యవసాయ బావి వద్దకు వెళ్లి, ఇంటికి వెళ్లే క్రమంలో 65వ జాతీయ రహదారి రోడ్డు ఎక్కుతుండగా, విజయవాడ నుండి హైదరాబాద్ వైపు వేళ్లే ఏపి16టియు4072 నెంబర్ గల లారీ వెనుక నుంచి ఢీకొట్టడంతో కాళ్లు, చేతులు విరగడంతోపాటు తలకు తీవ్రగాయాలు కాగా, అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి, పంచనామా నిర్వహించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పోస్టుమార్టం నిమిత్తం శ్రీనివాసరెడ్డి మృతదేహాన్ని నకిరేకల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రైతు కుటుంబాలకు ఆర్థిక సాయం

తమిళ్ స్టార్ ధనుష్ తాజాగా ఓ మంచి పనితో వార్తల్లోకి ఎక్కాడు. తమిళ నాట అప్పుల బాధతో, అనారోగ్యంతో ప్రాణాలు విడిచిన రైతుల కుటుంబాన్ని ఆదుకోవడానికి ఈ కథానాయకుడు ముందుకొచ్చాడు. తమిళనాడు తేని జిల్లాలోని శంకరాపురం గ్రామం ధనుష్ తల్లికి స్వస్థలం. ఆ ఊరులో ధనుష్ కుటుంబానికి కుల దైవమైన కరుప్ప స్వామి ఆలయం కూడా ఉంది. ప్రతి ఏటా తన కుటుంబ సభ్యులతో కలిసి అక్కడికి వెళ్లడం అతనికి అలవాటు. ఈసారి కూడా భార్య ఐశ్వర్యతో పాటు తల్లిదండ్రులు, పిల్లల్ని వెంటబెట్టుకొని అక్కడికి వెళ్లాడు ధనుష్. అయితే వెళ్లే ముందే అక్కడ ఆత్మహత్యలు చేసుకున్న, అనారోగ్యంతో చనిపోయిన రైతుల కుటుంబాల్ని ఆదుకోవడానికి సన్నాహాలు చేసుకున్నాడు. మొత్తం 250 మంది రైతుల కుటుంబాల్ని ఆదుకోవాలని నిర్ణయించుకున్న ధనుష్ ముందుగా తొలి విడతగా 125 కుటుంబాలకు ఆర్థిక సాయం అందించాడు. ఒక్కో కుటుంబానికి రూ.50 వేల చొప్పున అతను అందజేశాడు. ఇలా తొలి విడతలో రూ.63 లక్షల దాకా రైతు కుటుంబాలకు అందజేసి తన మానవతా దృక్పథాన్ని చాటుకున్నాడు. మరో విడుతలో మరో 125 కుటుంబాలకు ఆర్థిక సాయం చేయనున్నాడు ధనుష్. అన్నం పెట్టే రైతులు వివిధ కారణాలతో ఆత్మహత్యలు చేసుకోవడం తనను కలచివేస్తోందని... వారికి తన వంతుగా సాయం అందించాలని నిర్ణయించుకున్నానని ధనుష్ తెలిపాడు.



బాలకృష్ణ 102వ చిత్రం ప్రారంభం



నందమూరి బాలకృష్ణ 102వ చిత్రం గురువారం హైదరాబాద్‌లోని రామోజీ ఫిలిం సిటీలో ప్రారంభమైంది. సి.కె. ఎంటర్‌టైన్‌మెంట్స్ ప్రై.లి. బ్యానర్‌పై కె.ఎస్.రవికుమార్ దర్శకత్వంలో సి.కల్యాణ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ముహూర్తపు సన్నివేశానికి బోయపాటి శ్రీను క్లాప్ కొట్టగా... బి.గోపాల్ కెమెరా స్విచ్చాన్ చేశారు. తొలి సన్నివేశానికి క్రిష్ గౌరవ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా దర్శకుడు కె.ఎస్.రవికుమార్ మాట్లాడుతూ ''18 సంవత్సరాల తర్వాత తెలుగులో నేను డైరెక్ట్ చేస్తున్న సినిమా ఇది. అది కూడా బాలకృష్ణతో చేయడం ఆనందంగా ఉంది. బాలయ్యతో తొలి సారి చేస్తున్న సినిమా ఇది. నిర్మాత సి.కల్యాణ్, ఆయన తమ్ముడు వెంకటేశ్వరరావు ఈ సినిమాను రూపొందిస్తున్నారు. సినిమా ప్రారంభానికి ముందుగానే సినిమా బిగ్ హిట్ అని భావిస్తున్నాను. రత్నం చెప్పిన కథ నాకు, బాలకృష్ణకు, సి.కల్యాణ్‌కు నచ్చడంతో ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నాను''అని అన్నారు. సి.కల్యాణ్ మాట్లాడుతూ ''బాలకృష్ణ 101వ సినిమా ఇదే కావాల్సింది. కానీ కె.ఎస్.రవికుమార్ బిజీగా ఉండటంతో బాలకృష్ణ 101వ చిత్రాన్ని పూరీతో చేశారు. పూరి దర్శకత్వంలో 'పైసా వసూల్' అద్భుతంగా తెరకెక్కింది. ఇక తన 102వ సినిమాను బాలకృష్ణ మా బ్యానర్‌లో చేస్తుండడం సంతోషంగా ఉంది. కె.ఎస్.రవికుమార్ సినిమాలు ఎంత పెద్ద హిట్స్ అయ్యాయో తెలిసింది. ఆయనకు 95 శాతం సక్సెస్ ఉంది. ఆయనకు సినిమాలు తప్ప వేరే ఆలోచన ఉండదు. ముందుగా ఏవో కథలు అనుకున్నాం. కానీ చివరకు గుర్తుండిపోయే సినిమా కావాలనిపించింది. అప్పుడు రత్నం 15 నిమిషాల్లో చెప్పిన కథ బాగా నచ్చడంతో ఈ సినిమా చేద్దామని నిర్ణయించుకున్నాం. రవికుమార్‌కు స్టోరీ లైన్ చెప్పగానే ఆయన కూడా వెంటనే స్పందించి రత్నంతో మాట్లాడి కథ విని ఓకే చేశారు. తర్వాత బాలకృష్ణ దగ్గరకు వెళ్లి కథ చెప్పగా ఆయనకు కూడా నచ్చింది. సాధారణంగా బాలకృష్ణ సినిమా అంటే మాస్‌తో పాటు గుండెను పిండేసే ప్రేమాభిమానాలు, సెంటిమెంట్ ఉండాలి. అలాంటి తరహా కథతో ముందుకెళ్తున్నాం. ఇదివరకే బాలకృష్ణ, నయనతార హిట్ కాంబినేషన్‌లో రెండు సినిమాలు ఘన విజయాన్ని సాధించాయి. ఇప్పుడు ఈ సినిమాతో ఇద్దరూ హ్యాట్రిక్ హిట్స్ కొడతారు. అలాగే మరో ఇద్దరు హీరోయిన్లు కూడా సినిమాలో ఉంటారు. ప్రకాష్‌రాజ్ చాలా గొప్ప క్యారెక్టర్ చేస్తున్నారు. ఇంకా అశుతోష్ రాణా, అథర్ చీమా పవర్‌ఫుల్ క్యారెక్టర్స్ చేస్తున్నారు. బ్రహ్మానందం ఎంటర్‌టైనింగ్ రోల్ చేస్తున్నారు. ఈ చిత్రానికి చిరంతన్ భట్ సంగీతమందిస్తున్నారు. గురువారం నుండి ఈ నెలాఖరు వరకు రామోజీ ఫిలింసిటీలో షూటింగ్ జరుగుతుంది. వచ్చే నెల 6 నుండి కుంభకోణంలో షూటింగ్ ఉంటుంది. అక్కడి నుండి వచ్చిన తర్వాత వైజాగ్, హైదరాబాద్‌లో షూటింగ్ జరుగుతుంది. తర్వాత పాటల చిత్రీకరణతో షూటింగ్ పూర్తిచేస్తాం. సంక్రాంతికి బాలకృష్ణ ఎలాగైతే సందడి చేస్తారో... అలాగే 2018 సంక్రాంతికి ఈ సినిమాను రిలీజ్ చేయడానికి ప్లాన్ చేశాం''అని తెలిపారు. రచయిత రత్నం మాట్లాడుతూ ''ముందుగా ఎన్నో కథలు అనుకున్నాం. కానీ చివరకు బాలకృష్ణకు నేను 15 నిమిషాలు చెప్పిన కథ నచ్చింది. రవికుమార్ కథ వినగానే ఈ సినిమా చేద్దామన్నారు. అద్భుతమైన సినిమా ఇదవుతుంది''అని చెప్పారు. మురళీమోహన్, ప్రభాకర్, శివపార్వతి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి ఆర్ట్: పి.నారాయణరెడ్డి, ఎడిటర్: ప్రవీణ్ ఆంథోని, యాక్షన్: అన్బరివు, సినిమాటోగ్రఫీ: సి.రాంప్రసాద్.



బాలకృష్ణ కొత్త చిత్రం ప్రారంభోత్సవ కార్యక్రమంలో బోయపాటి శ్రీను, క్రిష్, ఎస్‌వి కృష్ణారెడ్డి, బి.గోపాల్, కె.ఎస్.రవికుమార్, సి.కల్యాణ్ తదితరులు



మేఘా ఆకాష్, నితిన్

రేపు 'లై' ప్రీ రిలీజ్ ఫంక్షన్

నితిన్ హీరోగా వెంకట్ బోయనపల్లి సమర్పణలో 14 రీల్స్ ఎంటర్‌టైన్‌మెంట్ ప్రై. లిమిటెడ్ పతాకంపై హను రాఘవపూడి దర్శకత్వంలో రామ్ ఆచంట, గోపీ ఆచంట, అనిల్ సుంకర నిర్మిస్తున్న భారీ చిత్రం 'లై'. ఈ చిత్రం ఆగస్టు 11న ప్రపంచవ్యాప్తంగా విడుదలకానుంది. ఈ చిత్రం ప్రీ రిలీజ్ ఫంక్షన్ శనివారం సాయంత్రం 6 గంటలకు హైదరాబాద్‌లోని జెఆర్‌సి కన్వెన్షన్ సెంటర్‌లో జరుగనుంది. ఈ సందర్భంగా నిర్మాతలు రామ్ ఆచంట, గోపీ ఆచంట, అనిల్ సుంకర మాట్లాడుతూ ''యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న 'లై' ప్రీ రిలీజ్ ఫంక్షన్‌ను శనివారం గ్రాండ్‌గా నిర్వహించబోతున్నాం. ఈనెల 11న ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ చేస్తున్నాం. నితిన్ కెరీర్‌లోనే హయ్యస్ట్ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ చిత్రం పెద్ద హిట్ అయి మా బ్యానర్‌కు మంచి పేరు తెస్తుందని ఆశిస్తున్నాం''అని అన్నారు. నితిన్, మేఘా ఆకాష్, అర్జున్, శ్రీరామ్, రవికిషన్, పృథ్వీ, బ్రహ్మాజీ తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: యువరాజ్, సంగీతం: మణిశర్మ, ఎడిటింగ్: ఎస్.ఆర్.శేఖర్, డ్యాన్స్: రాజు సుందరం, ఫైట్స్: కిచ్చా, పాటలు: కృష్ణకాంత్.

జోగేంద్ర పాత్రలో ఎన్‌టిఆర్, ఎంజిఆర్ ఫిలాసఫీలు



'జోగేంద్ర యువ గర్జన' కార్యక్రమంలో డి.సురేష్‌బాబు, రానా, కాజల్ అగర్వాల్, కేథరిన్, తేజ, నవదీప్, అనూప్ రూబెన్స్ తదితరులు

రానా, కాజల్ అగర్వాల్, కేథరిన్ హీరోహీరోయిన్లుగా తేజ దర్శకత్వంలో సురేష్ ప్రొడక్షన్స్, బ్లూ ప్లానెట్ ఎంటర్‌టైన్‌మెంట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం 'నేనే రాజు నేనే మంత్రి'. అనూప్ రూబెన్స్ సంగీతాన్ని అందిస్తున్న ఈ చిత్రానికి సురేష్‌బాబు, ఎం.వి.కిరణ్ రెడ్డి, సి.భరత్ చౌదరి నిర్మాతలు. ఈనెల 11న విడుదలకానున్న ఈ చిత్రానికి సంబంధించిన 'జోగేంద్ర యువ గర్జన' కార్యక్రమం హైదరాబాద్‌లో జరిగింది. కార్యక్రమంలో రానా మాట్లాడుతూ ''సినిమాల పరంగా, వ్యక్తిగతంగా, జీవితపరంగా నందమూరి తారకరామారావు అంటే నాకు దేవుడులాంటివారు. ఎన్టీఆర్, ఎంజిఆర్ ఫిలాసఫీలు జోగేంద్ర అనే పాత్రలో ఉంటాయి. అందుకే నేను ఈ సినిమా చేశాను. ఎమోషనల్‌గా నాకు కనెక్ట్ అయిన సినిమా ఇది. సినిమా మీద తేజకున్న అవగాహన చాలా ఎక్కువ. ఇది జోగేంద్ర జీవిత చరిత్ర. అది రాయాలంటే జీవితంపై అవగాహన ఉండాలి. లేకుంటే రాయలేరు. వెంకటేష్ అభిమానులు నాకు తోడున్నారన్న ధైర్యంతోనే నేను అన్నీ చేస్తున్నా. ఇదే సపోర్ట్ ఇస్తే హాలీవుడ్ సినిమా కూడా చేస్తాను''అని అన్నారు. తేజ మాట్లాడుతూ ''రానాకు కథ చెప్పగానే నచ్చడంతో ఈ సినిమా చేశాం. రానా అంత పొడవుగా ఉన్న అమ్మాయి కావాలని కాజల్ దగ్గరకు వెళ్లాం. స్టైలిష్ క్యారెక్టర్ కోసం కేథరిన్‌ను తీసుకున్నాం. కొత్త వాళ్లతో సినిమా చేసి బోర్ కొట్టిందని పాత వాళ్లతో ఈ సినిమా తీశాను''అని చెప్పారు. కాజల్ మాట్లాడుతూ ''ఈ సినిమా నాకెంతో స్పెషల్ మూవీ. రానాతో నాకు ఎంత పరిచయం ఉన్నా నాకు జోగేంద్రగానే గుర్తుండిపోతాడు. సినిమాను ఎలా చూడాలో, ఎలా ప్రేమించాలో తేజ దగ్గర నేర్చుకున్నా''అని అన్నారు. కేథరిన్ మాట్లాడుతూ ''ఈ సినిమాకు పనిచేయడం చాలా ఆనందంగా ఉంది. ఇందులో నా పాత్ర పేరు దేవికారాణి. నా కెరీర్‌లో ఓ స్పెషల్ క్యారెక్టర్‌గా ఇది నిలిచిపోతుంది''అని తెలిపారు. డి.సురేష్‌బాబు మాట్లాడుతూ ''బాహుబలి తర్వాత రానా ఈ కథను ఓకే చేశాడు. రానా ఈ కథ విని సెట్ అవుతుందనుకున్నాడు. ఆ తర్వాత తేజ ఈ కథను చాలా బాగా తీర్చిదిద్దారు. రష్ చూసిన తర్వాత నిర్మాత కిరణ్ చాలా బావుందన్నారు. క్యారెక్టరైజేషన్ ఓరియెంటెడ్ పొలిటికల్ డ్రామా ఇది. రానా, కాజల్ చాలా బాగా చేశారు. కేథరిన్ చక్కగా నటించింది''అని అన్నారు. ఈ కార్యక్రమంలో నవదీప్, కిరణ్, భరత్ చౌదరి, పరుచూరి వెంకటేశ్వరరావు, పరుచూరి గోపాలకృష్ణ, తనికెళ్ల భరణి, జయప్రకాష్ రెడ్డి, లక్ష్మీ భూపాల్, వెంకట్, శివాజీరాజాతో పాటు చిత్ర యూనిట్‌యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.

మెగాస్టార్ మూవీలో సుదీప్

కన్నడ స్టార్ హీరో కిచ్చ సుదీప్ 'ఈగ' చిత్రంతో టాలీవుడ్‌లో మంచి పేరు తెచ్చుకున్నాడు. అనంతరం బాహుబలి చిత్రంలో తన అద్భుతమైన పర్‌ఫార్మెన్స్‌తో తెలుగు ప్రేక్షకులకు మరింత చేరువయ్యాడు. ప్రస్తుతం ఈ కన్నడ స్టార్‌కు తెలుగులో మంచి ఫాలోయింగ్ ఏర్పడింది. అయితే ఇప్పుడు సుదీప్ మరో తెలుగు సినిమాలో నటించబోతున్నాడని సమాచారం. అది కూడా చిరంజీవి కొత్త సినిమా 'ఉయ్యాలవాడ నరసింహారెడ్డి'లో అతను నటిస్తాడని తెలిసింది. కొణిదెల ప్రొడక్షన్స్‌పై రామ్‌చరణ్ భారీ బడ్జెట్‌తో ఈ సినిమాను నిర్మించనున్నాడు. ఈ సినిమాలో ఇప్పటికే అమితాబ్ వంటి బాలీవుడ్ బిగ్ స్టార్ భాగమవుతున్నాడని తెలిసింది. అలాగే స్టార్ బ్యూటీ నయనతార కూడా ఈ సినిమా కోసం సిద్ధమవుతోంది. ఇప్పుడు చిత్ర యూనిట్ ఓ ముఖ్యమైన పాత్ర కోసం సుదీప్‌తో సంప్రదింపులు జరుపగా అతను ఓకే అన్నట్లు తెలిసింది. ఈ కన్నడ స్టార్ ఈ మూవీలో నటిస్తే ఈ సినిమాకు మరింత క్రేజ్ రావడం ఖాయం.



ఘన విజయం దిశగా 'గౌతమ్ నంద'

గోపీచంద్, హన్సిక, కేథరిన్ హీరోహీరోయిన్లుగా సంపత్ నంది దర్శకత్వంలో శ్రీ బాలాజీ సినీ మీడియా పతాకంపై జె.భగవాన్, జె.పుల్లారావు నిర్మించిన స్టైలిష్ యాక్షన్ ఎంటర్‌టైనర్ చిత్రం 'గౌతమ్‌నంద'. భారీ బడ్జెట్‌తో విజువల్ ఫీస్ట్‌గా తెరకెక్కిన ఈ చిత్రం ఇటీవల విడుదలై సూపర్ హిట్ టాక్‌తో రన్ అవుతోంది. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ హైదరాబాద్‌లో సక్సెస్‌మీట్‌ను నిర్వహించింది. ఈ కార్యక్రమంలో గోపీచంద్, కేథరిన్, సంపత్‌నంది, భగవాన్, పుల్లారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దర్శకుడు సంపత్ నంది మాట్లాడుతూ ''ఇంతకుముందు నేను చేసిన అన్ని సినిమాల్లోకంటే కథగా నాకు ఎంతో సంతృప్తినిచ్చిన సినిమా ఇది. పాత కథే అయినా కొత్తగా చెప్పాలని ప్రయత్నించాను. ఎమోషనల్ సీన్స్, ట్విస్ట్‌లు మనసుకు హత్తుకునేలా ఉన్నాయని ప్రశంసిస్తున్నారు. మౌత్ టాక్ రోజు రోజుకు పెరుగుతోంది. ఈ సినిమాను సక్సెస్ చేసిన ప్రతి ఒక్కరికీ చాలా థాంక్స్''అని అన్నారు. గోపీచంద్ మాట్లాడుతూ ''నేను చేసిన అన్ని సినిమాల్లో కంటే హయ్యస్ట్ కలెక్షన్స్ ఈ సినిమాకు వచ్చాయి. ఒక మంచి కథతో ఈ సినిమా చేశాం. చాలా రోజుల తర్వాత పర్‌ఫార్మెన్స్‌కు స్కోప్ ఉన్న పాత్రలో నటించాను. ఎమోషన్ సీన్స్, యాక్షన్ సీన్స్‌కు ఎక్కువ స్పందన వస్తోంది''అని చెప్పారు. జె.పుల్లారావు మాట్లాడుతూ ''సినిమా విడుదలైన రోజు నుంచి యునానిమస్ హిట్ టాక్‌తో చాలా అద్భుతంగా ఆడుతోంది. రిలీజైన ప్రతి సెంటర్ నుండి మా చిత్రం చాలా బాగుందని మిత్రులు, శ్రేయోభిలాషులు ఫోన్ చేసి ప్రశంసిస్తున్నారు''అని తెలిపారు. జె.భగవా న్ మాట్లాడుతూ ''మా చిత్రం ఆరు రోజులకుగాను 22 కోట్ల 25 లక్షల 47 వేల 433 రూపాయలు కలెక్ట్ చేసింది. రోజు రోజుకు సినిమా కలెక్షన్లు పెరుగుతూ సినిమా కొన్న వారందరికీ మంచి లాభాలను తెస్తోంది''అని అన్నారు. కేథరిన్ మాట్లాడుతూ ''బ్యూటిఫుల్ విజువల్స్‌తో ఎంతో స్టైలిష్ ఎంటర్‌టైనర్‌గా సంపత్ నంది ఈ సినిమాను రూపొందించారు. ఇంత మంచి సినిమాలో నేను ఒక భాగమైనందుకు చాలా హ్యాపీగా ఉంది''అని తెలిపారు.



సంపత్ నంది, గోపీచంద్, కేథరిన్, జె.భగవాన్, జె.పుల్లారావు




సంతోషం అవార్డుల కర్టెన్ రైజర్ కార్యక్రమంలో ఆది, రెజీనా, హెబ్బా పటేల్, సురేష్ కొండేటి తదితరులు

12న సంతోషం అవార్డుల వేడుక

'సంతోషం' సౌతిండియా ఫిల్మ్ అవార్డుల వేడుక ప్రతి ఏడాది ఘనంగా జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈసారి ఈనెల 12న హైదరాబాద్ గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో 16వ సంతోషం అవార్డుల వేడుకను నిర్వహించడానికి ముహూర్తం కుదిర్చారు. దీనికి సంబంధించిన కర్టెన్ రైజర్ ఫంక్షన్ హైదరాబాద్‌లోని ఎఫ్ఎన్‌సిసిలో జరిగింది. కార్యక్రమంలో అవార్డులకు సంబంధించిన లోగోను 'మా' అధ్యక్షుడు శివాజీరాజా, హీరోయిన్ రెజీనా లాంచ్ చేశారు. అలాగే 'సంతోషం' తొలి ఆహ్వాన పత్రికను శివాజీరాజా... రెజీనాకు అందించారు. ఈ కార్యక్రమంలో కె.ఎస్.రామారావు, ఆది, హెబ్బాపటేల్, ఏడిద శ్రీరామ్, సీనియర్ పాత్రికేయులు వినాయకరావు, జర్నలిస్టు ప్రభు, మహేష్ కొండేటి, లక్ష్మి కొండేటి తదితరులు పాల్గొన్నారు. ఇదే వేదికపై సురేష్ కొండేటి కుమార్తె లక్ష్మి కొండేటి పుట్టిన రోజు వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివాజీ రాజా మాట్లాడుతూ ''సంతోషం అవార్డ్స్ అంటే తెలుగు సినిమా ఇండస్ట్రీ అంతా కదిలి వస్తుందంటే కారణం సురేష్ చిరునవ్వే. దిగ్విజయంగా 15 ఏళ్లు పూర్తిచేసుకొని ఇప్పుడు సంతోషం 16 ఏళ్ల టీనేజ్ వయసులోకి అడుగు పెట్టేసింది''అని అన్నారు. ఆది మాట్లాడుతూ ''నా చిన్నప్పుడు మా నాన్నగారు సంతోషం అవార్డుతో ఇంటికొచ్చినప్పుడు ఇలాంటి అవార్డును ఎప్పటికైనా అందుకోవాలనే ఓ డ్రీమ్ ఉండేది. ఆ కల 'ప్రేమ కావాలి' సినిమాతో తీరింది. ఈ అవార్డుల వేడుక మరిన్ని సంవత్సరాల పాటు కొనసాగాలని కోరుకుంటున్నా''అని తెలిపారు. రెజీనా మాట్లాడుతూ ''సురేష్ కొండేటి ఎప్పుడు నన్ను కలిసినా సంతోషం అవార్డుల గురించే మాట్లాడతారు. ఆ సమయంలోనే ఆయనకు అవార్డుల పట్ల ఉన్న ప్యాషన్ ఎలాంటిదో అర్థమైంది. 25 ఏళ్ల పాటు ఈ అవార్డు వేడుకలను నిర్వహించాలని కోరుకుంటున్నా''అని పేర్కొన్నారు. సురేష్ కొండేటి మాట్లాడుతూ ''గత 15 ఏళ్ల నుంచి అంగరంగ వైభవంగా సంతోషం అవార్డుల వేడుకలు జరగడానికి కారణం తెలుగు సినిమా ఇండస్ట్రీనే. అసలు ఈ అవార్డుల కార్యక్రమం ప్రారంభించడానికి కారణం హీరో నాగార్జున. సంతోషం మ్యాగజైన్ ఓపెనింగ్ రోజున అవార్డులు కూడా ప్రదానం చేస్తే బాగుంటుందని ఆయన సలహా ఇవ్వడంతో ఇదంతా చేయగలిగాను. తర్వాత చిరంజీవి, బాలకృష్ణ, వెంకటేష్ నన్ను ఎంతగానో ప్రోత్సహించారు. ఈ ఏడాది ఈ వేడుకలను చాలా స్పెషల్‌గా ప్లాన్ చేశాం. ఆగస్టు 12న అత్యంత వైభవంగా ఈ వేడుకలను నిర్వహిస్తాం''అని అన్నారు.


రాఖీ సందర్భంగా బిఎస్ఎన్ఎల్ ఆఫర్



న్యూఢిల్లీ: రిలయన్స్ జియో నుంచి ఎదురవుతున్న పోటీ తగ్గట్టుగా బిఎస్ఎన్ఎల్ కూడా ఆఫర్ల మీదు ఆఫర్లు ప్రకటిస్తోంది. పండుగ సీజన్‌లో కస్టమర్లను మరింత ఆకట్టుకోవాలని సంస్థ ప్రయత్నిస్తోంది. పర్వదినం రాఖీ వేడుక సందర్భంగా వినియోగదారులకు బిఎస్ఎన్ఎల్ ప్రత్యేక ప్లాన్‌ను ప్రకటించింది. ప్రి పెయిడ్ విని యోగదారులకు 'రాఖీ పె సౌగత్' ప్లాన్‌ను ఆవిష్కరించింది. ఈ ఆఫర్ కింద రూ.74 కాంబో వోచర్‌తో 1 జిబి ఉచిత డాటా, అపరిమితి వాయిస్ కాల్స్‌ను అందివ్వనుంది. ఇది కేవలం తమ ప్రీపెయిడ్ కస్టమర్లకు, ఈ 74 రూపాయల టాక్ టైమ్ ఐదు రోజుల్లోనే ముగుస్తుంది. అయితే ఐదురోజుల పాటు అపరిమిత వాయిస్ కాల్స్ ఆన్ నెట్ ద్వారా తమ కస్టమర్లకు చేసుకోవచ్చు. టాక్ వాల్యుతో పాటు ఐదు రోజుల వరకు 1జిబి డాటాను యూజర్లు వాడుకోవచ్చు. ఆగస్టు3 నుంచి ఈ ఆఫర్ అందుబాటులోకి వస్తోందని బిఎస్ఎన్ఎల్ తెలిపింది. 12 రోజుల వరకు ఇది అందుబాటులో ఉంటుందని పేర్కొంది. ఇవే కాకుండా రూ.189, రూ.289, రూ.389లతో కొన్ని కొంబో ఆఫర్లను కూడా బిఎస్ఎన్ఎల్ లాంచ్‌చేసింది. ఈ ఆఫర్స్‌లో అదనంగా 18 శాతం టాక్ వాల్యు, 1జిబి డాటాను ఉచితంగా అందించనుంది. ఇటీవలే బిఎస్ఎన్ఎల్ తన ప్రీపెయిడ్ కస్టమర్ల కోసం 128జిబి డాటాతో 'సిక్సర్ 666' ప్యాక్‌ను లాంచ్ చేసింది.

మళ్లీ లుకలుకలు

• పనాయా పరిశోధన నివేదికలను బహిర్గతం చేయాలని డిమాండ్ • ఇన్ఫోసిస్ బోర్డు సభ్యులకు నారాయణ మూర్తి లేఖ



న్యూఢిల్లీ : ఇన్ఫోసిస్‌లో మళ్లీ అంతర్గత సంక్షోభం వైపు పరిస్థితులు దారితీస్తున్నాయా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. పరిశోధన నివేదికలను బహిర్గతం చేయాలని ఆయన డిమాండ్ చేస్తూ కంపెనీ వ్యవస్థాపకుడు ఎన్ఆర్ నారాయణ మూర్తి బోర్డుకు ఇటీవల ఓ ఇ–మెయి ల్ లేఖ పంపారు. మూర్తి సంబంధించిన వ్యక్తులు వెల్లడించినట్టు ఈమేరకు వెల్లడించారు. 200 మిలియన్ల పనాయా కొనుగోలు అక్రమాలపై మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ ఆరోపణలకు సంబంధించిన విచారణ నివేదికను బహిర్గతం చేయాలంటూ ఎన్ఆర్ నారాయణమూర్తి ఇటీవల బోర్డు సభ్యులకు రాసిన లేఖ రాశారు. దీంతో మళ్లీ వివాదాలు చెలరేగాయని సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి. 200 మిలియన్ డాలర్లతో కొనుగోలు చేసిన పనాయా విషయంలో అక్రమాలు చోటుచేసుకున్నాయని మార్కెట్ రెగ్యులేటరీ సెబీ ఆరోపించింది. సెబీ ఆరోపణలు, మాజీ సిఎఫ్ఒ రాజీవ్ బన్సాల్ సెవరెన్స్ ప్యాకేజీ, ప్రస్తుత సిఇఒ అత్యధికమైన వ్యయాల ఆరోపణల విషయంలోనూ కం పెనీ అంతర్గతంగా విచారణ చేపట్టింది. జూన్‌లోనే వీటిపై స్టేట్‌మెంట్‌ను ప్రచురించింది. పనాయా కేసు, సిఇఒ వ్యయాలు వంటి విషయంలో వచ్చిన ఆరోపణల్లో ఎలాంటి నిర్ధారణ లేదని గిబ్సన్ డన్ అండ్ క్రుచర్ అనే న్యాయ సంస్థ కూడా పేర్కొంది. అయితే ఈ నివేదికలను బహిరంగ పర్చాలని నారాయణమూర్తి డిమాండ్ చేస్తున్నారు.

కాగ్నిజంట్ లాభాలు 86 శాతం వృద్ధి



న్యూఢిల్లీ : అమెరికాకు చెందిన ఐటి దిగ్గజం కాగ్నిజంట్ నికర లాభం 86 శాతం వృద్ధిని సాధించింది. 2017 జూన్‌లో సంస్థ లాభం 470 మిలియన్ డాలర్లు నమోదు చేసింది. హెల్త్‌కేర్ వంటి విభాగాల్లో కంపెనీ పటిష్ఠమైన వృద్ధిని నమోదు చేసింది. 2016 ఏప్రిల్ – జూన్‌లో నికర లాభం రూ.252 మిలియన్ డాలర్లతో పోలిస్తే ఈసారి వృద్ధి పెద్దమొత్తంలో ఉంది. ఐటి సేవల సంస్థ రెవెన్యూ 3.67 బిలియన్ డాలర్లతో 8.9 శాతం పెరిగింది. రెండో త్రైమాసికంలో 3.63 – 3.68 బిలియన్ డాలర్ల అంచనాను సంస్థ అందుకుంది. ఒక్కో షేరుకు 0.80 డాలర్ల లాభం చేకూరుతుందని కంపెనీ పేర్కొంది.

భారీగా తగ్గిన ఉద్యోగుల సంఖ్య

కాగ్నిజెంట్‌లో ఉద్యోగుల సంఖ్య భారీగా తగ్గిపోయింది. మార్చి త్రైమాసికం నుంచి ప్రస్తుత త్రైమాసికం వరకు 4 వేల మంది సిబ్బంది తగ్గారు. మార్చి నాటికి కాగ్నిజెంట్‌లో 2,61,200 మంది ఉద్యోగులు ఉన్నారు. అయితే జూన్ త్రైమాసికానికి సంఖ్య 256,800కు తగ్గిందని కంపెనీ త్రై మాసిక ఫలితాల సందర్భంగా వెల్లడించింది. దేశీయ అతిపెద్ద ఐటీ అవుట్‌సోర్స్ కంపెనీల్లో కాగ్నిజెంట్‌లోనే అత్యధికంగా ఉద్యోగులు ఉంటారు. అదే సమయంలో ఇతర ప్రత్యర్థి దేశీయ ఐటి సంస్థలు టిసిఎస్, ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా కంపెనీల్లో కూడా ఉద్యోగులు తగ్గిపోయారు. అయితే కానీ ఈ మేర తగ్గడం దీనిలోనే. కాగ, విప్రో, హెచ్‌సిఎల్ టెక్నాలజీ కంపెనీలు మాత్రం తమ ఉద్యోగుల సం ఖ్యను పెంచుకున్నాయి. అయితే కాగ్నిజెంట్ తన రెవెన్యూ గైడెన్స్‌ను పెంచింది.

బిఎండబ్ల్యు నుంచి 320డి ఎడిషన్ స్పోర్ట్



న్యూఢిల్లీ : లగ్జరీ కార్ల తయారీ సంస్థ బిఎండబ్ల్యూ నుంచి కొత్త కారు మార్కెట్లోకి వచ్చింది. 320డి ఎడిషన్ స్పోర్ట్‌ను గురువారం విడుదల చేసింది. బిఎండబ్ల్యూ ప్రముఖ మోడల్స్‌లో ఒకటైన 3 సిరీస్ మోడల్ ధర రూ. 38.60లక్షలు(ఎక్స్ షోరూం)గా నిర్ణయించారు. ఈ కొత్త 320డీ కారును చెన్నైలోని బిఎండబ్ల్యూ ఇండియా ప్లాంట్‌లో ఉత్పత్తి చేశారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా సంస్థకు చెందిన అందరు డీలర్ల వద్ద ఈ కారు వినియోగదారులకు అందుబాటులో ఉంది. 2 లీటర్ల ట్విన్ పవర్ 4సిలిండర్‌టర్బో డీజిల్ ఇంజిన్ ఉంది. ఇది 188 బిహెచ్‌పి పవర్, 400ఎన్ఎం టార్క్‌ను ఇస్తుంది. అంతేగాక డ్రైవింగ్ మోడ్‌లను కూడా ఎంపిక చేసుకునే సదుపాయం ఈ కార్లో ఉంటుంది. కంట్రోల్ స్విచ్ సాయంతో డ్రైవింగ్ కండిషన్‌ను బట్టి కంఫర్ట్, ఎకో ప్రో, స్పోర్ట్, స్పోర్ట్ ప్లస్‌లాంటి మోడ్‌లలోకి మార్చుకోవచ్చని కంపెనీ వెల్లడించింది.

మహిళా పారిశ్రామికవేత్తలతో మోడీ భేటీ



న్యూఢిల్లీ: మహిళా పారిశ్రామికవేత్తలు గురువారంనాడు ప్రధాని నరేంద్ర మోడీతో భేటీ అయ్యారు. యంగ్ ఫిక్కీ మహిళల సంస్థకు చెందిన 25 మంది సభ్యుల బృందం ప్రధానితో సమావేశమై, ఆయనతో కొంతసేపు సంభాషణ జరిపారు. బృందం అడిగిన ప్రశ్నలకు మోడీ స్పందించారు. స్వచ్ఛ భారత్ మిషన్ గొప్ప అవకాశమని మోడీ అన్నారు. కుటుంబ విలువలు, వైవిధ్యం, పర్యావరణ స్పృహ ఈ మూడు భారత్ గొప్ప సంప్రదాయాలని అన్నారు.

విశ్వవిశ్వానీ విద్యార్థులకు సంకల్ప్ రక్తదాన శిబిరం

మన తెలంగాణ / హైదరాబాద్ : హైదరాబాద్‌కు చెందిన సత్‌గురు మేనేజ్‌మెంట్ కన్‌సల్‌టెంట్స్ సంస్థ సిఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా గురువారం నాడు సంకల్ప్ పేరిట రక్తదాన శిబిరాన్ని నిర్వహించింది. విశ్వవిశ్వానీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సిస్టమ్స్ అండ్ మేనేజ్ మెంట్‌కు చందిన విద్యార్థులు ఈ రక్తదాన శిబిరంలో పాల్గొని విజయవంతం చేశారు. సంకల్ప్ కార్యక్రమం విజయవంతం కావడం పట్ల జిఎం రాజరాజేశ్వరి, విశ్వవిశ్వానీ డైరెక్టర్ డా. భరత్ భూషన్ సింగ్ విద్యార్థులకు అభినందనలు తెలిపారు.





స్టాక్ మార్కెట్

ఈరోజు మార్కెట్	ముగింపు	మార్పు	%
సెన్సెక్స్	32237.88	238.86	0.74%
నిఫ్టీ	10013.65	67.85	0.67%

కరెన్సీ మారక రేట్లు

అమెరికన్ డాలర్	64.4700
యూరో	70.4270
బ్రిటిష్ పౌండ్	83.4957
ఆస్ట్రేలియన్ డాలర్	47.4050
కెనేడియన్ డాలర్	47.0500
ఎమిరైట్ దిర్హామ్	17.5040
స్విస్ ఫ్రాంక్	64.5500
చైనీస్ యువాన్	9.3344
మలేషియన్ రింగిట్	14.8460
న్యూజిలాండ్ డాలర్	44.4990
హాంగ్‌కాంగ్ డాలర్	8.2824
జపనీస్ యెన్	0.5688
కువైట్ దినార్	212.0888
సౌతాఫ్రికన్ రాండ్	4.7209

బులియన్






బంగారం ధర

నగరం	ధర (రూ / 10 గ్రాములు)		
	22క్యారట్	24క్యారట్	మార్పు(%)
చెన్నై	27130	29016.04	0.51%
ముంబై	28000	29946.52	0.43%
ఢిల్లీ	27650	29572.19	0.18%
కోల్‌కతా	28070	30021.39	0.14%
కేరళ	26500	28342.25	0.75%
బెంగళూరు	26750	28609.63	0.19%
హైదరాబాద్	27130	29016.04	0.8%
గల్ఫ్	1344.06	1437.50	0.17%

వెండి ధర (రూ./ కిలో)

నగరం	గురువారం	బుధవారం	మార్పు (%)
చెన్నై	40600.00	41700.00	2.64
ముంబై	40600.00	41700.00	2.64
ఢిల్లీ	40600.00	41700.00	2.64
కోల్‌కత్తా	40600.00	41700.00	2.64
హైదరాబాద్	40600.00	41700.00	2.64



కోడిగుడ్లు (100కు) నెక్ రేటు

హైదరాబాద్	310	విశాఖపట్నం	318
వరంగల్	312	చిత్తూరు	365
విజయవాడ	308	చెన్నై	372
గోదావరి	308	బెంగళూరు	360

గ్రామ పంచాయతీలకు రూ.1.46 కోట్లు

మన తెలంగాణ/ హైదరాబాద్: దీన్‌దయాల్ ఉపాధ్యాయ పంచాయత్ సశక్తీకరణ్ పురస్కారానికి ఎంపికైన గ్రామ పంచాయతీలకు రూ.1.46 కోట్లు కేంద్రం గ్రాంటు మంజూరు చేసింది. కరీంనగర్ జిల్లాకు రూ.50 లక్షలు, మహబూబ్‌నగర్‌లోని ఘన్‌పూర్ మండలానికి, వరంగల్ జిల్లా తాడ్వాయి మండలానికి రూ.25 లక్షలు చొప్పున కేంద్రం గ్రాంటు ఇచ్చింది. ఇదేవిధంగా నిజామాబాద్ జిల్లా వేల్పూరు, సిరిసిల్ల జిల్లా కస్బె కట్కూరు, గోపాలరావుపల్లి, మహబూబ్‌నగర్ జిల్లా, అడ్డాకుల్ మండలంలోని నిజలాపూర్ గ్రామాలకు రూ.8 లక్షలు చొప్పున నిధులు మంజూరయ్యాయి. ఇదేవిధంగా నానాజీ దేశ్‌ముఖ్ రాష్ట్రీయ గౌరవ గ్రామసభ పురస్కారానికి గాను సిద్ధిపేట జిల్లా ఇబ్రహీంపూర్ గ్రామం ఎంపికైంది. దీనికి గాను రూ.10 లక్షలు గ్రాంటు జమ అయ్యింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి అధికారికంగా సమాచారం అందింది.

వాల్‌మార్ట్ ఇండియా సిఇఒగా దేవేంద్ర చావ్లా

మన తెలంగాణ / హైదరాబాద్ : వాల్ మార్ట్ ఇండియాకు నూతన చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్‌గా దేవేంద్ర చావ్లా నియమితులయ్యారు. వాణిజ్య కార్యకలాపాలతో పాటు మార్కెటింగ్ అంశాలను కూడా ఆయన పర్యవేక్షించనున్నట్లు వాల్ మార్ట్ ఇండియా ప్రెసిడెంట్, సిఇఒ క్రిష్ అయ్యర్ ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో వాణిజ్య కార్యకలాపాలను మరింత విస్తరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని ఈ సందర్భంగా వాల్‌మార్ట్ ఇండియా ప్రకటనలో వెల్లడించింది.



కార్బన్ మొబైల్స్ సరికొత్త ఫోన్

న్యూఢిల్లీ: మొబైల్ తయారీ కంపెనీ కార్బన్ మొబైల్స్ దేశీయ మార్కెట్లోకి కొత్త ఫోన్ 'కార్బన్ ఆరో నోట్ ప్లే'ను విడుదల చేసింది. ఈ ఫోను ధర రూ.7,590గా నిర్ణయించింది. అన్ని ప్రముఖ పట్టణాల్లోని ఆఫ్‌లైన్ రిటైల్ స్టోర్లలో ఈ ఫోన్ లభ్యంకానుంది. 3300 ఎంఎహెచ్ బ్యాటరీ సామర్థ్యం కలిగిన ఈ ఫోన్ 4జి విఒఎల్‌టిఇని సపోర్ట్ చేస్తుంది. ఈ సందర్భంగా కార్బన్ మొబైల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శశిన్ దేవసారే మాట్లాడుతూ.. తాము, కార్బన్ సంస్థ మా వినియోగదారులకు సరికొత్త ఆవిష్కరణలతో పాటు, ఉత్తమ టెక్నాలజీని అందించడానికి సిద్ధంగా ఉన్నామని అన్నారు. ఈ ఫోన్ ఫీచర్లు 6 అంగుళాల టచ్ స్క్రీన్, 1.3గిగాహెడ్జ్ క్వాడ్‌కోర్ ప్రాసెసర్, 2జిబి ర్యామ్, 3300ఎంఎహెచ్ బ్యాటరీ ఉన్నాయి.



జిఎస్‌టిపై అవగాహన అవశ్యం

మన తెలంగాణ/ హైదరాబాద్ : జిఎస్‌టి వల్ల కలిగిన మార్పులు రంగం నిర్దిష్ట విషయాలపై గురువారం తెలంగాణ, అంధ్రప్రదేశ్ రాష్ట్రాల పారిశ్రామిక, ఆర్థిక మరియు వాణిజ్య మండళ్ల సమాఖ్య (ఫ్యాఫ్సి)లో సదస్సు జరిగింది. సదస్సుకు ముఖ్య అతిధులుగా గౌరా శ్రీనివాస్ ఫ్యాప్సి అధ్యక్షులు బి.బి అగర్వాల్ హాజరు కాగా, ఐఆర్ఎస్ చీఫ్ కమిషనర్, కస్టమ్స్ జిఎస్‌టి, హైదరాబాద్, వైజాగ్ జోన్ ఎం శ్రీనివాస్, ఐఆర్ఎస్ కమిషనర్ ఆఫ్ కస్టమ్స్ జిఎస్‌టి తదితరులు పాల్గొన్నారు. బిబి అగర్వాల్ మాట్లాడుతూ జిఎస్‌టి పన్ను విధానం దేశంలోనే భారీ సంస్కరణ పేర్కొన్నారు. కొన్ని ఇబ్బందులు ఉన్నప్పటికీ, పూర్తి అవగాహనకు పన్ను చెల్లింపుదారులు సిబిఇసి వెబ్‌సైట్ ఉపయోగిచాలని ఆయన సూచించారు. ఈ వెబ్‌సైట్ వివరణాత్మక సమాచారాన్ని అందిస్తుందన్నారు. జిఎస్‌టి ప్రారంభించిన నాటి నుండి రాష్ట్రం నిర్వహించిన ఔట్ జాబితా కార్యక్రమంలో నంబర్ 1లో ఉందని తెలిపారు. తెలంగాణలో ఉన్న జిఎస్‌టి కేంద్రాలను ప్రతి ఒకరు ఉపయోగించుకోవాలన్నారు.

పంజాబ్ నేషనల్ బ్యాంక్‌తో రెలిగేర్ ఇన్సూరెన్స్ ఒప్పందం

మన తెలంగాణ / హైదరాబాద్: హెల్త్ ఇన్సూరెన్స్ సేవల కోసం పంజాబ్ నేషనల్ బ్యాంక్‌తో రెలిగేర్ ఆరోగ్య బీమా సంస్థ ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఈ మేరకు పంజాబ్ నేషనల్ బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్, సిఈవో అయిన సునీల్ మెహతా, రెలిగేర్ హెల్త్ ఇన్సూరెన్స్ మేనేజింగ్ డైరెక్టర్ సీఈవో అనూజ్ గులాఠి బుధవారం ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఇప్పటి వరకు 7 వేల బ్యాంక్ శాఖల ద్వారా 100 మిలియన్ కస్టమర్లకు వివిధ సేవలను అందిస్తోందని, తాజాగా ఆరోగ్య సేవల్లోనూ తమ భాగస్వామ్యం అందించేందుకు ముందకు వచ్చినట్లు సునీల్ మెహతా ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

239 పాయింట్లు పతనం

• వరుసగా రెండో రోజు నష్టాలు • భారీగా 4 శాతానికి పైగా నష్టపోయిన లుపిన్




చెన్నై : సెంట్రల్ బ్యాంక్ నుంచి మరింత వడ్డీ రేటు కోత గురించి బ్యాంకర్ల ఆందోళన నేపథ్యంలో సెన్సెక్స్, నిఫ్టీ సూచీలు నష్టాలను నమోదు చేశాయి. బుధవారంనాడు ద్రవ్యపరపతి విధాన సమీక్షలో ఆర్‌బిఐ 25 బేసిస్ పాయింట్లు వడ్డీ రేటును తగ్గించడంతో వడ్డీ రేటు 6 శాతానికి చేరింది. దీంతో ఆరేళ్ల కనిష్ఠ స్థాయికి వడ్డీ రేటు పడిపోయింది. రెపో రేటు ఆశించినంతగా తగ్గించకపోవడంతో ఇన్వెస్టర్లలో ఒకింత నిరాశ నెలకొంది. మరోవైపు మెటల్, బ్యాంకింగ్, ఫైనాన్షియల్ స్టాక్స్‌లో లాభాల స్వీకరణతో ఈక్విటీ మార్కెట్లు నేలచూపులు చూశాయి. మరోవైపు ఆసియన్ మార్కెట్ల నుంచి వస్తున్న బలహీనమైన సంకేతాలతో మార్కెట్లు కరెక్షన్‌కు గురయ్యాయి. సెన్సెక్స్ 200 పాయింట్లకు పైగా నష్టంలో 32,237 వద్ద ముగిసింది. ఇక నిఫ్టీ 67.85 పాయింట్ల నష్టంలో 10,013 వద్ద స్థిరపడింది. లుపిన్ షేరు భారీగా 4.67 శాతం మేరకు పడిపోయింది. ప్రధానంగా రిలయన్స్ ఇండస్ట్రీస్, భారతీ ఎయిర్‌టెల్, బజాజ్ ఆటో, హీరో మోటోకార్పొరేషన్‌లు లాభపడ్డాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్ భారీగా లాభపడింది. 1.6 శాతం పైకి ఎగిసి రూ.1655 వద్ద సరికొత్త రికార్డులో ముగిసింది. ప్రతికూల ఆసియా మార్కెట్లు, ఆర్‌బిఐ వడ్డీరేటు కోత ప్రభావంతో మార్కెట్లు ఉదయం నుంచి నష్టాల్లోనే ట్రేడవుతూ వచ్చాయి. ముఖ్యంగా ఆర్‌బిఐ సమీక్ష నేపథ్యంలో ప్రభుత్వరంగ, ప్రయివేట్ బ్యాంకింగ్ రంగంలో పెద్ద ఎత్తున లాభాల స్వీకరణ మొదలైంది. అటు డాలర్‌తో రూపాయి మారకం విలువ 6 పైసలు బలపడి 63.65 వద్ద నమోదైంది.

ఎయిర్‌టెల్‌లో టెలినార్ విలీనానికి అనుమతి



దేశీయ టెలికామ్ దిగ్గజం భారతీ ఎయిర్‌టెల్‌కు తీరు కబురు వచ్చింది. కొద్ది కాలంగా ఎయిర్‌టెల్‌లో టెలినార్ విలీనం ప్రక్రియ కొనసాగుతోంది. ఈ సమయంలోనే ఈ విలీన ప్రతిపాదనకు ఎన్‌సిఎల్‌టి(నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్) నుంచి అనుమతి లభించింది. దీంతో మరో కీలక అడుగు పడిం ది. టెలినార్ విలీనంతో ఎయిర్‌టెల్ 4జీ స్పెక్ట్రమ్‌కు మరింత వూతం లభించడంతోపాటు మార్కెట్‌లో సంస్థ వాటా కూడా పెరుగుతుందని మార్కెట్ వర్గా లు భావిస్తున్నాయి. ఈ నేపథ్యంలో రెండు కంపెనీలు తమ సంస్థల వాటాదారులు, రుణదాతలతో సమావేశం నిర్వహించాలని ట్రిబ్యునల్ ఆదేశించినట్లు తెలుస్తోంది. ఇప్పటికే జూన్ నెలలో ఎయిర్‌టెల్ సంస్థ సెబీ, బిఎస్ఇ, ఎన్ఎస్ఇ, సిసిఐ వద్ద నుంచి అనుమతి పొందింది. విలీన ప్రక్రియ పూర్తయితే ఎయిర్‌టెల్‌కు అదనంగా 1800 మెగా హెడ్జ్ పరిధిలో 43.4 యూనిట్ల 4జి స్పెక్ట్రమ్ లభిస్తుంది.

త్వరలో పతంజలి దుస్తులు



న్యూఢిల్లీ: ఇప్పటికే ఆహార, ఔషధ, ఇతర రంగాల్లోకి ప్రవేశించిన బాబా రాందేవ్ పతంజలి సంస్థ త్వరలో దుస్తుల రంగంలోకి కూడా ప్రవేశించేందుకు రంగం సిద్ధం చేసుకుంటోంది. మహిళలు, పురుషులు, చిన్నారుల కోసం దేశీయంగా తయారు చేసిన దుస్తులను ప్రవేశపెట్టనుంది. దుస్తుల వ్యాపారాన్ని ఏప్రిల్‌లో ప్రారంభించనుందని ఆ కంపెనీ అధికారిక ప్రతినిధి ఎస్‌కె టిజరావాలా చెప్పారు. ప్రారంభమైన తొలి ఏడాదే ఈ వస్త్రాల విక్రయ లక్ష్యాన్ని రూ.5000 కోట్లుగా పతంజలి నిర్ధారించుకుందని తెలిపారు. ఈమేరకు ఇప్పటికే వస్త్రాల తయారిని కూడా చేపడుతున్నారని పేర్కొన్నారు. ఊలు, కాటన్, నైట్ వేర్, మెషీన్ మేడ్, డెనిమ్ వంటి బట్టలను మార్కెట్‌లోకి తీసుకొస్తామని టీజారావాల చెప్పారు. స్వదేశీ ఏజెండాలో తీసుకొస్తున్న ఈ బట్టల వ్యాపారానికి 'పరిదాన్' అనే పేరును పెట్టాలని కూడా చూస్తున్నామని తెలిపారు. ఈ వ్యాపారాలకు తగ్గ బ్రాండు పేరు పెట్టాలని చూస్తున్నామని అన్నారు. 2018 ఏప్రిల్‌లో దేశవ్యాప్తంగా ఉన్న 250 అవుట్‌లెట్లలో ఈ దుస్తులను అందుబాటులోకి తీసుకొస్తామని, ఇంకా పతంజలి స్టోర్లు కూడా ఏర్పాటు చేస్తామని అన్నారు. గత నెలలోనే పరాక్రమ్ సురక్ష ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో ప్రైవేట్ సెక్యూరిటీ బిజినెస్‌లోకి కూడా బాబా రాందేవ్ అడుగుపెట్టారు. స్ట్రెస్డ్ అసెట్స్ కలిగిన ఉన్న మౌలిక సదుపాయాల కంపెనీలను కొనుగోలు చేయాలని పతంజలి చూస్తోంది. పతంజలి ఆయుర్వేద ప్రొడక్ట్‌లు మార్కెట్‌లో పెద్దఎత్తున సేల్ అవుతున్నాయి. మార్చి 31 వరకు సంస్థ అమ్మకాలు రూ.10,561 కోట్లగా ఉన్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో విక్రయాలను రూ.20 వేల కోట్లకు పెంచుకోవాలని చూస్తోంది.

కర్నాటక మంత్రి ఇంట్లో రెండో రోజూ ఐటి సోదాలు



బెంగళూరు: కర్నాటక ఇంధనశాఖ మంత్రి డికె శివకుమార్ నివాసంపై వరుసగా రెండోరోజు గురువారం కూడా ఆదాయపు పన్నుశాఖ దాడులు జరిగాయి. ఇప్పటివరకూ జరిగిన సోదాల సందర్భంగా మొత్తం రూ 11 కోట్లను ఐటి విభాగం స్వాధీనపర్చుకుంది. మంత్రికి,ఆయన సన్నిహితులకు సంబంధించిన పలు నివాసాలపై పన్ను ఎగవేతకు సంబంధించి ఐటి దాడులు సాగుతున్నాయి. గుజరాత్‌కు చెందిన 44 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలను శివార్లలోని ఓ రిసార్ట్‌లో ఉంచి వారిని పర్యవేక్షించే బాధ్యతను తీసుకున్న శివకుమార్ నివాసాలపైనే ఐటి సోదాలు జరుగుతున్నాయి. దీనితో రాజకీయంగా తీవ్రదుమారం చెలరేగింది. సోదాలు సందర్భంగా పలు కీలకమైన పత్రాలు, ఖాతా పుస్తకాలు, ఆర్థిక లావాదేవీల డాక్యుమెంట్లు పట్టుకున్నట్లు ఐటి వర్గాలు తెలిపాయి. బెంగళూరులోనే కాకుండా ఢిల్లీ, మైసూరులలోని నివాసాలలో కూడా ఐటి సోదాలు జరుగుతూ ఉండటంతో ఇది రాజకీయ వేధింపు చర్యగా పేర్కొంటూ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసనలు చేపట్టారు. ఢిల్లీలోనే రూ.8.33 కోట్లు, బెంగళూరులో రూ 2.5 లక్షలు, మైసూరులో రూ 60 లక్షలను ఇప్పటివరకూ స్వాధీనపర్చుకున్నారు. ఇప్పటివరకూ పట్టుకున్న మొత్తం గురించి వివరాలు తెలిపిన ఐటి విభాగం వారు మరిన్ని సోదాలు, బేరీజులు కొనసాగుతాయని వెల్లడించారు.

లంచం కేసులో జిఎస్‌టి కౌన్సిల్ సూపరింటెండెంట్ అరెస్ట్

న్యూఢిల్లీ: అవినీతి ఆరోపణలతో కొత్తగా ఏర్పాటైన జిఎస్‌టి కౌన్సిల్ సూపరింటెండెంట్‌ను సిబిఐ అరెస్ట్ చేసింది. తన సన్నిహితుల ద్వారా లంచం తీసుకోవడంతో సూపరింటెండెంట్ మోనీష్ మల్హోత్రా, మధ్యవర్తి మనాస్ పాత్రాను బుధవారం సాయంత్రం సిబిఐ అరెస్ట్ చేసినట్లు ప్రభుత్వ అధికారి ఒకరు తెలిపారు. జిఎస్‌టి కౌన్సిల్ అధికారిని కేంద్ర ప్రభుత్వ ఏజెన్సీ అరెస్ట్ చేయడం ఇదే మొదటి కేసుగా భావిస్తున్నారు. గతంలో సెంట్రల్ ఎక్సైజ్ అధికారిగా బాధ్యతలు నిర్వహించిన మల్హోత్రా ప్రైవేట్ వ్యక్తులకు అనుకూలంగా వ్యవహారించారు. పలు మార్లు లంచాలు తీసుకొని వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని సిబిఐ ఆరోపించింది. మల్హోత్రా తరుపున పార్టీలతో సంబంధాలు ఏర్పరుచుకొని ప్రైవేట్ వ్యక్తుల నుంచి నెల, మూడు నెలలకోసారి పాత్రా అక్రమ లావాదేవీలు నిర్వహించేవారు. అవినీతి సొమ్మును మొదట తన బ్యాంక్ అకౌంట్‌లో వేసుకొని తదుపరి మల్హోత్రా భార్య, కూతురు పేరు మీద ఉన్న బ్యాంక్ అకౌంట్ల లోకి నగదును బదిలీ చేశారు. లంచం తీసుకుంటున్నాడనే సమాచారం రావడంతో మల్హోత్రా ఇంటిపై దాడులు నిర్వహించిన సిబిఐ నిందితులను అరెస్ట్ చేసింది. లంచంగా తీసుకున్న నగదు, పలు డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకుంది.

మేధాపాట్కర్‌కు రూ.10వేల జరిమానా

న్యూఢిల్లీ: ప్రముఖ సామాజిక కార్యకర్త, నర్మదా బచావో ఆందోళన్ (ఎన్‌బిఎ) ఉద్యమనేత మేధా పాట్కర్‌కు ఢిల్లీ కోర్టు రూ. 10వేల జరిమానా విధించింది. పరువునష్టం దావా కేసులో కోర్టు ఎదుట హాజరుకావాలని ఆదేశిస్తూ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ విక్రాంత్ వైద్ ఆమెకు చివరి అవకాశాన్ని ఇచ్చారు. అయినప్పటికీ కూడా పలుమార్లు కోర్టులో గైర్హాజరు కావడంతో గురువారం ఆమెకు మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ జరిమానా విధించింది. కెవిఐసి చైర్మన్ వికె సక్సేనా, మేధా పాట్కర్‌లద్దరిపై గతంలో పరువునష్టం దావా కేసులు నమోదైన సంగతి తెలిసిందే. ఈ కేసుల విషయంలో కోర్టు ఎదుట హాజరుకావాలని, లేనిపక్షంలో సక్సేనాపై ఆమె వేసిన పిటిషన్‌ను కొట్టివేస్తామని ఢిల్లీ కోర్టు హెచ్చరించింది. అలాగే మే 29న జారీచేసిన నాన్‌బెయిలబుల్ వారెంట్‌ను కూడా రద్దు చేస్తామని జూన్ 26న పాట్కర్‌ను కోర్టు హెచ్చరించింది. 2015 జనవరిలో కోర్టు ఎదుట హాజరుకానుందుకు పాట్కర్‌కు రూ. 3వేల జరిమానా విధించిన సంగతి విదితమే.

మోడీకి సిపిఐ నేత డి.రాజా లేఖ

న్యూఢిల్లీ: రైతులు, జాతీయ ఆహార భద్రత పరిరక్షణకు మొక్కలు, విత్తనాలు, జంతువులను పేటేంట్ పరిధిలోకి రాకుండా చూడాలని సిపిఐ ఎంపి డి రాజా డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ప్రధాని నరేంద్ర మోడీకి ఓ లేఖ రాశారు. వీటిని పేటెంట్ పరిధిలోకి తేవడం వల్ల భారతీయ వ్యవసాయ రంగంలో గుత్తాధిపత్యం పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. భారతీయ పేటెంట్ చట్టం (ఐపిఎ) పరిధిలో పేటెంట్ అధికారాలకు సంబంధించి రక్షణగా ఉన్న నిబంధనలను కొనసాగించాలని, ఐపిఎ పరిధిలోకి మొక్కలు, విత్తనాలు, జంతువులు రాకుండా మినహాయించాలని రాజా తెలిపారు. కొన్ని బహుళ జాతి సంస్థలు ఈ పేటెంట్ చట్టాలను అడ్డుగా చేసుకుని విత్తనాలు, వివిధ రకాల మొక్కలపై గుత్తాధిపత్యాన్ని చాటుకోవడానికి సాగించే దుష్టపన్నాగాలతో రైతాంగం దెబ్బతినరాదని రాజా తెలిపారు.

పాక్ ప్రభుత్వ వెబ్‌సైట్ హ్యాక్



న్యూఢిల్లీ: పాకిస్థాన్ ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్ గురువారం హ్యాకింగ్‌కు గురైంది. ఆ వెబ్‌సైట్‌లో హ్యాకర్స్ భారత జాతీయ గీతంతో పాటు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలను పోస్టు చేశారు. పాకిస్థాన్ ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్ 'డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.పాకిస్థాన్.గవ్.పికె' కొంత సమయంపాటు పని చేయలేదు. ఆ తరువాత దానిని పునరుద్ధరించారు. వెబ్‌సైట్‌లో హ్యాకర్లు పోస్టు చేసిన మెసెజ్‌ను ఓపెన్ చేసి చూడగా బ్యాక్‌గ్రౌండ్‌లో భారత స్వాతంత్ర్య దినోత్సవ ఉత్సవాలు, దేశ జాతీయ గీతం ప్లే అయిందని ట్విట్టర్ ఖాతాదారులు పేర్కొన్నారు. వెబ్‌సైట్ హ్యాక్ గురైనట్లు మధ్యాహ్నం 2.45 గంటలకు గుర్తించగా, దానిని కొంత సమయం పాటు నిలిపివేసి ఆ తరువాత పునరుద్ధరించారు. అయితే పాక్ వెబ్‌సైట్ హ్యాక్‌కు గురికావడం ఇది మొదటిసారి ఏమీ కాదు. రెండు నెలల క్రితం కూడా పాకిస్థాన్ ప్రభుత్వానికి చెందిన 30 వెబ్‌సైట్లు హ్యాక్‌కు గురయ్యాయి.

ఒడిశాలో భారీ అగ్నిప్రమాదం

మంటల్లో చిక్కుకుని ఐదుగురు సజీవదహనం

భువనేశ్వర్: ఒడిశాలోని ఓ హోటల్ యాజమాని భవనంలో గురువారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో హోటల్ యాజమాని కుటుంబ సభ్యులు నలుగురితో పాటు పనిమనిషి సజీవదహనమయ్యారు. వివరాల్లోకి వెళితే.. సప్తల్ సింగ్ అనే హోటల్ యాజమాని నివాసంలో కుటుంబ సభ్యులు నిద్రిస్తున్న సమయంలో తెల్లవారుజామున ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. భవనం నుంచి దట్టమైన పొగలు వ్యాపించడంతో అక్కడి స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో హుటాహుటినా ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది మంటల్లో చిక్కుకున్న ఆరుగురిని రక్షించి ఆస్పత్రికి తరలించినట్టు డిఎఫ్ఒ అధికారి రమేశ్ చంద్ర మాఝి వెల్లడించారు. మంటల్లో కాలిపోయిన వారిని ఆస్పత్రికి తరలించగా వారు అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు నిర్ధారించారు. మృతుల్లో సింగ్ కుమారుడు, కోడలు, మనవడు, మనవరాలితో పాటు వారి ఇంటి పనిమనిషి కూడా ఉందని మాఝి తెలిపారు. ఈ ప్రమాదంలో గాయపడిన సింగ్ కుటుంబ సభ్యుడు ఒకరు ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా, అతని ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని అన్నారు. అయితే అగ్ని ప్రమాదానికి షార్ట్ సర్క్యూటే కారణమని, పోలీసులు విచారణ చేపట్టినట్టు మాఝి పేర్కొన్నారు.

ఉప ఎన్నికలో నాగాలాండ్ సిఎం విజయం

కోహిమ: నాగాలాండ్ మాజీ ముఖ్యమంత్రి, అధికార నాగా పీపుల్స్ ఫ్రంట్ (ఎన్‌పిఎఫ్) అభ్యర్థి డాక్టర్ షుర్‌జోలీ లీజిత్సు ఉప ఎన్నికలో గెలుపొందారు. 10 ఉత్తర అంగామిల్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన లీజుత్సు తన స్వతంత్ర ప్రత్యర్థిపై 3470 ఓట్ల తేడాతో విజయం సాధించారు. లీజుత్సుకు 8026 ఓట్లు రాగా, తన ప్రత్యర్థి కెఖ్రీయోమ్‌కు 4558 ఓట్లు వచ్చాయి. అదే విధంగా 23 పోస్టల్ బ్యాలెట్లలో లీజుత్సుకు 12 రాగా, యోమ్‌కు 10 వచ్చాయి. మరొక ఓటు చెల్లకుండా పోయింది. మే 24న సిట్టింగ్ ఎంఎల్‌ఎ ఖెరీహు లీజిత్సు రాజీనామా చేయడంతో ఆ నియోజకవర్గంలో ఉప ఎన్నిక అనివార్యమైంది. ఈ నేపథ్యంలో జరిగిన ఉప ఎన్నికల్లో ఆయన తండ్రి షుర్‌జోలీ లీజుత్సు శాసనసభ్యుడిగా ఎన్నికయ్యారు.



రైతు రుణాలు మాఫీ చేయడంతో పాటు పండించిన పంటలకు మద్దతు ధరలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గురువారంనాడు ఢిల్లీలో వినూత్న ఆందోళన నిర్వహించిన తమిళనాడు రైతులు



పంజాబ్‌లో ఇటీవల పెంచిన వ్యవసాయ విద్యుత్ ఛార్జీలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఆందోళనకు దిగిన ఆ రాష్ట్రానికి చెందిన రైతులు

కేరళపై అడ్డగోలు మాటలొద్దు

లోక్‌సభలో బిజెపిపై వామపక్షాల ఫైర్

న్యూఢిల్లీ: కేరళలో హింసాకాండపై లోక్‌సభలో గురువారం సిపిఎం, బిజెపి సభ్యుల మధ్య తీవ్రస్థాయిలో వాదులాట జరిగింది. కేరళలో ఆర్ఎస్ఎస్ నేతలపై దాడులు నేపథ్యంలో బిజెపి సభ్యులు తమ నేతలపై చేసిన వ్యాఖ్యను సిపిఎం సభ్యులు తీవ్రంగా ఖండించారు. జీరో అవర్‌లో సిపిఎం నేత పి కరుణాకరన్ ఈ అంశాన్ని లేవనెత్తారు. సభలో గురువారం జరిగిన చర్చ సందర్భంగా బిజెపి సభ్యులు కొందరు చేసిన వ్యాఖ్యలు దారుణంగా ఉన్నాయని విమర్శించారు. కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరిలను ఉద్దేశించి పార్టీ టెర్రరిస్టులు అని అనడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇరు పక్షాల మధ్య తీవ్రస్థాయిలో వాదోపవాదాలు సాగాయి. నిబంధనల మేరకు బిజెపి ఎంపీలు సభలో లేని వారి పేర్లను ప్రస్తావించరాదని, వారిపై నిందలకు దిగరాదని దీనిని వారు పూర్తిగా తుంగలో తొక్కారని మండిపడ్డారు. కరుణాకరన్ మాటలకు బిజెపి వారు అడ్డుతగిలి పెద్దగా మాట్లాడుతూ ఉండటంతో సభలో గందరగోళం చెలరేగింది. దీనితో స్పీకర్ సభను వాయిదా వేశారు. తరువాత తిరిగి సభ ప్రారంభం కాగానే కరుణాకరన్ ఇదే అంశాన్ని ప్రస్తావించడానికి యత్నించగా స్పీకర్ అనుమతిని ఇవ్వలేదు. ఆయన ఎం చెప్పినా రికార్డులలోకి వెళ్లబోదని స్పష్టం చేశారు. దీనితో వామపక్ష సభ్యులు లేచి వెల్‌లోకిదూసుకువెళ్లారు. బెదిరింపులకు దిగవద్దని సిపిఎం సభ్యుడు మహమ్మద్ సలీం స్పీకర్‌తో వాదులాటకు దిగారు. ఆ తరువాత కరుణాకరన్ మాట్లాడటానికి స్పీకర్ అనుమతించారు. ఆయన మాట్లాడుతూ కేరళ ముఖ్యమంత్రి సామరస్య వాతావరణం నెలకొల్పడానికి యత్నిస్తున్నారని, ఇందులో భాగంగానే



ఆర్ఎస్ఎస్ వారితో సంప్రదింపులు కూడా చేపట్టారని తెలిపారు. హింసాకాండ నివారణకు అన్ని ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. రాష్ట్రంలో వామపక్ష కార్యకర్తలు నేతలు కూడా హత్యకు గురి అయ్యారని వివరించారు. చివరికి సిపిఎం నేత ఏచూరిపై కూడా దాడి జరిగిందని తెలిపారు. ఈ దశలో బిజెపి సభ్యులు నిరసనకు దిగారు. సభను కురుక్షేత్రగా మారకుండా బిజెపి వారు చూస్తారని, ధర్మక్షేత్రంగా నిలుపుతారని, చర్చలకు అవకాశం ఇస్తారని, రాద్ధాంతాలకు కాదని స్పష్టం చేశారు.

'బ్లూ వేల్' రద్దు చేయాలి!

'బ్లూ వేల్' వంటి ఆన్‌లైన్ ఆటల రద్దుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని రాజ్యసభ సభ్యులు డిమాండ్ చేశారు. మహారాష్ట్రలోని అంధేరీలో గతవారం మన్‌ప్రీత్ అనే 9వ తరగతి విద్యార్థి బ్లూవేల్ ఆన్‌లైన్ గేమ్ ఆడుతూ ఐదంతస్తుల భవనంపై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడిన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై గురువారం రాజ్యసభలో ఎంపిలు లేవనెత్తారు.

ఆ ఒక్క ఫోన్‌కాల్‌తో కొండంత బలం

ప్రణబ్‌తో అనుబంధంపై మోడీ లేఖ

న్యూఢిల్లీ: 'ప్రణబ్ దా, మీరు నాకు పితృసమానులు, గురువులు, మార్గదర్శకులు' అని మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీకి ప్రధాని నరేంద్ర మోడీ ఓ లేఖ రాశారు. ఇందులో తీవ్రస్థాయిలో భావోద్వేగం వ్యక్తం అయింది.ప్రణబ్ తమ బాధ్యత నుంచి వైదొలుగుతున్న రోజునే ప్రధాని ఈ లేఖ పంపించారు. వేర్వేరు రాజకీయ సిద్ధాంతాలు, మౌలిక ఆలోచనలకు చెందిన ఈ ఇరువురి మధ్య నిలిచిన ఆత్మీయతా బంధం ఈ లేఖలో వ్యక్తం అయింది. తాను రాసిన లేఖను ప్రధాని ఇప్పుడు తమ ట్విట్టర్‌లో పొందుపర్చారు. ప్రణబ్‌తో కలిసి పనిచేయడం, ఆయన అనుభవాలను తెలుసుకోవడం తనకు గర్వకారణంగా ఉందని మోడీ తెలియచేసుకున్నారు. ప్రధాని రాసిన లేఖను ప్రణబ్ ముఖర్జీ కూడా తమ ట్విట్టర్‌లో ఉంచారు. రాష్ట్రపతిభవన్ నుంచి సెలవు తీసుకుంటున్న రోజున తనకు మోడీ నుంచి అందిన లేఖ మనసును కదిలించి వేసిందని, ఆయన అభిప్రాయాలను తాను మనసారా పంచుకున్నానని ప్రణబ్ తెలిపారు. తాను ఢిల్లీకి కొత్తవాడిగా మూడు సంవత్సరాల క్రితం వచ్చానని లేఖలో మోడీ తెలిపారు. తన ముందు పలు సవాళ్లు, సాధించాల్సిన ఎన్నో లక్ష్యాలు నిలిచి ఉన్న దశలో తనకు ప్రణబ్ ఎల్లవేళలా ఆదర్శంగా, స్ఫూర్తి ప్రదాతగా నిలిచారని వెల్లడించారు. ప్రణబ్ తనకు తండ్రి వంటి వారని, ఆయన విజ్ఞత, ఆమర మార్గదర్శకత్వం, వ్యక్తిగత ఆత్మీయత తనకు ఎనలేని ఆత్మవిశ్వాసాన్ని, బలాన్ని అందించాయని తెలిపారు. ముఖర్జీ మేధో సంపత్తి తనకు నిరంతరం తోడుగా నిలిచిందని తెలిపిన మోడీ ఈ సందర్భంగా జరిగిన ఘటనలను ఈ లేఖలో ప్రస్తావించారు. తన ఆరోగ్యం బాగోగుల గురించి జాగ్రత్తలు చెపుతూ ప్రణబ్ చేసిన ఒక్కఫోన్ కాల్ తనకు సరికొత్త శక్తిని అందించిందన్నారు.

కశ్మీర్‌లో ఎన్‌కౌంటర్లు

ఇద్దరు జవాన్లు, ఇద్దరు తీవ్రవాదులు మృతి

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లో ఎన్‌కౌంటర్ల పరంపర కొనసాగుతూ ఉంది. తాజాగా గురువారం రెండు వేర్వేరు చోట్ల జరిగిన ఎదురు కాల్పుల్లో ఓ మేజర్ సహా ఇద్దరు భారత జవాన్లు మృతి చెందగా, తీవ్రవాదులు కూడా హతమయ్యారు. ఉదయం షోపియాన్ జిల్లా జైపోరా ప్రాంతంలో భద్రతా సిబ్బందిపై తీవ్రవా దులు కాల్పులు జరిపారు. అప్రమత్తమైన జవాన్లు ఎదురు కాల్పులకు దిగారు. ఈ ఎన్‌కౌంటర్‌లో మేజర్ కమలేష్ పాండే, మరో జవాన్ టాంజిన్ చుల్టిమ్ మరణించినట్లు అధికారులు పేర్కొన్నారు. తీవ్రవాదులు సంచరిస్తున్నారన్న సమాచారంతో బుధవారం రాత్రి ఈ ప్రాంతాన్ని భద్రతా దళాలు తమ ఆధీనం లోకి తీసుకొని గాలింపు చర్యలు చేపట్టాయి. ఈ నేపథ్యంలో తీవ్రవాదులు జవాన్లకు తారసపడగా ఇరువర్గాల మధ్య కొద్దిసేపు ఎదురు కాల్పులు చోటు చేసు కున్నాయి. కాల్పుల అనంతరం తీవ్రవాదులు పరారయ్యారు. ఇదిలా ఉండగా, గుల్గామ్ జిల్లా గోపాలపోరా ప్రాంతంలో కూడా ఎన్‌కౌంటర్ జరిగింది. దళాలు బుధవారం రాత్రి కూంబింగ్ నిర్వహిస్తుండగా ఎదురుపడిన తీవ్రవాదులు వారిపై కాల్పులు జరిపారు. వారి కాల్పులను సమర్థవంతంగా తిప్పికొట్టి హిబ్జుల్ ముజాహిద్దీన్‌కు చెందిన ఇద్దరు తీవ్రవాదులను మట్టుబెట్టారు. అందులో ఒకరికి ఓ



బ్యాంకు వ్యాన్ గార్డులను, ఐదుగురు పోలీసులను పొట్టన పెట్టుకున్న ఘటనలతో సంబంధమున్నట్లు పోలీసు అధికారి ప్రతినిధి ఒకరు చెప్పారు. ఎన్‌కౌంటర్ మృతి చెందిన ఇద్దరిని అబ్దుల్ హమిద్ ఇటో కుమారుడు అఖిబ్ ఆహ్మద్ ఇటో, మహమ్మద్ అరీఫ్ రాథర్ కుమారుడు సుహైల్ అహ్మద్ రాథర్‌గా గుర్తించినట్లు ఒక ప్రకటనలో పోలీసులు తెలిపారు. వీరిద్దరు కూడా చట్టవ్యతిరేక, జాతి వ్యతిరేక కార్యకలాపాల్లో భాగస్వాములై ఉన్నారన్నారు. మంగళవారం పుల్వామా జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో లష్కరే తొయిబా అగ్రనేత అబు దుజన హతమైన విషయం తెలిసిందే.

నోటా స్టే

కాంగ్రెస్ అభ్యర్థనకు సుప్రీం తిరస్కారం

న్యూఢిల్లీ: గుజరాత్‌లో రాజ్యసభ ఎన్నికల సందర్భంగా నోటాపై స్టే విధించాలనే అభ్యర్థనను సుప్రీంకోర్టు తోసిపుచ్చిం ది. అభ్యర్థులలో ఎవరికి ఓటుకు అర్హులు కారని తెలిపే నోటా ప్రక్రియను పొందుపరుస్తూ ఎన్నికల సంఘం నోటిఫికేషన్ వెలువరించింది. ఈ నోటా ఆప్షన్ రాజ్యాంగ ప్రతిపత్తిని పరిశీలిం చేందుకు ధర్మాసనం అంగీకరించింది. అయితే నోటా నిలిపివేతకు ఆమోదిం చకపోవడంతో గుజరాత్ రాజ్యసభ ఎన్నికలు నోటా ప్రక్రియతోనే జరుగుతాయి. ఎన్నికల సంఘం నోటిఫికేషన్‌ను నిలిపివేయాలని గుజరాత్ కాంగ్రెస్ చీఫ్ విప్ శైలేష్ మనుభాయ్ పర్మార్ పిటిషన్ వేశారు. ఆయన తరపున సీనియర్ లాయర్లు కపిల్ సిబల్, ఎఎం సింఘ్వీ, హరీన్ రావల్ వాదించారు. రాజకీయ ఉద్రిక్తతల నడుమ గుజరాత్ నుంచి ఎగువసభకు ఖాళీల భర్తీకి ఈ నెల 8న పోలింగ్ జరుగనుంది. ఇసి వెలువరించిన నోటిఫికేషన్ రాజ్యాంగ రీత్యా చెల్లనేరదని పిటిషనర్ తెలిపారు. దీనిపై న్యాయమూర్తులు దీపక్ మిశ్రా, అమితావా రాయ్, ఎఎం ఖాన్విల్కర్‌తో కూడిన ధర్మాసనం విచారణ జరిపి, నోటీసులు జారీ చేయాలని ఆదేశిస్తూ రాజ్యాంగ బద్ధత అంశాన్ని పరిశీలిస్తామ ని తెలిపింది. నోటా వెసులుబాటుతో అవినీతికి ఆస్కారం ఏర్పడుతోందని న్యా యవాది కపిల్ సిబల్ వాదించారు. ఈ వాదనను ధర్మాసనం తోసిపుచ్చింది. ఓటర్ల ఓటుస్వేచ్ఛకు వీలుగా నోటా ప్రక్రియను తప్పనిసరి చేస్తూ 2014 తీర్పులో సుప్రీంకోర్టు స్పష్టతను ఇచ్చింది. దీనికి అనుగుణంగానే ఇప్పుడు నోటా ఆప్షన్‌ను పొందుపర్చినట్లు ఎన్నికల సంఘం తెలియచేసుకుంది.

నలుగురిని చితకబాదిన గోరక్షక బృందం

బెటల్: ఆవుల అక్రమ రవాణాదారులుగా అనుమానిస్తున్న నలుగురు వ్యక్తులను గోరక్షకుల బృందం చితకబాదింది. మధ్యప్రదేశ్ బెటల్ జిల్లాలోని ఓ మారుమూల గ్రామంలో జరిగిన ఈ సంఘటనకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. అనుమానాస్పద ఆవుల అక్రమ రవాణాదారులను అరెస్టు చేయగా, దుండగులు పారిపోయినట్లు పోలీసులు పేర్కొన్నారు. గత వారం జరిగిన ఈ ఘటన ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో దుండగులు, ఆవుల అక్రమ రవాణాదారులపై పోలీసులు వేర్వేరుగా కేసులు నమోదు చేశారు. బెటల్ జిల్లా హెడ్‌క్వార్టర్స్‌కు 110 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఓ గ్రామంలో అధికంగా ఉన్న జనసమూహం ముందే నలుగురు యువకులను కట్టేసి దారుణంగా చితకబాదుతున్న దృశ్యం ఆ వీడియోలో రికార్డు అయింది. దీనికి సంబంధించి పోలీస్ సబ్ డివిజనల్ అధికారి ప్రేమ్ సింగ్ ఠాకూర్ మాట్లాడుతూ యువకులపై దాడికి పాల్పడిన శ్యామ్, మానక్, సుందర్ పరాటే ఇతరులపై కేసు నమోదు చేశామన్నారు. వీరందరూ ప్రస్తుతం పరారీలో ఉన్నారని ఆయన చెప్పారు. అదే విధంగా ఆవుల అక్రమ రవాణాదారులుగా భావిస్తున్న నలుగురు వ్యక్తులపై కూడా కేసు పెట్టామన్నారు. వీరిని అరెస్టు చేసి వీడియో క్లిప్‌పై దర్యాప్తు చేపడుతున్నామని చెప్పారు.

ఉపరాష్ట్రపతి ఎన్నికకు నేడు ఎన్‌డిఎ నమూనా ఓటింగ్

న్యూఢిల్లీ: ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో చెల్లుబాటు కాని ఓట్లను తగ్గించేందుకు బిజెపి డమ్మీ ఓటింగ్ నిర్వహించనుంది. శుక్రవారం ఎన్‌డిఎ కూటమి ఎంపిలు నమూనా ఓటింగ్‌లో పాల్గొననున్నారు. ఎన్‌డిఎ ఉపరాష్ట్రపతి అభ్యరి వెంకయ్యానాయుడుకు ఎఐఎడిఎంకె, టిఆర్ఎస్, వైఎస్ఆర్‌సిపిలు మద్దతిస్తున్నాయని బిజెపి వర్గాలు తెలిపాయి. నమూనా ఓటింగ్ అనంతరం ఎంపిలకు ఇచ్చే విందులో ప్రధానమంత్రి నరేంద్రమోడీ కూడా పాల్గొనే అవకాశం ఉంది. ఈ విందు సమావేశంలో తనకే ఓటు వేయాలని వెంకయ్యానాయుడు సభ్యులను అభ్యర్థించనున్నారు. రాష్ట్రపతి ఎన్నికల్లో చెల్లుబాటు కాని 77 ఓట్లలో 21 ఓట్లు ఎంపిలవి ఉన్నాయి. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో కేవలం ఎంపిలకు మాత్రమే ఓటు వేసే అర్హత ఉంది. ఎన్‌డిఎ సభ్యుల బలం లోక్‌సభలో 337, రాజ్యసభలో 80 ఉంది. కాగా, ఎఐఎడిఎంకె, టిఆర్ఎస్, వైఎస్ఆర్‌సిపి కలిసి లోక్‌సభలో 50 మంది, రాజ్యసభలో 17 మంది సభ్యులు ఉన్నారు. ఉపరాష్ట్రపతి ఎలక్టోరల్ కాలేజీలో 790 మంది సభ్యులు ఉన్నారు. పలు పార్టీలకు చెందిన 484 మంది సభ్యులు ఎన్‌డిఎ అభ్యర్థికి ఇప్పటికే మద్దతిచ్చారు. పలువురు నామినేటెడ్ సభ్యులు కూడా ఆయనకే ఓటు వేసే అవకాశం ఉంది.

భాషలు బలైపోతున్నయ్

సర్వేలో తేలిన ఆందోళనకర అంశం

న్యూఢిల్లీ: రాబోయే 50 సంవత్సరాలలో ఇప్పుడున్న భారతీయ భాషలలో సగానికి పైగా అంతరించి పోతాయి. ఆనవాళ్లు లేకుండాపోయి మృత భాషలుగా మారుతాయి. ప్రత్యేకించి ఆదివాసీలు, గిరిజనులు మాట్లాడే భాషలకు ఈ పెను ముప్పు పొంచి ఉందని వెల్లడైంది. భాషా వికాసం, పరిణామాలపై పరిశోధనలు నిర్వహించే పీపుల్స్ లింగ్విస్టిక్ సర్వే ఆఫ్ ఇండియా (పిఎస్ఎల్ఐ) ఈ అంశాలను విశ్లేషించింది. దేశంలోని వివిధ భాషలు, వాటిలో ఇమిడి ఉండే యాసలు, ప్రాంతీయ మాండలికాలు వంటి వాటిపై ఈ భాషా వేదిక తాజాగా అధ్యయన పుస్తకాలను ప్రచురించింది. మొత్తం 50 గ్రంథాల సమాహారంగా ఈ విశేష కార్యక్రమం చేపట్టిన సంస్థ ఇప్పటి అధ్యయనాలలో వెల్లడైన అంశాలను తెలిపింది. నూటపాతిక కోట్ల జనాభాను దాటిన భారత్‌లో సగానికి పైగా ప్రజల భాషలు దెబ్బతింటున్నాయని, వీటిని పరిరక్షించేందుకు ప్రభుత్వం సరైన చర్యలు తీసుకోవాలని సూచించారు. దేశంలో ఇప్పటి అంచనాల మేరకు 780 వివిధ భాషలను మాట్లాడేవారు ఉన్నారు. గిరిజనుల మాతృభాషలకు ప్రమాదం ఉందని తెలిపారు. సర్వే వివరాలను సంస్థ ఛైర్మన్ జిఎన్ దేవ్వీ తెలియచేశారు. భాషలు చనిపోతే దానికి అనుబంధంగా ఉండే సంస్కృతి సంప్రదాయాలు కూడా చనిపోయినట్లుగానే భావించుకోవల్సి ఉంటుంది.



పలు కారణాలతో ఒక్క భాష నుంచి మరో భాషకు వలసపోతున్న దుస్థితి ఏర్పడుతూ ఉండటం, మారుతున్న జీవన విధానాలతో పురిటినాటి భాషలకు పలు కారణాలు ఈటెలపోట్లుగా మారుతున్నాయని వెల్లడించారు. పలువురు విద్యావేత్తలు, అధ్యాపకులు ప్రాంతీయ భాషలను రక్షించుకోవల్సి ఉందని తమ అధ్యయనం తరువాత వెల్లడించారు.గిరిజనులు ఎక్కువగా తమ మాతృభాషలను పిల్లలకు అందించలేకపోతున్నారు. పిల్లలు స్కూళ్లకు వెళ్లితే అక్కడ వారికి ఉండే బోధనా మాధ్యమం వేరు కావడం, గుర్తింపు పొందిన భాషలలోనే చదువులు చెప్పడంతో ఇప్పుడు బాలలుగా బడులకు పోతున్న వారంతా యువకులు అయ్యేసరికి తమ తల్లిభాష అనేది ఆనవాళ్లకు కూడా తెలియకుండా మరిచిపోతున్నారు. బీహార్‌లో ప్రాచీనపు భాష మైథ్లీ ఇప్పటిది కాదు వేయి సంవత్సరాల నాటి చరిత్ర ఉంది. దీనితో పాటు పలు ఈ విధమైన భాషలు నామమాత్రంగా నిలిచి ఉంటున్నాయి. ఇక భాషలకు ప్రాణప్రదమైన యాసలు పరాయి భాషలు ఇతరత్రా ఆధిక్యతలతో విలవిలలాడిపోతున్నాయని వెల్లడైంది.



అసోంలోని పలు వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రాహుల్ గాంధీ



బిసి బిల్లుకు రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ మద్దతు : జోగురామన్న

మన తెలంగాణ/హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న బిసి బిల్లుకు రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణంగా మద్దతునిస్తుందని బిసి సంక్షేమ శాఖ మంత్రి జోగురామన్న అన్నారు. మంత్రి నివాసంలో గురువారం తెలంగాణ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో చేపట్టనున్న చలో ఢిల్లీ కార్యక్రమ వాల్‌పోస్టర్‌ను మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జోగురామన్న మాట్లాడుతూ కేంద్ర బిసి కమిషన్ బిల్లుకు రాజ్యాంగ హక్కులు కల్పించడం పట్ల బిసిలకు రావాల్సిన ప్రయోజనాలు, రిజర్వేషన్లు, తదితక అంశాలు ఒక హక్కుగా ఉంటుందన్నారు. చట్టసభల్లో బిసిలకు 33 శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో బిసి సంక్షేమ సంఘం నాయకులు బిక్షపతి, దుర్గయ్యగౌడ్, కుల్కచర్ల శ్రీనివాస్, విక్రంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఉ.కొరియా ప్రమాదాన్ని గుర్తించిన చైనా

వాషింగ్టన్: అణ్వాయుధాలను సమకూర్చుకుంటున్న ఉత్తర కొరియా పెద్ద ప్రమాదంగా పరిణమిస్తున్నదని ఎట్టకేలకు చైనా గ్రహించింది. భద్రతకు సవాలు కాగల సమస్య పరిష్కారానికి కృషిని చైనా ప్రారంభించిందని ఒక ఉన్నత స్థాయి అమెరికా అధికారి పేర్కొన్నారు. విదేశాంగ తాత్కాలిక సహాయ మంత్రి (ఆసియా) సుశాన్ థోర్న్‌టన్ ఈ వ్యాఖ్య చేశారు. ఇప్పటికీ 90 శాతం ఉత్తర కొరియా ఆర్థిక వ్యవస్థ చైనా ద్వారా సాగుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఏ ఇతర దేశం కంటే చైనా ఉత్తర కొరియాపట్ల మెత్తగా ఉంటోంది. అయితే వారితోకలిసి తాము ఉత్తర కొరియాకు వ్యతిరేకంగా సాగిస్తున్న కృషి ఫలిస్తున్నదని ఆయన అన్నారు.

అమెరికా ఆంక్షలు నియమాల ఉల్లంఘనే



టెహ్రాన్: ప్రపంచ దేశాలతో తన అణు ఒప్పందం నియమాలను అమెరికా కొత్త ఆంక్షలు ఉల్లంఘిస్తున్నట్లు ఇరాన్ గురువారం నాడు విమర్శించింది. తన రెండవ హయాం మొదలు పెట్టిన అధ్యక్షుడు హసన్ రౌహానీపై ఒత్తిడి తేవడమే అదని ఇరాన్ పేర్కొంది. తమ దేశాన్ని ఒంటరి చేసే ప్రయత్నాలతో పోరాడుతానని ఆయన ప్రతిన బూనారు. గత మేలో తిరిగి అధ్యక్షునిగా ఎన్నికయిన ఆయన ఆయతోల్లా అలీ కమీనీ స్థానంలో దేశ అత్యున్నత నేత పదవిని స్వీకరించారు. ప్రసంగిస్తూ ఆయన పై హెచ్చరిక చేశారు. ఆయన ప్రమాణానికి ఒక రోజు ముందే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కొత్త ఆంక్షలు ప్రకటించారు. ఇరాన్ అణ్వాయుధ కార్యక్రమాలపై ఆ ఆంక్షలు పరిమితులు విధిస్తున్నాయి.

గట్టెక్కిన బ్రెజిల్ అధ్యక్షుడు

పార్లమెంట్ ఓటులో గెలుపు

బ్రాసిలియా (బ్రెజిల్): అవినీతి ఆరోపణల విషయంలో పార్లమెంట్ ఓటును బ్రెజిల్ అధ్యక్షుడు గెలిచారు. సస్పెండ్ అయ్యే ప్రమాదం నుంచి ఈ గెలుపుద్వారా మైఖేల్ టెమర్ గట్టెక్కారు. 513 మంది సభ్యుల దిగువ సభ డిప్యూటీలలో మూడింట ఒక వంతు మంది (171) ఓట్లు అవసరపడ్డ సమయంలో ఓటింగ్ ముగిసే సరికి ఆయనకు మొత్తం 263 ఓట్లు వచ్చాయి. ఆయనకు వ్యతిరేకంగా 227 మంది ఓటు వేశారు. అయితే ఈ గెలుపు ఆయనకు ఉత్సవాలు జరుపుకునే ఉత్సాహాన్ని ఇవ్వడం లేదు. ఆయనపై అటార్నీ జనరల్ రోడ్రిగో జానోట్ లంచం ఆరోపణలు చేశారు. ఈ నెలాఖరులో జానోట్ తిరిగి ఆయనపై న్యాయం జరగకుండా అడ్డుపడుతున్నట్లు కేసు పెట్టే అవకాశం ఉంది.


పాక్ పని పట్టాల్సిందే : అఫ్ఘన్

వాషింగ్టన్: విదేశీ విధాన లక్ష్యాలను సాధించడం కోసం అడ్డదోవలు తొక్కే దేశాలపై అంతర్జాతీయంగా చర్యలు ప్రారంభం కావాలని అన్యాపదేశంగా పాకిస్థాన్‌ను ప్రస్తావించి అఫ్ఘనిస్తాన్ గురువారం నాడు ప్రకటన చేసింది. తమ దేశంలో టెర్రరిజాన్ని చెలాయించి లబ్ధి పొందుతున్న దేశం ప్రస్తావనను అఫ్ఘన్ చేసింది. అందుకు రుజువులు సమర్పించడం ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో తమ కార్యక్రమమని పేర్కొంది. అమెరికాకు అఫ్ఘన్ రాయబారి హమ్‌దుల్లా మోహిబ్ పిటిఐకి తెలిపారు. గత కొద్ది వారాలుగా అఫ్ఘన్‌లో భీకర టెర్రరిస్టు దాడులు సాగాయి. ఈ నేపథ్యంలో మోహిబ్ ప్రకటనకు ప్రాముఖ్యత పెరిగింది.

ఎఫ్‌బిఐ కొత్త డైరెక్టర్ ప్రమాణం

వాషింగ్టన్: ఎఫ్‌బిఐ కొత్త డైరెక్టర్‌గా క్రిస్టొఫర్ రె గురువారం నాడు పదవిని చేపట్టారు. అమెరికా ప్రయోజనాల కోసం పని చేస్తానని ఆయన ప్రతిన బూనారు. 50 ఏళ్ల రె అమెరికా మాజీ అసిస్టెంట్ అటార్నీ. జెమ్స్ కోమీ స్థానంలో ఆయన ఆ పదవిలోకి వచ్చారు. రష్యాతో కుమ్మక్కైనట్లు ట్రంప్‌పై వచ్చిన ఆరోపణల దర్యాప్తులో కోమీ ఉద్వాసనకు గురయ్యారు. స్వయంగా ట్రంప్ కోమీని సాగనంపారు. దీనితో ఎఫ్‌బిఐ 8వ డైరెక్టర్‌గా రె పదవీ స్వీకారం చేశారు. ఆయన నియామకాన్ని 925 ఓట్లతో అమెరికా సెనెట్ ధ్రువీకరించింది.

గిరిజన క్రీడాకారునికి అభినందన



మన తెలంగాణ / హైదరాబాద్ : శ్రీలంక రాజధాని కొలంబోలో జరిగిన 3వ స్టూడెంట్స్ ఒలింపిక్స్ ఇంటర్నేషనల్‌లో నాగర్ కర్నూల్ జిల్లా పదర మండలం ఇప్పలపల్లి గ్రామానికి చెందిన గిరిజన విద్యార్థి తిరుపతి నాయక్ జుడో క్రీడల విభాగంలో పాల్గొని గోల్డ్ మెడల్ సాధించడం పట్ల తెలంగాణ పర్యాటక, క్రీడా శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం అభినందించారు. తెలంగాణ రాష్ట్ర క్రీడాకారులు ఒలింపిక్స్‌లో పథకాలు సాధించడమే లక్ష్యంగా సాగాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి, క్రీడాకారులను ప్రోత్సాహానికి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ అల్లిపురం వెంకటేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా భవిష్యత్తులోనూ క్రీడా పోటీలలో పాల్గొనడానికి తిరుపతి నాయక్‌కు ప్రభుత్వం తరపున ఆర్థిక సాయాన్ని అందించడానికి కృషి చేయాలని చైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి చేసిన విజ్ఞప్తికి బుర్రా వెంకటేశం సానుకూలంగా స్పందించారు.

సిసిఎంబి శాస్త్రవేత్త పిఎం భార్గవ మృతి పట్ల సంతాపం

మన తెలంగాణ /హైదరాబాద్ : సిసిఎంబికి చెందిన ప్రముఖ శాస్త్రవేత్త పిఎం భార్గవ మృతి పట్ల ఫోరం ఫర్ ఏ బెటర్ హైదరాబాద్ అధ్యక్షులు వేద కుమార్ ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. పర్యావరణం, సైన్స్, కళలు, సంస్కృతి, పరిరక్షణ వంటి అంశాల్లో భార్గవ అభిప్రాయాలను తాము తీసుకున్నామన్నారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నట్లు వేద కుమార్ వెల్లడించారు.

అమెరికా ఆంక్షలు ఆర్థిక యుద్ధమే

రష్యా ప్రధాని ధ్వజం



మాస్కో: అమెరికా ప్రకటించిన కొత్త ఆంక్షలు పూర్తిస్థాయి ఆర్థిక యుద్ధంగా రష్యా ప్రధాని డిమిట్రీ మెద్వేదేవ్ అభివర్ణించారు. అమెరికాతో సంబంధాల మెరుగు ఆశలను ఆ ఆంక్షలు కుంగదీసినట్లు ఆయన పేర్కొన్నారు. అధ్యక్షుడు ట్రంప్ బలహీనతను చాలా అవమానకర పద్ధతిలో ఆ ఆంక్షలు వెల్లడిస్తున్నాయన్నారు. గత బుధవారం నాడు ట్రంప్ ఈ ఆంక్షలను అయిష్టంగా ఆమోదించారు. అందుకు సంబంధించిన బిల్లును తొక్కిపెట్టడంలో వైట్ హౌస్ విఫలం అయింది. కనీసం దానిని నీరుగార్చించే విధంగా సవరించలేకపోయింది. తర్వాత తప్పనిసరి పరిస్థితిల్లో ఆంక్షలను ట్రంప్ ప్రకటించారు. ఆ చర్యకు తప్పనిసరిగా పర్యవసానాలు ఉంటాయని మెద్వేదేవ్ అన్నారు. అది పూర్తిస్థాయి ఆర్థిక యుద్ధ ప్రకటన తప్ప మరొటికాదని ఆయన పేర్కొన్నారు. ఆంక్షల శాసనాన్ని ఆమోదించే తొందరలో అమెరికా కాంగ్రెస్ అనేక రాజ్యాంగ వ్యతిరేక నిబంధనలను చేర్చిందని, వాటిలో రష్యాతో సంప్రదింపులు జరపడానికి అమెరికా అధ్యక్షునికిగల అధికారంపై పరిమితులు కూడా భాగమని మెద్వేదేవ్ అన్నారు. ఉత్తర కొరియా, ఇరాన్‌లపై రష్యా ఇంధన రంగాన్ని గురిపెట్టి ఆంక్షలను అదే శాసనంలో భాగంగా విధించారు. రష్యా పైప్‌లైన్లు అభివృద్ధి చేయగల కంపెనీలపై ఆంక్షలు విధించే అధికారాన్ని ఆ ఉత్తర్వుల కింద ట్రంప్ కలిగి ఉన్నారు. అలాగే కొన్ని రష్యా అయుధాల ఎగుమతి సంస్థలపై కూడా ట్రంప్ ఆంక్షలు విధించారు. విదేశాంగ శాఖ వ్యవహారాలపట్ల రాజ్యాంగంలో లోపాలున్నట్లు ఈ ఆంక్షల విధింపు సందర్భంగా ట్రంప్ చేసిన విమర్శను రిపబ్లికన్ సెనెటర్ జాన్ మెకెన్ తిప్పికొట్టారు. రాజ్యాంగం శాసన సభకు, అధ్యక్షునికి దేశంపట్ల సమాన బాధ్యతలను పంచిందని ఆయన పేర్కొన్నారు. 2016 అమెరికా అధ్యక్ష ఎన్నికల ప్రక్రియలో ప్రమేయం కల్పించుకొన్నందుకు రష్యా ప్రభుత్వాన్ని శిక్షించడమే ఈ ఆంక్షల ఉద్దేశంగా కనపడుతోంది.

కార్మికుల కనీస వేతనం పెంపు

కేంద్రమంత్రి బండారు దత్తాత్రేయ



మన తెలంగాణ/న్యూఢిల్లీ: దేశంలో అసంఘటిత రంగంలో ఉన్న వ్యవసాయ కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు, బీడి కార్మికులు, బొగ్గుగని కార్మికుల రోజువారీ కనీస వేతనాన్ని దాదాపు 42 శాతం పెంచుతూ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర కార్మిక మరియు ఉపాధి కల్పన శాఖ మంత్రి బండారు దత్తాత్రేయ తెలిపారు. నేషనల్ మినిమమ్ వేజెస్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఎ.గోవర్ధన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు దత్తాత్రేయ చెప్పారు. 2010వ సంవత్సరం తరువాత మినిమమ్ వేజెస్ అడ్వైజరీ బోర్డు క్రియాశీలకంగా లేదని తాను వచ్చిన తరువాత ఈ సంవత్సరమే ఆ బోర్డు చైర్మన్ గా ఎ.గోవర్ధన్ ని నియమించినట్లు తెలియజేశారు. నేను నియమించిన బోర్డు చైర్మన్, సభ్యులు ఈ రోజు సమవేశమై అసంఘటిత రంగ కార్మికులకు కనీస వేతన పరిమితిని పెంచుతూ నిర్ణయం తీసుకోవడం నాకు చాలా సంతోషం కలిగించిందని దత్తాత్రేయ పేర్కొన్నారు. ఈ నూతన వేతన పెంపు వల్ల లక్షలాది మంది కార్మికుల జీవితాల్లో వెలుగులు నిండుతాయని దత్తాత్రేయ ఆశాభావం వ్యక్తం చేశారు. గురువారం జరిగిన బోర్డు సమావేశంలో కనీస వేతనాలపై లోతైన చర్చజరిగిందని వ్యవసాయ కార్మికులను ఇప్పుడున్న కనీస వేతనం 211 నుంచి 300 రూపాయలకు, వ్యవసాయేతర కార్మికుల కనీస వేతనం 250 నుంచి 350 రూపాయలకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. దేశ స్వాతంత్రం వచ్చిన తరువాత ఇదే అతిపెద్ద పెంపు అని కేంద్ర మంత్రితత చెప్పారు. 1948వ సంవత్సరంలో రూపొందించిన కనీస వేతన చట్టం ఇప్పటి వరకూ కొనసాగుతోందని... కేంద్రంలో నరేంద్రమోడీ ప్రభుత్వం వచ్చాక కనీస వేతన చట్టంలోని నామ్స్ దెబ్బతినకుండా కార్మికులకు అనుకూలంగా పలు మార్పులు తీసుకురావడానికి ఒక సబ్ కమిటీ నియమించినట్లు దత్తాత్రేయ తెలిపారు. కార్మికుల స్థితిగతుల, కుటుంబ సభ్యులు, పిల్లలు ఇలా అన్నింటినీ పరిశీలించి నివేదిక రూపొందిస్తుందని చెప్పారు. అలాగే ప్రతి రాష్ట్రంలో మినమమ్ వేజెస్ అడ్వైజరీ బోర్డులను ఏర్పాటు చెయ్యాలని సలహా ఇచ్చారు. ఈ బోర్డు లేకపోవడం వల్ల కనీస వేతన చట్టం అమలవుతోందా లేదా అనే మానిటరింగ్ జరగదని అభిప్రాయపడ్డారు. ఈ విషయంపై మా శాఖ కార్యదర్శి అన్ని రాష్ట్రాల కార్మిక శాఖ మంత్రులకు, కార్యదర్శులకు లేఖలు రాస్తారని, నేను కూడా అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులకు మినిమమ్ వేజెస్ అడ్వైజరీ బోర్డులను నిమించాలని లేఖలు రాస్తానని కేంద్ర మంత్ర బండారు దత్తాత్రేయ తెలిపారు.

హోర్డింగ్‌లో అక్రమాలు



మన తెలంగాణ/హైదరాబాద్: గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ హోర్డింగ్స్‌లో అక్రమాలు జరుగుతున్నాయని, వాటిని నియంత్రిస్తే, ఆ నిధులతో అనేక సంక్షేమ కార్యక్రమాలను చేపట్టేందుకు అవకాశముందని తెలంగాణ జెఎసి చైర్మన్ ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ అన్నారు. ప్రతి చిన్న విషయానికి హడావుడి చేసే జిహెచ్ఎంసి, అక్రమ హోర్డింగ్‌ల విషయంలో ఎందుకు స్పదించడం లేదని ప్రశ్నించారు. జిహెచ్ఎంసికి చెందిన ఆదాయానికి గండిపడుతున్న విషయాన్ని గుర్తు చేయాల్సిన పరిస్థితులు వచ్చాయన్నారు. హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో తెలంగాణ వనరుల పరిరక్షణ కమిటీ ఆర్‌టిఐ ద్వారా సేకరించిన జిహెచ్ ఎంసి హోర్డింగ్ వివరాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా కోదండరామ్ మాట్లాడుతూ 2300 అక్రమ హోర్డింగులపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో స్పష్టం చేయాలని సాక్షాత్తూ న్యాయస్థానం సూచించినా జిహెచ్ఎంసి పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. జిహెచ్ఎంసి పరిధిలో కేవలం 17 హోర్డింగ్‌లు 8350 విస్తీర్ణానికి అనుమతి పొంది,17,900 విస్తీర్ణ అడుగులో హోర్డింగులు పెట్టినట్లు పరిరక్షణ కమిటీ గుర్తించిందని, జిహెచ్ఎంసిలో ఇలాంటివి చాలా ఉన్నాయని, ఇలాంటి వాటి నుంచి పెద్ద మొత్తంలోనే జిహెచ్ఎంసికి నష్టం జరుగుతుందని చెప్పారు. నిబంధనల మేరకు హోర్డింగ్‌ల అక్రమాలను అరికడితే, జిహెచ్ఎంసికి అధిక ఆదాయం వస్తుందని, తద్వారా చిన్నచిన్న వ్యాపారులకు రాయితీలు కల్పించడంతో పాటు మురికివాడల్లో అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టే అవకాశం ఉంటుందని తెలిపారు. తెలంగాణ వనరుల పరిరక్షణ కమిటీ గోర శ్యామ్ సుందర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి హరితరుదా మాట్లాడుతూ అక్రమ హోర్డింగ్‌ల ద్వారా జిహెచ్ఎంసి మూడేళ్లలో హోర్డింగ్స్‌లలో రూ.450 కోట్లు నష్టపోయిందన్నారు. ప్రతి ఏటా రూ. 150 కోట్లు నష్టపోతున్నదని, ఈ విషయమై జిహెచ్ఎంసికి దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోవడంతోనే తాము న్యాయస్థానాన్ని ఆశ్రయించామని చెప్పారు. హోర్డింగ్స్‌లలో అక్రమాలు జరిగినట్లు తమ వద్ద పూర్తి ఆధారాలు ఉన్నాయని, ఇప్పటికైనా జిహెచ్ఎంసి అక్రమ హోర్డింగ్‌లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రతిభ ఆధార వలసలకు ట్రంప్ ప్రాధాన్యం

వాషింగ్టన్: అమెరికాలోకి చట్టబద్ధంగా వలసవచ్చే వారి సంఖ్య సగానికి సగం తగ్గించివేసే శాసనానికి అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ గురువారం నాడు తన మద్దతు ప్రకటించారు. ఇంగ్లీషు భాష మాట్లాడే నైపుణ్య కార్మికుల వలసలనే ప్రతిభ ఆధారంగా ప్రోత్సహించే విధానానికి ఆయన మద్దతు పలికారు. ‘ పటిష్టమైన ఉపాధి వ్యవస్థకు అమెరికా వలసల చట్టాన్ని సంస్కరణ (రైజ్)’ బిల్లు దాని పేరు. అది ఆమోదం పొందితే అత్యంత ఉన్నత చదువులు గల టెక్నాలజీ వృత్తి నిపుణులకు ప్రయోజనం చేకూర్చగలదు. భారత దేశంలో అటువంటి నిపుణులకు అది బాగా ఉపయోగపడగలదు. అమెరికా ప్రవేశానికి ప్రస్తుతం అనుసరిస్తున్న లాటరీ పద్ధతి ఆ బిల్లు ఆమోదం పొందితే రద్దు అయిపోతుంది. దాని స్థానంలో పాయింట్ల ఆధారంగా గ్రీన్ కార్డు వలసలను నిర్ణయించే వ్యవస్థ వస్తుంది. రైజ్ శాసనానికి ట్రంప్ తన మద్దతును వైట్ హౌస్ వద్ద ఒక ఉత్సవంలో ప్రకటించారు. ఆ బిల్లు రచయితలయిన సెనెటర్లు టామ్ కాటన్, డేవిడ్ పెర్డ్యూ పక్కన నిలబడి ఆయన ఈ ప్రకటన చేశారు.

అజర్‌పై ఐరాస చర్యకు మళ్లీ చైనా అడ్డు

ఐక్యరాజ్య సమితి : పాకిస్థాన్‌లోని జైష్ ఎ మహమ్మద్ గ్రూపు అధిపతి మాసూద్ అజహర్‌ను అంతర్జాతీయ టెర్రరిస్ట్ గా ప్రకటించడానికి అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్ మద్దతు గల ప్రతిపాదనను ఐక్యరాజ్య సమితిలో చైనా తిరిగి అడ్డుకొంది. మరి మూడు నెలల పాటు ఆ ప్రకటన వాయిదా పడేలా మళ్లీ చక్రం తిప్పింది. గత ఫిబ్రవరిలో కూడా అందుకు అమెరికా జరిపిన ప్రయత్నాన్ని చైనా అడ్డుకొంది. ఈ నెల 2న అప్పటి వాయిదా గడువు ముగిసింది. తాజాగా ఆ గడువును మరి మూడు నెలలు చైనా పొడిగించింది.

సృజనాత్మకత, నవకల్పనలకు పెద్దపీట

లిటరరీ ఫెస్ట్ ప్రారంభోత్సవంలో గీతం ప్రొ విసి



మన తెలంగాణ/హైదరాబాద్ : విద్యార్థుల్లో సృజనాత్మక శక్తిని పెంపొందించేందుకు, వారిలో ఆలోచనలను రేకెత్తించి నవకల్పనలు చేసేలా తాము ప్రోత్సహిస్తున్నట్లు గీతం విశ్వవిద్యాలయం ప్రో వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎన్.శివప్రసాద్ చెప్పారు. ‘లవుజ్‌ఒఫీలియా’ పేరిట జరిగిన (సాహిత్యోత్సవాన్ని) లిటరరీ ఫెస్ట్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ‘కెఎన్‌ఒడబ్ల్యూనో’ పేరుతో రూపొందించిన గీతం ఆన్‌లైన్ న్యూస్‌లెటర్‌ను ఆవిష్కరించారు. ఇంజనీరింగ్ విద్యార్థులు సాహిత్యం, కళలు, సృజనాత్మకతల మేలు కలయికతో ఉత్సవాలు నిర్వహించడం ముదావహమని అన్నారు. ఈ కార్యక్రమంలో గీతం రెసిడెంట్ డైరెక్టర్ డివివిఎస్ఆర్ వర్మ, బిజినెస్ స్కూల్ డీన్ అండ్ డైరెక్టర్ ప్రొఫెసర్ వై.లక్ష్మణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంప్రదాయ నృత్యంతో శ్రీకారం చుట్టుకున్న లిటరరీ ఫెస్ట్‌లో మినిమల్ టేల్, బ్లాగ్ఎథాస్, షోస్ క్విజ్‌నోస్, జామ్, డిబాటల్, పొయట్రీ హబ్, స్క్రిప్ట్ క్రాఫ్ట్, పోస్టర్ మాస్టర్, కామిక్ టానిక్, క్వోట్ ఆప్ వంటి పలు విభిన్న కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాలలో న్యాయనిర్ణేతలుగా అధ్యాపకులు పాల్గొని విజేతలను ఎంపిక చేశారు. ముంబై నుంచి వచ్చిన సౌరబ్ పంత్ తన హాస్య చతురతతో అందరికీ కడుపుబ్బ నవ్వించారు.

చేనేత దినోత్సవంపై అవగాహన కార్యక్రమాలు


మన తెలంగాణ / హైదరాబాద్ : ఈ నెల 8న ప్రపంచ చేనేత దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని నాల్గు విశ్వవిద్యాలయాల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని క్షేత్ర ప్రచార విభాగం హైదరాబాద్ ప్రాంతీయ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఆగస్ట్ 4 నుండి 7వ తేదీ వరకు జరిగే ఈ కార్యక్రమాల్లో చేనేత వస్త్రాల ప్రదర్శన, అమ్మకం, విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించనున్నామన్నారు.

బ్యూటీషియన్ ఆధునాతన యంత్రాల ప్రదర్శన

మన తెలంగాణ/హైదరాబాద్: ఈనెల 8న నాయీ బ్రాహ్మణు కోసం హేర్ స్టైల్స్, బ్యూటీషియన్‌పై ఆధునాతన యంత్రాల ప్రదర్శన, సదస్సు నిర్వహించనున్నట్లు తెలంగాణ రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సహకార సంఘాల సమాఖ్య తెలిపింది. హైదరాబాద్‌లోని బేగంపేటలోని యుఎస్ కన్సూలెట్ వద్ద ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రదర్శన ఉంటుందని గురువారం ఒక ప్రకటనలో తెలిపింది.

తెలంగాణలో పోలీసు రాజ్యం

రాష్ట్రంలో ముగిసిన లాంగ్ మార్చ్



జిల్లాల నుంచి మన తెలంగాణ ప్రతినిధులు : రాష్ట్రంలో పోలీసు రాజ్యం కొనసాగుతున్నదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు గుండా మల్లేశ్ అన్నారు. ఎఐఎస్ఎఫ్,ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న లాంగ్ మార్చ్ గురువారం మంచిర్యాల జిల్లాకు చేరుకున్న సందర్భంగా స్థానికి ఐబి చౌరస్తాలో ఏర్పాటు చేసిన సభలో ఆయన ప్రసంగించారు. దళితులు, గిరిజనులపై పాశవిక దాడులు కొనసాగుతున్నా పట్టించుకునే నాధుడు కరువయ్యాడన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోసపూరిత పాలన సాగిస్తున్నాయని,ఎన్నికల్లో ఇచ్చిన హామీలను విస్మరించి ప్రజలను మాయ మాటలతో మభ్యపెడుతున్నారన్నారు. ఎఐఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షుడు వలి ఉల్లా ఖాద్రి, ఎఐవైఫ్ జాతీయ అధ్యక్షుడు అల్తాఫ్ ఆలం ఖాన్‌లు మాట్లాడుతూ నిరుద్యోగ యువతీయువకులకు అండగా తమ పోరాటం సాగుతుందని,అందులో భాగంగానే యువతను చైతన్యపరిచేందుకు లాంగ్ మార్చ్ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. తొలుత ఐబి చౌరస్తాలో లాంగ్ మార్చ్‌కు సిపిఐ నాయకులు,విద్యార్థులు, యువకులు ఘన స్వాగతం పలికారు. ఇదిలా ఉండగా కరీంనగర్ పట్టణంలో ఏర్పాటు చేసిన సభలో ఎఐఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షుడు సయ్యద్ వలీ ఉల్లా ఖాద్రి,ఎఐవైఫ్ జాతీయ అధ్యక్షుడు అల్లాఫ్ ఆలం ఖాన్‌లు మాట్లాడుతూ విద్య, ఉపాధి కల్పనలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం చెందాయని ఆరోపించారు. విద్యారంగంలో శాస్త్రీయ, కామన్ విద్యా విధానాన్ని అమలు చేయడంతోపాటు, విదేశీ విద్యాలయాల చొరబాటును అరికట్టాలని డిమాండ్ చేశారు.

సిఎస్‌ను కలిసిన యునిసెఫ్ ప్రతినిధి యాస్మిన్ హేక్



మన తెలంగాణ/హైదరాబాద్ : యునిసెఫ్‌కు కొత్తగా నియమితులైన భారత ప్రతినిధి డాక్టర్ యాస్మిన్ హేక్ గురువారం సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.పి.సింగ్‌ను కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, కెసిఆర్ కిట్, ఒంటరి మహిళ పెన్షన్, ప్రభుత్వ ఆసుపత్రుల ఆధునీకరణ వంటి ప్రతిష్టాత్మక పథకాల గురించి సిఎస్ వివరించారు. మిషన్ భగీరథకు మద్దతిస్తున్న యునిసెఫ్‌కు సిఎస్ ధన్యవాదాలు తెలిపారు.

ప్రభుత్వం, పోలీసులతోనే ఇసుక మాఫియా నడుస్తోంది



మన తెలంగాణ/ వేములవాడ అర్బన్ (రాజన్న సిరిసిల్ల జిల్లా): రాష్ట్రంలో ఇసుక మాఫీయా ప్రభుత్వం, పోలీసులతోనే నడుస్తుందని బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి పొల్సాని మురలీధర్‌రావు అన్నారు. గురువారం పట్టణ బిజెపి పార్టీ కార్యాలయంలో పోలీసుల చేతిలో దెబ్బలు తిన్న నేరేళ్ళ బాధితులను ఆయన పరామర్శించారు. కోర్టు వేములవాడ పట్టణంలోనే నివాసం ఉండాలన్న షరతుతో బెయిల్ మంజూ రు చేయగా వీరిజి బిజెపి జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ పట్టణంలోని ప్రైవేటు అద్దె గదుల్లో వసతిని సమకూర్చారు. ఈ తరుణంలోనే వారిని పరామర్శించిన అనంతరం ఆయన మాట్లాడుతూ పోలీసులు వ్యవహరించిన హింసను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇలాంటి కిరాతక పోలీసులకు ప్రభుత్వం వత్తాసు పలుకుతుందని ఆరోపించారు. ప్రభుత్వం జరిగిన సంఘటనలపై పూర్తిస్థాయి బాధ్యత వహించాలన్నారు. నేరేళ్ళ బాధితులకు ప్రభుత్వం క్షమాపణ చెప్పి తీరాల్సిందేనన్నారు. ప్రజలను భయబ్రాంతులకు గురిచేయడానికి మాత్రమే ఇలాంటి చర్యలకు పాల్పడుతుని ఆరోపించారు. అనంతరం వారిని పట్టణంలోని వెంకటేశ్వర నర్సింగ్ హోమ్‌కు నాయకులు తీసుకెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సమావేశంలో బిజెపి జిల్లా అధ్యక్షులు ప్రతాప రామకృష్ణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆది శ్రీనివాస్, జిల్లా ఇన్‌ఛార్జి రావుల రామ్‌నాథ్, జిల్లా మహిళా అధక్షులు రాలు గడ్డం లత, ప్రధాన కార్యదర్శులు రేగుల మల్లిఖార్జున్, ఆడెపు రవీందర్, ఉపాధ్యక్షులు యాచమనేని శ్రీనివాసరావు, కూరగాయల శ్రీశైలం, ఎరెడ్డి రాజిరెడ్డి, మండలాధ్యక్షులు బండ మల్లేశంయాదవ్, పట్టణాధ్యక్షులు జంగం రాజేందర్, లింగంపల్లి శంకర్, మార్త సత్తయ్య పెంట నరేశ్, బోనాల శివ, సంటి మహేశ్, ద్యావనపల్లి గంగాధర్, తదితరులు ఉన్నారు.

స్పోర్ట్స్ జర్నలిస్ట్ కౌషిక్‌కు విరాట్ గిఫ్ట్



కొలంబో : ప్రముఖ స్పోర్ట్స్ జర్నలిస్ట్, విజ్డెన్ ఇండియా మేనేజింగ్ ఎడిటర్ ఆర్.కౌషిక్‌కు భారత కెప్టెన్ విరాట్ కోహ్లి అరుదైన బహుమతిని అందజేశాడు. తన కెరీర్‌లో వందో టెస్ట్ మ్యాచ్‌ను కవర్ చేస్తున్న కౌషిక్‌కు కోహ్లి టీమిండియా జెర్సీని బహూకరించాడు. భారత్, శ్రీలంక జట్ల మధ్య గురువారం ప్రారంభమైన రెండో టెస్టును పురస్కరించుకుని నిర్వహించిన మీడియా సమావేశంలో కోహ్లి ఈ బహుమతిని కౌషిక్‌కు అందజేశాడు. ఈ సందర్భంగా కోహ్లి మాట్లాడుతూ విశ్లేషకుడిగా కౌషిక్ అందించిన సేవలను కొనియాడాడు. తాను చూసిన అత్యుత్తమ క్రీడా ప్రతినిధులలో కౌషిక్ ఒకరని ప్రశంసించాడు. ఉన్నది ఉన్నట్టుగా రాయడంలో, ఆటగాళ్ల వైఫల్యాలను ఎత్తి చూపడంలో కౌషిక్‌కు ఎవరూ సాటిరారని కోహ్లి అన్నాడు. తాను కెరీర్ ప్రారంభించి నప్పటినుంచి కౌషిక్ కథనాలను తప్పనిసరిగా చదువుతానని ఈ సందర్భంగా కోహ్లి గుర్తు చేశాడు. ఆయన కథనాల్లో చాలా వరకు వాస్తవాలే ఉంటాయన్నాడు. చాలా సందర్భాల్లో ఇటువంటి కథనాలను చదివి తాను ఆటను మెరుగు పరుచుకున్న విషయాన్ని కోహ్లి ప్రస్తావించాడు. కాగా, తనకు అరుదైన బహుమతిని అందజేసిన టీమిండియా సారథి కోహ్లికి కౌషిక్ కృతజ్ఞతలు తెలిపారు.



సర్దార్ సింగ్, దేవేంద్రలకు ఖేల్‌రత్న!

న్యూఢిల్లీ : క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభను కనబరిచే క్రీడాకారులకు ఇచ్చే ఉత్తమ అవార్డులు ఖేల్‌రత్న, అర్జున అవార్డుల సిఫార్సుల జాబితాలో హాకీ స్టార్ సర్దార్ సింగ్, క్రికెటర్లు చతేశ్వర్ పుజారా, హర్మన్‌ప్రీత్ కౌర్‌లకు చోటు దక్కింది. క్రీడల్లో అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చే వారికి ప్రతి ఏటా ఖేల్‌రత్న, అర్జున అవార్డులతో కేంద్ర ప్రభుత్వం సత్కరించడం ఆనవాయితీగా వస్తున్న విషయం తెలిసిందే. ఈసారి ప్రతిష్టాత్మకమైన ఖేల్ రత్న అవార్డుల కోసం ప్రతిపాదించిన వారిలో భారత హాకీ జట్టు కెప్టెన్ సర్దార్ సింగ్, పారాలింపియన్ దేవేంద్ర ఝఝారియాలు ఉన్నారు. భారత హాకీకు చిరస్మరణీయ సేవలు అందించిన సర్దార్ సింగ్‌కు ప్రతిష్టాత్మకమైన ఈ జాబితాలో చోటు లభించింది. కెప్టెన్‌గా, ఆటగాడిగా సర్దార్ భారత హాకీకి అందించిన సేవలను గుర్తించి అతని పేరును హాకీ సమాఖ్య



ఈ ఉత్తమ అవార్డు కోసం సిఫార్సు చేసింది. ఇక, పారాలింపియన్ దేవేంద్రకు కూడా ఈ జాబితాలో స్థానం లభించింది. దివ్యంగుల ఒలింపిక్స్‌లో దేవేంద్ర అసాధారణ ఆటతో జావెలిన్ త్రో అంశంలో రెండు స్వర్ణాలు గెలిచిన విషయం తెలిసిందే. ఒక పారా అథ్లెట్‌కు ఈ అవార్డుల జాబితాలో చోటు లభించడం ఇదే తొలిసారి కావడం విశేషం.

పుజారా, కౌర్‌లకు అర్జున

మరోవైపు స్టార్ క్రికెటర్ చతేశ్వర్ పుజారా, మహిళా క్రికెటర్ హర్మన్‌ప్రీత్ కౌర్‌లకు అర్జున అవార్డుల జాబితాలో చోటు దక్కింది. భారత క్రికెట్‌కు వీరందించిన సేవలను గుర్తించి బిసిసిఐ వీరి పేర్లను సిఫార్సు చేసింది. వీరిద్దరికే కాక మరో 15 మందికి అర్జున అవార్డులతో సత్కరించనున్నారు. పారాలింపియన్ మరియప్పన్ తంగవేలు, గోల్ఫర్ శివ్ చౌరాసియా, సాకేత్ మైనేని, ప్రశాంతి సింగ్, ఎస్వి సునీల్, అంతోని అమల్‌రాజ్, దేవేంద్రో సింగ్, బింబాదేవి, వరుణ్ భాటి, జస్విర్ సింగ్ తదితరులు ఉన్నారు.

మిథాలీ రాజ్‌పై బిసిసిఐ చిన్న చూపు

భారత మహిళా క్రికెట్ కెప్టెన్ మిథాలీ రాజ్‌పై భారత క్రికెట్ బోర్డు మరోసారి చిన్న చూపు చూసింది. క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభకు గాను కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏటా ఇచ్చే అవార్డుల కోసం మిథాలీ పేరును ప్రతిపాదించడంలో బిసిసిఐ విఫలమైంది. కెప్టెన్‌గా టీ మిండియాను రెండు సార్లు ఫైనల్‌కు చేర్చిన ఘన త మిథాలీకే దక్కుతుంది. అంతేగాక మహిళల వన్డేల్లో అత్యధిక పరుగులు సాధించిన రికార్డు కూ డా మిథాలీ సొంతం. కానీ మిథాలీ పేరును ప్రతిష్ఠాత్మకమైన ఖేల్‌రత్న అవార్డు కోసం సిఫార్సు చేయడంలో భారత క్రికెట్ బోర్డు విఫలమైంది. ఒక వేళ మిథాలీ పేరును ప్రతిపాదించి ఉంటే ఆమెకు ఖేల్‌రత్న అవార్డు కచ్చితంగా వచ్చి ఉండేదని విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. కేవలం హర్మన్‌ప్రీత్ కౌర్, చతేశ్వర్ పుజారాల పేర్లను అర్జున అవార్డుల కోసం సిఫార్సు చేసి చేతులు దులుపుకొంది. అయితే భారత మహిళా క్రికెట్‌కు దాదాపు రెండు దశాబ్దాలుగా సేవలు చేస్తున్న మిథాలీపై మరోసారి నిర్లక్ష్యమే ప్రదర్శించింది. ఆమె పేరును ఖేల్‌రత్నకు ప్రతిపాదించకుండా బిసిసిఐ పెద్ద తప్పిదమే చేసిందని చెప్పక తప్పదు.

పరుగుల వరద..!

- సెంచరీలతో కదం తొక్కిన పుజారా, రహానె
- భారత్ 344/3, లంకతో రెండో టెస్టు



కొలంబో : శ్రీలంకతో గురువారం ప్రారంభమైన రెండో టెస్టులో తొలి రోజే భారత్ పైచేయి సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ చేపట్టిన భారత్ మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 3 వికెట్ల నష్టానికి 344 పరుగులు చేసింది. చతేశ్వర్ పుజారా 128(బ్యాటింగ్), అజింక్య రహానె 103(బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. వీరిద్దరూ అజేయ శతకాలతో చెలరేగడంతో టీమిండియా భారీ స్కోరు దిశగా సాగుతోంది. దీంతో ఈ మ్యాచ్‌లోనూ లంకకు కష్టాలు తప్పేలా లేవు.

ధావన్ జోరు...

బ్యాటింగ్ చేపట్టిన భారత్‌కు ఓపెనర్లు శిఖర్ ధావన్, కెఎల్.రాహుల్ శుభారంభం అందించారు. ఇద్దరూ లంక బౌలర్లను ధీటుగా ఎదుర్కొంటూ ముందుకు సాగారు. ధావన్ తన మార్క్ షాట్లతో చెలరేగి పోయాడు. రాహుల్ కూడా ధాటిగా ఆడాడు. ఇద్దరు వేగంగా ఆడడంతో భారత్ స్కోరు పది ఓవర్లలోపే 50కి చేరింది. అయితే 37 బంతుల్లో ఐదు ఫోర్లు, ఒక సిక్సర్‌తో 35 పరుగులు చేసిన ధావన్‌ను పెరీరా పెవిలియన్ పంపించాడు. దీంతో 56 పరుగుల తొలి వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. ఈ దశలో బ్యాటింగ్‌కు వచ్చిన 50వ టెస్ట్ మ్యాచ్ హీరో పుజారాతో కలిసి మరో ఓపెనర్ రాహుల్ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. పుజారా ఆత్మరక్షణతో బ్యాటింగ్ చేయగా, రాహుల్ తన మార్క్ షాట్లతో అలరించాడు. ఇద్దరు కుదురుగా ఆడడంతో భారత్ మరో కీలక భాగస్వామ్యం నమోదైంది. అయితే ఏడు ఫోర్లతో 57 పరుగులు చేసిన రాహుల్ లేని పరుగు కోసం వెళ్లి రనౌటయ్యాడు. ఆ తర్వాత వచ్చిన కెప్టెన్ విరాట్ కోహ్లి ఎక్కువ సేపు క్రీజులో నిలువలేక పోయాడు. కేవలం 13 పరుగులు మాత్రమే చేసి హెరాత్ బౌలింగ్‌లో పెవిలియన్ చేరాడు. దీంతో భారత్ 133 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయి కాస్త చిక్కుల్లో పడినట్టు కనిపించింది.

పుజారా, రహానె జోరు..

ఈ ఆనందం లంకకు కొద్ది సేపే దక్కింది. రహానె రాకతో పుజారా తన వేగాన్ని పెంచాడు. ఇద్దరు పోటీ పడి షాట్లు కొట్టడంతో అప్పటి వరకు నత్తనడకన సాగుతున్న స్కోరు బోర్డు వేగం పుంజుకుంది. వీరిని ఔట్ చేసేందుకు లంక బౌలర్లు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. సమన్వయంతో బ్యాటింగ్ చేసిన పుజారా ఐదు ఫోర్లతో అర్ధ సెంచరీని పూర్తి చేశాడు. ఇదే క్రమంలో భారత స్కోరును 200 దాటించాడు. రహానె తన మార్క్ ఆటతో లంక బౌలర్లను ముప్పతిప్పలు పెట్టాడు. ఒకవైపు వికెట్‌ను కాపాడుకుంటూనే చెత్త బంతులను బౌండరీలకు తరలిస్తూ స్కోరును పరిగెత్తించాడు. వీరిని ఔట్ చేసేందుకు లంక బౌలర్లు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. కుదురుగా ఆడుతూ కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పి భారత్‌ను సురక్షిత స్థితికి చేర్చారు. ఈ క్రమంలో ఇద్దరు సెంచరీలను పూర్తి చేశారు. అద్భుత ఇన్నింగ్స్‌ను ఆడిన పుజారా 164 బంతుల్లో 9ఫోర్లు, ఒక సిక్సర్‌తో సెంచరీని అందుకున్నాడు. ఇదే క్రమంలో నాలుగో వికెట్‌కు 200 పరుగుల భాగస్వామ్యాన్ని కూడా పూర్తి చేశారు. మరోవైపు కీలక ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్న రహానె 151 బంతుల్లో 12 ఫోర్లతో సెంచరీని అందుకున్నాడు. దీంతో మొదటి రోజు ఆట ముగిసే సమయానికి భారత్ 90 ఓవర్లలో 3వికెట్ల నష్టానికి 344 పరుగులు చేసింది.

స్కోరు బోర్డు:

భారత్ మొదటి ఇన్నింగ్స్: శిఖర్ ధావన్ ఎల్బీ–పెరీరా 35, రాహుల్ రనౌట్ 57, చతేశ్వర్ పుజారా 128 నాటౌట్, విరాట్ కోహ్లి (సి) మాథ్యూస్ (బి) రంగనా హెరాత్ 13, అజింక్య రహానె 103 నాటౌట్, ఎక్స్‌ట్రాలు 8, మొత్తం 90 ఓవర్లలో 344/3.

బౌలింగ్: ఫెర్నాండో 17.4 –2– 63–0, రంగనా హెరాత్ 24 –3– 83–1, కరుణరత్నె 3–0–10–0, పెరీరా 18–2–68–1, పుష్పకుమార 19.2–0–82–0, డిసిల్వా 8–0–31–0.

స్వేచ్ఛగా తిరగలేక పోతున్నా

టీమిండియా కెప్టెన్ మిథాలీ



మన తెలంగాణ/ హైదరాబాద్: ప్రపంచకప్‌కు ముందు తనను హైదరాబాద్‌లో ఎవరూ పెద్దగా గుర్తు పట్టేవారు కాదని, ఇప్పుడూ పరిస్థితులు మారి పోయాయని భారత మహిళా క్రికెట్ కెప్టెన్ మిథాలీ రాజ్ అభిప్రాయపడింది. వరల్డ్‌కప్‌లో రన్నరప్‌గా నిలవడంతో తమకు అభిమానులు బ్రహ్మరథం పడుతున్నారని మిథాలీ చెప్పింది. గతంలో తాను హైదరాబాద్‌తో పాటు దేశంలోని ఇతర నగరాల్లో స్వేచ్ఛగా తిరిగేదానినని తెలిపింది. స్కూటిపై లేదా కార్లలో తిరుగుతూ తనకు ఇష్టమైన ఆహారాన్ని తినేదాన్నని, షాపింగ్‌లతో సరదగా గడిపేదాన్నని మిథాలీ వివరించింది. అయితే ప్రస్తుతం తమపై అభిమానులకు నమ్మకం ఏర్పడిందని, తాము ఎక్కడికి వెళ్లిన చుట్టూముట్టుతున్నారని తెలిపింది. తనతో పాటు సహచర క్రికెటర్లకు కూడా ఇటువంటి పరిస్థితే ఎదురవుతుందని మిథాలీ పేర్కొంది. ఇది చాలా ఆనందం కలిగించే విషయమని తెలిపింది. అయితే గతంలో లాగా తాము బయట తిరగాలంటే ఒకటికి రెండు సార్లు ఆలోచించాల్సిన పరిస్థితి నెలకొందని మిథాలీ వ్యాఖ్యానించింది. ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మిథాలీ ఈ విషయాన్ని తెలిపింది.



టైటాన్స్‌కు ఐదో ఓటమి

మన తెలంగాణ/ హైదరాబాద్: ఆతిథ్య తెలుగు టైటాన్స్ సొంత గడ్డపై వరుసగా ఐదో ఓటమిని మూట గట్టుకుంది. గురువారం జరిగిన ఆరో మ్యాచ్‌లో టైటాన్స్ 36–43 తేడాతో పట్నా పైరెట్స్ చేతిలో పరాజయం చవిచూసింది. పట్నా చేతిలో ఓడడం ఇది తెలుగు టైటాన్స్‌ను రెండోసారి కావడం విశేషం. గురువారం గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో పట్నా పూర్తి ఆధిపత్యం చెలాయించింది. ప్రారంభం నుంచే పట్నా పైచేయి సాధించింది. తెలుగు టైటాన్స్ జట్టులో కెప్టెన్ రాహుల్ చౌదరి మాత్రమే మెరుగైన ఆటను కనబరిచాడు. మిగతావారు అంతంత మాత్రంగానే రాణించారు. చూడచక్కని ఆటను కనబరిచిన రాహుల్ 12 పాయింట్లతో జట్టులో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. రాకేష్ కుమార్ ఆరు పాయింట్లు సాధించగా, నిలేష్ సలుంకె నాలుగు పాయింట్లతో అలరించాడు. అయితే మిగతా వారు విఫలం కావడంతో టైటాన్స్‌కు పరాజయం తప్పలేదు. ఇక, పట్నా జట్టులో ప్రదీప్ నర్వల్ చెలరేగి ఆడాడు. టైటాన్స్‌ను హడలెత్తించిన ప్రదీప్ ఏకంగా 12 పాయింట్లు సాధించాడు. మరోవైపు మోను గోయట్ 10 పాయింట్లు సాధించి జట్టు విజయంలో తనవంతు పాత్ర పోషించాడు. వినోద్ కుమార్, జైదీప్‌లు నాలుగేసి పాయింట్లు సాధించి జట్టుకు అండగా నిలిచారు. ఈ సీజన్‌లో పట్నాకు ఇది రెండో విజయం కావడం విశేషం. ఈ రెండు విజయాలు కూడా తెలుగు టైటాన్స్ మీదనే దక్కడం గమనార్హం.

రాణించిన మనీష్.. భారత్–ఎ గెలుపు

ప్రెటోరియా: సౌతాఫ్రికా–ఎతో జరిగిన వన్డే మ్యాచ్‌లో భారత్–ఎ ఒక వికెట్ తేడాతో ఉత్కంఠ విజయాన్ని సాధించింది. చివరి వరకు నువ్వా నేనా అన్నట్టు సాగిన ఈ మ్యాచ్‌లో భారత్ అద్భుత విజయాన్ని అందుకుంది. ముందుగా బ్యాటింగ్ చేసిన సౌతాఫ్రికా 48.2 ఓవర్లలో 266 పరుగులకు ఆలౌటైంది. వికెట్ కీపర్ క్లాసెన్ 12 ఫోర్లు, మూడు సిక్సర్లతో 127 పరుగులు చేసి జట్టును ఆదుకున్నాడు. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన భారత్ 9 వికెట్ల నష్టానికి 267 పరుగులు చేసి ఉత్కంఠ విజయాన్ని అందుకుంది. కెప్టెన్ మనీష్ పాండే ఐదు ఫోర్లు, రెండు సిక్సర్లతో అజేయంగా 93 పరుగులు చేసి జట్టును గెలిపించాడు.

శాస్త్రి అతి పొగడ్తలు మానుకో..



కోల్‌కతా : అతి పొగడ్తలు మానీ టీమిండియాపై దృష్టి పెట్టాలని ప్రధాన కోచ్ రవిశాస్త్రికి బిసిసిఐ సలహా మండలి చైర్మన్ సౌరవ్ గం గూలీ సలహా ఇచ్చాడు. ఇటీవల మీడియాతో మాట్లాడుతూ ప్రస్తుత టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లిని శాస్త్రి ఆకాశానికి ఎత్తేసిన విషయం తెలిసిందే. దీనిపై గంగూలీ తనదైన శైలిలో స్పందించాడు. రానున్న ప్రపంచకప్ నాటికి టీమిండియాను మెరుగైన జట్టుగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో సలహా మండలి శాస్త్రికి కోచ్ పదవి అప్పగించిందన్నాడు. దీనిపై అతను దృష్టి సారిస్తే మంచిదన్నాడు. ఈ విషయాలను పక్కనబెట్టి కొందరిని ఆకాశానికి ఎత్తివేస్తూ మరికొందరిని తక్కువ చేస్తూ మాట్లాడడం మంచిది కాదని హితవు పలికాడు. అయితే శాస్త్రి వ్యాఖ్యలకు తాను ప్రాధాన్యత ఇవ్వడం లేదన్నాడు. అతని పర్యవేక్షణలో టీమిండియా మెరుగైన జట్టుగా అవతరిస్తుందనే నమ్మకం తనకుందన్నాడు. శాస్త్రిపై తమకు పూర్తి నమ్మకం ఉందన్నాడు. తనకు అప్పగించిన బాధ్యతలను శాస్త్రి సమర్థంగా నిర్వర్తిస్తాడని గంగూలీ ధీమా వ్య క్తం చేశాడు. కాగా, ఒక వైపు రవిశాస్త్రిని పొగుడుతూనే అతని కామెంట్లపై పరోక్షంగా విమర్శలు గుప్పించాడు. గతంలో తన సారథ్యంలో పాకిస్థాన్, ఇంగ్లాండ్ గడ్డపై సాధించిన సిరీస్ విజయాలు శాస్త్రికి గుర్తు రావడం లేదా అని ప్రశ్నించాడు. కోహ్లి కంటే ముందే టీమిండియా తన సారథ్యంలో విదేశి సిరీస్‌లలో విజయం సాధించిన విషయాన్ని గంగూలీ ఇక్కడ ప్రస్తావించాడు. ఏదైన మాట్లాడేటప్పుడూ వాస్తవాలపై కూడా దృష్టి సారిస్తే మంచిదని శాస్త్రికి చురక అంటించాడు.

ఆసీస్ క్రికెట్‌లో వివాదానికి తెర



మెల్‌బోర్న్ : వేతనాలకు సంబంధించి క్రికెట్ ఆస్ట్రేలియాకు, ఆ దేశ క్రికెటర్లకు మధ్య తలెత్తిన వివాదం సమసి పోయింది. దీంతో చాలా కాలంగా ఈ విషయంలో నెలకొన్న అనిశ్చిత వాతావరణానికి తెరపడింది. గురువారం క్రికెట్ ఆస్ట్రేలియా, క్రికెటర్ల సంఘం ప్రతినిధులకు మధ్య జరిగిన చర్చలు సఫలవంతమయ్యాయి. దీంతో వేతనాలకు సంబంధిం చి ఇటీవల తీవ్ర రూపం దాల్చి న ఈ సమస్యకు సానుకూల పరిష్కారం లభించింది. పురుషులు, మహిళా క్రికెటర్లకు సమాన వేతనాలను ఇచ్చేందుకు క్రికెట్ ఆస్ట్రేలియా అంగీకరించింది. అంతేగాక, క్రికెటర్లు కోరినట్టుగానే లాభాల్లో 30 శాతం వాటాను ఇచ్చేందుకు కూడా క్రికెట్ ఆస్ట్రేలియా ఒప్పుకుంది. ఇరు వర్గాల మధ్య రాజీ కుదరడంతో ఆస్ట్రేలియా క్రికెటర్లు మళ్లీ కొత్త కాంట్రాక్ట్‌లపై సంతకం చేయనున్నారు. ఈ సందర్భం గా రెండు వర్గాలు మెట్టు దిగడంతో సమస్య పరిష్కారమైం ది. కాగా, ఈ అంశాన్ని ఇంతటితో ముగించి క్రికెట్‌పైనే దృ ష్టి పెట్టాలని క్రికెట్ ఆస్ట్రేలియా తమ ఆటగాళ్లను సూచించింది.

ఫ్లింటాఫ్‌తో పోల్చొద్దు : బెన్ స్టోక్స్



లండన్ : తనను స్టార్ ఆల్‌రౌండర్ ఆండ్రూ ఫ్లింటాఫ్‌తో పోల్చడాన్ని బెన్ స్టోక్స్ తప్పుపడుతున్నాడు. ప్రపంచంలోనే అత్యుత్తమ ఆల్‌రౌండర్‌లలో ఒకడిగా పేరొందిన ఫ్లింటాఫ్‌తో తాను సరితూగనని స్టోక్స్ స్పష్టం చేశాడు. తనను అతనితో పోల్చడాన్ని ఆపాలని ఈ సందర్భంగా సహచర క్రికెటర్లను కోరాడు. ఇటీవల దక్షిణాఫ్రికాతో ముగిసిన మూడో టెస్టులో బెన్‌స్టోక్స్ ఆల్‌రౌండ్ ప్రతిభతో ఇంగ్లాండ్‌ను గెలిపించిన విషయం తెలిసందే. ఈ మ్యాచ్‌లో సెంచరీ చేయడమే కాకుండా బంతితోనూ రాణించి కీలకమైన మూడు వికెట్లను పడగొట్టాడు. దీంతో అతనిపై ఇంగ్లాండ్ స్పీడ్‌స్టర్ స్టువర్ట్ బ్రాడ్ ప్రశంసల వర్షం కురిపించాడు. స్టోక్స్ బౌలింగ్, బ్యాటింగ్ అచ్చం ఫ్లింటాఫ్‌ను తలపించేలా ఉన్నాయని బ్రాడ్ అభిప్రాయపడ్డాడు. దీనిపై స్టోక్స్ ఈ విధంగా స్పందించాడు. ఫ్లింటాఫ్ ఓ అసాధారణ ఆటగాడని, అతనితో తనను పోల్చడం తగదన్నాడు. తానిప్పుడిప్పుడే క్రికెట్‌లో రాణిస్తున్నానని, ఇంకా చాలా దూరం ప్రయాణించాల్సి ఉందని చెప్పాడు. ఈ నేపథ్యంలో దిగ్గజ క్రికెటర్లతో తనను పోల్చడాన్ని ఇబ్బందిగా భావిస్తున్నట్టు స్టోక్స్ స్పష్టం చేశాడు.

Printed and published by K Sreenivas Reddy, Printed at M/s. JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, D-75 & C-52, Industrial Estate (APIE), Balanagar-500037, R.R.Dist., TELANGANA and Published from H.No.12-1-493/VA, Giriprasad Bhavan,Opp:Rajiv Swagruha Offices Complex, Bandlaguda Main Road, Nagole, R.R. Dist. and owned by M/s. Moveon Media Private Limited, **Editor: K. Sreenivas Reddy,** RNI Regn. No.TELTEL/2012/42234, Phone No/Fax:040-27655666, e-mail : editor@manatelangana.org.